

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 339

మంగళవారం 22-8-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



తిలక్‌కు లక్కీ చాన్స్..

ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ - 12లో



జియో ఫైనాన్స్ లిస్టింగ్

బీఎస్ఈలో రూ. 265 వద్ద ప్రారంభం.. 5 శాతం నష్టంతో ముగింపు - 13లో



అప్పుడంతా కుంభకోణాలమయం

దేశంలో 2014కు ముందు కుంభకోణాలే రాజ్యమేలాయని.. పేద ప్రజల సంపదను దోచుకున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



క్షిపణుల నుంచి సంగీతం వరకు..

అడ్డంకులను అధిగమిస్తూ మహిళలు క్షిపణుల నుంచి సంగీతం వరకు తమదైన ముద్ర వేశారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారు.

వివరాలు 6లో ▸



హిల్లరీ తుపాను బీభత్సం

అమెరికా దేశవ్యాప్తంగా హిల్లరీ తుపాను ధాటికి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు చోట్ల రహదారులు పూర్తిగా నీట మునిగాయి.

వివరాలు 6లో ▸



మణిపూర్ రోడ్లు దిగ్బంధం

నిత్యావసరాలను అందజేయాలని డిమాండ్ చేస్తూ మణిపూర్‌లోని కాంగ్‌పోక్పిలో జాతీయ రహదారులపై కుకీలు ఆందోళనకు దిగారు.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్



'నాడు-నేడు' కళ్లతో చూడు

- ప్రభుత్వ విద్యపై రామోజీ విద్వేషం
- పేద ప్రజల ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా తప్పుడు రాతలు
- గత ప్రభుత్వం గాలికొదిలేసిన సర్కారు బడిని గాడిలో పెడుతుంటే ఆరోపణలా?
- 'నాడు-నేడు' తొలిదశలో రూ.3,669 కోట్లతో 15,713 పాఠశాలలకు మోక్షం
- పాఠశాలల్లో ఏర్పాటుచేసిన యంత్రాలకు ఐదేళ్ల వారంటీ..
- ఇప్పటిదాకా 18,802 నీటిశుద్ధి యంత్రాల రిపేర్లను కంపెనీలే చేశాయి
- తాగునీటి యంత్రాల మెరుగైన నిర్వహణకు ఐఐటీ మద్రాస్ నిపుణుల సాయం
- దురుద్దేశంతో ప్రభుత్వ బడులపై ఎల్లో మీడియా విషప్రచారం

3 లో


విజయవాడలో జరిగిన ఏపీఎన్జీవోల సంఘం మహాసభకు హాజరైన ఉద్యోగులు

ఉద్యోగుల ఆకాంక్ష తీరేలా!

ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో సీఎం జగన్ శుభవార్త

- ఉద్యోగులకు పండుగ కానుకగా దసరాకి 'డీఏ'
- పెండింగ్‌లో ఉన్న ఒక డీఏ విడుదల చేస్తాం
- వైద్య ఆరోగ్యశాఖలో మహిళలకు 5 అదనపు సెలవులు
- మీ సమస్యలను నిజాయితీతో పరిష్కరించా
- మీ సంతోషం, మీ భవిష్యత్తు నా బాధ్యతే
- ఏ ప్రభుత్వంతో పోల్చినా గతం కంటే మిన్నగా చేశాం
- ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేసిన వ్యక్తి చంద్రబాబు
- ఆల్విన్, చిత్తూరు డెయిరీ లాంటి 54 ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేశాడు.. ఉద్యోగులు లంచగొండులని మనసులో మాట పుస్తకంలో స్వయంగా రాసుకున్నాడు
- ఆ పుస్తకాన్ని ప్రతి ఉద్యోగీ చదవాలని కోరుతున్నా
- అలాంటి వ్యక్తి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నాడు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా పండుగ కానుకగా 2022 జూలై ఒకటికి సంబంధించిన డీఏ ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. బకాయి ఉన్న రెండు డీఏల్లో ఒకటి పండుగ రోజు ఇస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో మహిళా ఉద్యోగులకు ఇతర శాఖల ఉద్యోగుల మాదిరిగానే 5 రోజులు అడిషనల్ లీవులు ఇస్తామని చెప్పారు. సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ ఎన్జీవోల సంఘం 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సీఎం జగన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల ప్రయోజనాలు, వారికి మంచి చేసే విషయంలో గతంలోని అన్ని ప్రభుత్వాల కంటే

మిగతా 2వ పేజీలో ▶


ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'ఇంగ్లిష్' ప్రావీణ్య ఉపాధ్యాయులకు అవార్డులు

ఏటా ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఇవి అదనం

నేటి నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మాధ్యమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో ఉత్తమ ఇంగ్లిష్ బోధనా నైపుణ్యాలు గల ఉపాధ్యాయులను సత్కరించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఏటా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలతో సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి అదనంగా ఈ ఏడాది ప్రత్యేకంగా ఇంగ్లిష్‌లో బోధనా నైపుణ్యం గల ఉపాధ్యాయులను ప్రత్యేక కేటగిరీ కింద సత్కరించనుంది. ఇందుకోసం ప్రపంచంలో ఉపాధ్యాయుల నైపుణ్యాలను పరీక్షించే అతిపెద్ద సంస్థ.. సెంటర్ ఫర్ టీచర్ అక్రిడిటేషన్ (సెంటా) సహకారాన్ని తీసుకుంటున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. భారతదేశంలో 80 శాతం ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని

మిగతా 10వ పేజీలో ▶

సిట్టింగ్‌లకే బీఆర్ఎస్ పెద్దపీట



- తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలకు 115 మందితో తొలి జాబితా
- 2, 3 రోజుల్లో మిగతా 4 స్థానాలకు అభ్యర్థులు
- గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలోనూ కేసీఆర్ పోటీ

3 లో

ఫైనల్లో ప్రజ్ఞానంద

ప్రపంచకప్ చెస్ టోర్నీ సెమీస్‌లో కరువానాపై గెలుపు

12 లో


పోలవరం పవర్ హౌస్ (ఫైల్)

అనుకున్న సమయానికే 'పోలవరం పవర్ హౌస్'

2024 జూలై నాటికే మూడు యూనిట్ల నిర్మాణం

- 2024–25 సంవత్సరంలో 560 మెగావాట్ల ఉత్పత్తి
- 2025–26లో అందుబాటులోకి మొత్తం 12 యూనిట్లు
- నిర్వహణపై ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు
- 41.15 మీటర్ల వరకే నీరు నిల్వ ఉన్నా ఉత్పత్తి ఆగదు
- 'సాక్షి'తో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2025 జూన్‌కి పూర్తవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అదే సమయానికి పోలవరం జల విద్యుత్ కేంద్రం (పవర్ హౌస్) పూర్తవుతుందని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధర్ బాబు వెల్లడించారు. 12 యూనిట్లతో 960 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించే ఈ విద్యుత్ కేంద్రం ప్రగతిపై ఆయన సోమవారం 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు చౌకగా విద్యుత్ అందించడానికి ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఆయన చెప్పిన ముఖ్యాంశాలు

మిగతా 3వ పేజీలో ▶

రేపే చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్..

ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న చంద్రయాన్-3 ల్యాండర్ అంతిమ గమ్యానికి సమయం సమీపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే బుధవారం సాయంత్రం సరిగ్గా 6.04 గంటలకు ల్యాండర్ 'విక్రమ్' చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై కాలు మోపనుంది. సాయంత్రం 5.20 గంటల నుంచే ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం కానుంది. ల్యాండర్ క్షేమంగా చంద్రుడిపై దిగితే భారతీయులకే కాదు, ప్రపంచానికి కూడా అదొక చిరస్మరణీయ ఘట్టమే అవుతుంది.



6 లో

కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధితులు


కోలుకుంటున్న పాడేరు బస్సు ప్రమాద బాధితులు

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఉన్న 21 మందికి నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స
- సీఎం జగన్ ఆదేశాల మేరకు బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు మంత్రుల ఆరా
- క్షతగాత్రులకు అందుతున్న సేవలపై సీఎంవోకు నివేదిక

3 లో

విద్యుత్ ఉద్యోగులకు 'మాస్టర్ స్కేల్'



- విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగుల పీఆర్సీపై ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. కొత్త పీఆర్సీ గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఉద్యోగులకు 24.99 శాతం డీఏతో పాటు 8 శాతం ఫిట్‌మెంట్ లభిస్తుంది. 12 వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు చెల్లిస్తారు. పింఛన్‌దారులకు కూడా 8 శాతం ఫిట్‌మెంట్ వర్తిస్తుంది.

10 లో

రక్షణ రంగానికి బ్రాండ్‌గా విశాఖ



- 'రక్షణ రంగానికి ఒక బ్రాండ్‌గా మారేందుకు విశాఖలో పుష్కల అవకాశాలున్నాయి. ఎన్ఎస్‌టీఎల్, నేవీ, షిప్‌యార్డుకు సహకారం అందించేలా బీఈఎల్ మాదిరిగా పలు సంస్థలు వస్తే.. ఆ వెంటే ఎంఎస్ఎంఈలు కూడా ఏర్పాటవుతాయి' అని డీఆర్‌డీవో నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డా.వై శ్రీనివాస రావు అన్నారు.

3 లో



బేల 'గళం'!


175 చోట్ల అభ్యర్థులను నిలబెట్టలేని దుస్థితిలో చంద్రబాబు

లోకేశ్ పాదయాత్రకు ముఖం చాటేసిన ఇద్దరు టీడీపీ ఎంపీలు

- యువగళాన్ని బహిష్కరించిన కేశినేని నాని, గల్లా జయదేవ్
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తేలిపోయిన యాత్ర
- గన్నవరంలో వలస నేతకు స్వాగతం
- అభ్యర్థులు లేక ఉమ్మడి కృష్ణాలో 5 నియోజకవర్గాల్లోనే లోకేశ్ పాదయాత్ర
- రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి అభ్యర్థుల కొరత

సాక్షి, అమరావతి: ఎల్లో మీడియాలో బిల్డప్‌లు.. సోషల్ మీడియాలో హంగామా! పెదబాబు, చినబాబు మేకపోతు గాంభీర్యాలు.. !! యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ సినిమా డైలాగ్‌లను వల్లె వేస్తున్నా టీడీపీలో చాలా నియోజకవర్గాలకు అభ్యర్థులే లేకపోవడమే అసలు విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. ఉన్న నేతలు కూడా చంద్రబాబును లెక్క చేయడం లేదు. లోకేశ్‌నైతే అసలు పట్టించుకోవడమే లేదు. ఆ పార్టీ తరపున గెలిచిన ముగ్గురు ఎంపీల్లో ఇద్దరు యువగళం యాత్రను బహిష్కరించడమే ఇందుకు ఉదాహరణ. లోకేశ్ తమ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేసినా గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్, విజయవాడ ఎంపీ కేశినేని నాని అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. దీంతో ఎవరెవరినో బతిమాలుకుని

మిగతా 3వ పేజీలో ▶



గత్యంతరం లేకనే 'కొత్త' నినాదం

తమకు బలం ఉందని చెప్పుకునే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో టీడీపీ సత్తా ఏమిటో తేలిపోయింది. అభ్యర్థులు లేకపోవడం, ఉన్న వారి మధ్య గొడవలతో పార్టీ పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ రెండు జిల్లాల్లోనే ఇలా ఉంటే ఇక మిగిలిన జిల్లాల్లో పరిస్థితి ఏమిటో ఊహించవచ్చు. 50కిపైగా నియోజకవర్గాల్లో టీడీపీకి అభ్యర్థులే లేకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులతో నెట్టుకొస్తున్నారు. ఇక గత్యంతరం లేక కొత్త వారికి అవకాశం ఇస్తామనే నినాదాన్ని ఎత్తుకున్నారు. అయినా మునిగిపోయే నావ లాంటి టీడీపీలో చేరేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఈ నేపథ్యంలో 175 స్థానాలకు టీడీపీ తన అభ్యర్థులను నిలబెట్టే పరిస్థితులు లేవని స్పష్టమవుతోంది.

రాష్ట్రంలో భారీగా పెరిగిన ఐటీ చెల్లింపుదారులు



- రాష్ట్రంలో దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజల ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. ఫలితంగా ఆదాయాన్ని వెల్లడించి ప్రభుత్వానికి పన్ను చెల్లించే ట్యాక్స్ పేయర్ల సంఖ్య కూడా పెరుగుతోంది. గత మూడేళ్లలో రాష్ట్రంలో ట్యాక్స్ పేయర్ల సంఖ్య ఏకంగా 18 లక్షలు పెరిగిందని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది.

14 లో

క్లుప్తంగా...

'హౌస్‌హోల్డ్ డేటా' వినతుల పరిష్కారానికి కాలపరిమితి 21 రోజులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నిటికీ మాస్టర్ డేటాగా తీసుకుంటున్న నవశకం సర్వే (హౌస్‌హోల్డ్) డేటాలో కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పులకు సంబంధించిన వినతుల పరిష్కారానికి గరిష్ట కాలపరిమితిని ప్రభుత్వం 21 రోజులకు తగ్గించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో వినతుల పరిష్కారానికి నిర్దేశించిన ఎస్ఎల్ఏ కాలపరిమితిలో మార్పులు చేశారు. ఈ తరహా వినతుల పరిష్కారానికి గరిష్ట కాలపరిమితి 180 రోజులుగా ఉండేది.

స'లక్ష'ణంగా డీజీ యాత్ర రిజిస్ట్రేషన్లు

గన్నవరం విమానాశ్రయం సరికొత్త రికార్డ్



డీజీ యాత్ర కోసం కియోస్క్‌లు

విమానాశ్రయం(గన్నవరం): విమానాశ్రయాల్లో సులభతర ప్రవేశాల కోసం కేంద్ర పౌర విమానయాన శాఖ తెచ్చిన డీజీ యాత్ర రిజిస్ట్రేషన్లలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) సరికొత్త రికార్డు సృష్టించింది. అతి తక్కువ కాలంలోనే ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి లక్ష మంది డీజీ యాత్ర యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రయాణం చేశారు. దేశీయ ప్రయాణాల కోసం టెర్మినల్‌లోని సెక్యూరిటీ చెక్, బోర్డింగ్ పాయింట్ల వద్ద వేచి ఉండకుండా డీజీ యాత్ర యాప్‌ను కేంద్రం తెచ్చింది. ఈ సేవల కోసం టెర్మినల్ ఆవరణలో నాలుగు కియోస్క్‌లను, డీజీ యాత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు స్కానర్లను ఏర్పాటు చేశారు. ఈ యాప్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో సెక్యూరిటీ చెకింగ్, బోర్డింగ్ పాస్ వద్ద ప్రయాణికులు క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన అవసరం లేదు.

పరిశ్రమల కమిషనర్‌గా రాజేశ్వర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ స్పెషల్ కమిషనర్ సీహెచ్ రాజేశ్వర్ రెడ్డికి పరిశ్రమల కమిషనర్‌గా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

300 స్పెషలిస్ట్ వైద్యుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ



సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో 14 స్పెషాలిటీల్లో 300 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చే నెల 5, 7, 10 తేదీల్లో ఇంటర్వ్యూల ద్వారా పోస్టుల భర్తీ చేపట్టనున్నట్టు బోర్డు మెంబర్ సెక్రటరీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సెప్టెంబర్ 5వ తేదీన జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, 7వ తేదీన గైనకాలజీ, అనస్తీషియా, ఈఎన్‌టీ, పాథాలజీ, 10వ తేదీన పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ, రేడియాలజీ, చెస్ట్ డిసీజెస్ స్పెషాలిటీల వారీగా ఇంటర్వ్యూలుంటాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. రెగ్యులర్ (లిమిటెడ్, జనరల్)/కాంట్రాక్ట్ విధానాల్లో వైద్యులను నియమించనున్నారు. వివరాలకు http://hmfw.ap.gov.in/వెబ్‌సైట్‌ను, 6301138782 నంబర్‌ను సంప్రదించొచ్చు.

ఖరీఫ్‌లో 40 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి

పౌర సరఫరాల శాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ అరుణ్‌కుమార్



సాక్షి, అమరావతి: ఖరీఫ్‌లో 40 లక్షల టన్నుల ధాన్యంతో పాటు తొలిసారిగా రైతుల నుంచి మద్దతు ధరకు కొర్రలు కొనుగోలు చేసేందుకు కేంద్రం అనుమతిచ్చిందని పౌర సరఫరాల శాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఢిల్లీలో ఖరీఫ్-2023 కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ కార్యదర్శుల జాతీయస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏపీకి కేటాయింపులపై అరుణ్‌కుమార్ సాక్షితో మాట్లాడుతూ.. సాధారణ రకాలతోపాటు 4 లక్షల టన్నుల బాయిల్డ్ వెరైటీలను కొనుగోలు చేస్తామన్నారు. కేంద్రం అనుమతికి మించి ధాన్యం కొనాల్సి వస్తే సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు ధరకు కొర్రలు కొనుగోలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాగులకు ఇచ్చే మద్దతు ధర క్వింటా రూ.3,846కే కొర్రలను కూడా కొనుగోలు చేసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం సమ్మతించిన విషయాన్ని అరుణ్‌కుమార్ వెల్లడించారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటనతో సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళా ఉద్యోగులు



సీఎం వైఎస్ జగన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

ఉద్యోగుల ఆకాంక్ష తీరేలా!

▶ మొదటి పేజీ తరువాయి

ఎంతో ముందున్నామని తెలిపారు. ఉద్యోగులకు మంచి చేసే విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గే పరిస్థితే లేదని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులదని, వారికి తోడుగా ఉంటున్న ప్రభుత్వమని చెప్పారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మీ భుజ స్కంధాలపైనుంచే...

సంక్షేమాన్ని అందించడం, అభివృద్ధిని పంచిపెట్టడం, సేవా ఫలాలను ప్రజల దాకా తీసుకెళ్లడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు ఉద్యోగులే. విధాన నిర్ణయాలు తీసుకునేది రాజకీయ వ్యవస్థ, ముఖ్యమంత్రి అయితే వాటిని అమలు చేసేది మీరే. పౌర సేవలు ప్రజల వద్దకు డెలివరీ అయ్యేది మీ భుజ స్కంధాలపైనుంచే. మీ సంతోషం, మీ భవిష్యత్ మన ప్రభుత్వ ప్రాధాన్యతలేనని మీ అందరికీ మరోసారి భరోసా ఇస్తున్నా. అది నా బాధ్యత. ప్రభుత్వం అనే కుటుంబంలో కీలక సభ్యులైన మీ అందరి పట్ల అభిమానాన్ని, గౌరవాన్ని, ప్రేమను, మరీ ముఖ్యంగా నిజాయితీని చాటే విషయంలో మన ప్రభుత్వం గతంలో ఏ ప్రభుత్వంతో పోల్చినా మిన్నగా, సానుకూలంగా ఉందని సవినయంగా తెలియజేస్తున్నా.

ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాం

2019లో అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించేందుకు ఆర్నెల్లలోనే గ్రామ స్థాయిలో సేవలను అందుబాటులోకి తెచ్చాం. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో ఎంత కమిట్‌మెంట్ చూపించామంటే ఏకంగా 1.35 లక్షల శాశ్వత ఉద్యోగాలను ప్రతి గ్రామం, మున్సిపాలిటీ వ్యవస్థలో సచివాలయ వ్యవస్థ ద్వారా రిక్రూట్ చేశాం. చాలామంది ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం అసాధ్యమన్నారు. వారి బాధలకు వాళ్లను వదిలేయాలని ఎంతో మంది సలహా ఇచ్చారు. విలీనంతో ఎన్నో సమస్యలు వస్తాయన్నారు. అయినాసరే ఆర్టీసీ ఉద్యోగులపై మమకారంతో కమిట్‌మెంట్‌లో ఎక్కడా లోపం చేయలేదు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం మీరందరూ చూశారు. నిజాయితీగా, కమిట్‌మెంట్‌తో అడుగులు వేశాం. పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచిన ప్రభుత్వం మనందరిది. గత ప్రభుత్వ హయాంలో అతి తక్కువ జీతాలకు పని చేస్తూ ఎన్నికలకు 6 నెలలు ముందు వరకు రూపాయి కూడా జీతం పెరగక దయనీయ పరిస్థితిలో ఉన్న ఉద్యోగుల జీతాలను మనం వచ్చాక పెంచాం. గత పాలకులు ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు వారికి జీతాలు పెంచాలనే ఆలోచనే చేయలేదు. ఓట్లు వేయించుకోవాలన్న దుర్బుద్ధితో ఎన్నికలకు ముందు పెంచారు. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీతాలను మరింత పెంచి మొట్ట మొదటి రోజు నుంచి పెంచిన జీతాలు ఇస్తున్నాం. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వీఓఏలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, శానిటేషన్ వర్కర్లు, గిరిజన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, హోంగార్డులు, మధ్యాహ్న భోజనం వండే ఆయాలు.. వీరందరి జీతాలను మనమే మనసు పెట్టి పెంచి ఇస్తున్నాం.

జీతాల బడ్జెట్ మూడు రెట్లు పెంపు..

గత ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1,100 కోట్లు మాత్రమే ఉండే జీతాల బడ్జెట్ ఇప్పుడు రూ.3,300 కోట్లకు ఎగబాకినా చిరునవ్వుతో అందరికీ మంచి చేస్తున్నాం. కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఎస్ఓఆర్ (స్టేట్ ఓన్ రెవెన్యూ) తగ్గినా డీబీటీ ద్వారా పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అందించాం. ఇవన్నీ జరగబట్టే ఈరోజు ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రతి పేదవాడి మొహంలో చిరునవ్వు ఉంది అంటే దానికి కారణం మీరు (ఉద్యోగులు) మీరు డెలివరీ చేసిన విధానం అని చెప్పడానికి గర్వపడుతున్నా. ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ప్రజలను కష్టాలకు వదిలేయలేదు. ఉద్యోగుల పట్లా మానవత్వంతో వ్యవహరించాం. గత ప్రభుత్వాలు పట్టించుకోకుండా వదిలేసిన ఆర్టీసీ కారుణ్య నియామకాల విషయంలోగానీ 10 వేలకుపైగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో గానీ ఏపీ వైద్య విధాన పరిషత్‌లోని 14,658 మందిని ప్రభుత్వంలోకి తీసుకొనే విషయంలోగానీ జిల్లా కేంద్రాలన్నింటిలోనూ 16 శాతం హెచ్ఆర్ఏ ఇచ్చే విషయంలోగానీ ఆర్టీసీ నష్టాల్లో ఉన్నా 55 వేల మంది సిబ్బందిని క్రమబద్ధీకరించడంలోగానీ 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చే విషయంలోగానీ భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోట్‌చేసే విషయంలోగానీ ఎంఈవోల నియామకాలు, ఎంపీడీవోలకు ప్రమోషన్లు ఇవ్వడం.. ఇలా అనేక అంశాల్లో గత ప్రభుత్వం మాదిరిగా మన ప్రభుత్వం ఎవరికీ అన్యాయం చేయలేదు. ప్రతి సమస్యనూ పరిష్కరించాలి, ఉద్యోగుల ముఖంలో చిరునవ్వు చూడాలనే తపన, తాపత్రయంతో సమస్యలను పరిష్కరిస్తూ ఉద్యోగులకు తోడుగా నిలిచాం. కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వడం మొదలు పెట్టింది మనందరి ప్రభుత్వమే. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ కిందకు తెచ్చి కమిషన్లు లేకుండా నెలలో మొదటి వారంలోనే జీతాలు ఇచ్చేలా అండగా నిలబడగలిగాం.

ప్రతి గ్రామంలో నాడు - నేడు ఉద్యోగులు ఎంతమంది?

మీరే చూడండి.. గతంలో ప్రతి గ్రామంలో ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండే వారు? ఎన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి? ఈరోజు ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు? ఎన్ని కార్యాలయాలు గ్రామంలో ఉన్నాయో ఆలోచన చేయండి. సచివాలయాలు మొదలు రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ స్కూళ్లు.. కళ్లెదుటే కనిపిస్తున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థలే. వీటన్నింటినీ గత నాలుగేళ్లలోనే విస్తరించాం. ఇవన్నీ బాగుంటేనే ప్రజలు బాగుంటారు. ఉగ్యోగులు కూడా బాగుంటారు.

చంద్రబాబు లాంటి పాలకుడు ఉంటే..

చంద్రబాబు లాంటి పాలకుడు ఉంటే ఇవన్నీ తీసేస్తారు. గవర్నమెంట్ ఆస్పత్రులు నిర్వీర్యమవుతాయి. పేషెంట్లు రావడం మానేస్తారు. పేషెంట్లు రావడం లేదని ఆస్పత్రులను తొలగిస్తారు. ఆర్టీసీని బాగా నడపలేకపోతే ప్రజలు రావట్లేదు కదా.. ఇక ఆర్టీసీ బస్సులు ఎందుకు? ఆర్టీసీ కార్మికులు ఎందుకని వాటిని మూసివేసే కార్యక్రమం చేస్తారు. ఇవాళ 26 జిల్లాలతో ప్రభుత్వ వ్యవస్థ విస్తరించింది. ఈరోజు 7 నియోజకవర్గాలకు ఓ కలెక్టర్, ఎస్పీ, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, గ్రామస్థాయిలో సచివాలయాలు, సిబ్బంది, అడుగడుగునా 50 ఇళ్లకు వలంటీర్ వ్యవస్థ ఉన్నాయి. ఈ స్థాయిలో ప్రభుత్వం, ఉద్యోగులంతా సేవలందించేందుకు ఉత్సాహంగా అడుగులు వేస్తున్న పరిస్థితి.

సీపీఎస్ సమస్యపై నిజాయితీగా మనసు పెట్టా

అనేక ఏళ్లుగా పరిష్కారం చూపకుండా గత ప్రభుత్వాలు గాలికి వదిలేసిన సీపీఎస్ సమస్యను పరిష్కరించేందుకు నిజాయితీగా, మనసు పెట్టి అడుగులు వేశాం. అనేక సమావేశాలు, ఆలోచనలు, ఒకటిన్నర సంవత్సరం.. ఈ స్థాయిలో అధ్యయనం చేసిన పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు. విదేశాల్లో అమలవుతున్న రకరకాల పెన్షన్ స్కీములను కూడా అధ్యయనం చేశాం. రిటైర్ అయిన తర్వాత కూడా ఉద్యోగులు చిరునవ్వుతో జీవించేలా, న్యాయం జరిగేలా ఆర్డినెన్స్‌కు పంపించాం. జీపీఎస్.. గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను తెచ్చాం. మాట తప్పే ఉద్దేశమే ఉంటే ఇది అమలు చేయలేమని చెప్పి ఊరుకునేవాళ్లం. కానీ మంచి చేయాలి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే తపన, తాపత్రయంతో పని చేశాం. ఈ విషయంలో నేను గడిపినంత సమయం.. బహుశా చాలా తక్కువ విషయాల్లో నేను ఇంత టైమ్ ఇచ్చి ఉంటా. ఒక మంచి సొల్యూషన్ ఇవ్వగలిగాం. రాబోయే రోజుల్లో దేశమంతా ఈ పెన్షన్ స్కీమ్‌ను కాపీ కొట్టి అనుసరించే పరిస్థితి వస్తుంది.

ప్రభుత్వ రంగాల మూసివేతలో రికార్డు బాబుదే

ప్రభుత్వ రంగాలను మూసివేయడం, వీఆర్ కూడా ఇవ్వకుండా గోల్డెన్ హ్యాండ్ షేక్ అంటూ ఉద్యోగులను ఇంటికి పంపడంలో గత ప్రభుత్వానిది ఓ అడ్డగోలు రికార్డు. కొన్నేళ్ల క్రితం చంద్రబాబు నాయుడు రాసిన మనసులో మాట పుస్తకాన్ని ప్రతి ఉద్యోగీ చదవాలని విజ్ఞప్తి చేస్తున్నా. (మనసులో మాట పుస్తకంలో కొన్ని అంశాలను సీఎం జగన్ చదివి వినిపించారు). 2,70,700 ఉద్యోగాలను సమీక్షించి 40.62 శాతం అదనంగా ఉన్నాయని ఆ పుస్తకంలో ఆయన రాసుకున్నారు. శాశ్వత ఉద్యోగాల కాలపరిమితిని పరిశీలించాలని, 1996-97లోనే సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని శాశ్వత ప్రాతిపదికన నియమించటాన్ని ప్రభుత్వం మానేసిందని చంద్రబాబు తన పుస్తకంలో ప్రస్తావించారు. ఓ విద్యా సంవత్సరానికి కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగుల ఎంపిక ప్రారంభించామని, ప్రభుత్వ ఉద్యోగాలను కాంట్రాక్టు ప్రాతిపదికన ఇవ్వాలని, సిబ్బంది సంఖ్యను తగ్గించడానికి అది ఉత్తమ మార్గమని చంద్రబాబు తన మనసులో మాట చెప్పారు. కొత్త నియామకాలు చేపట్టకూడదు. ఇవీ చంద్రబాబు మనసులో ప్రభుత్వ ఉద్యోగుల పట్ల అభిప్రాయం. విద్యుత్ సంస్థ ఉద్యోగుల్లో 66 శాతం, పౌర సరఫరాల సంస్థలో 65 శాతం, రెవెన్యూలో 64 శాతం, పోలీసు శాఖలో 62 శాతం, స్థానిక సంస్థల్లో 52 శాతం మంది అవినీతిపరులేనని తేలినట్లు చంద్రబాబు స్వయంగా ఆ పుస్తకంలో రాసుకున్నారు. అదే ప్రజాభిప్రాయమంటూ తనకు నచ్చిన పర్సెంటేజీని జోడించి పుస్తకాన్ని ముద్రించారు. కనీసం ఈ నంబర్లు రాసే ముందు ఎవరిని అడిగారు? ప్రతి ఆఫీసుకూ వెళ్లి.. వీళ్ల మాత్రమే మంచోళ్లు, మిగతావాళ్లంతా లంచగొండులనే అధికారం ఎవరిచ్చారని చంద్రబాబును ప్రశ్నిస్తున్నా. ఒకటి రెండు కేసుల్లో ఆఫీసర్లు లంచాలు తీసుకుంటే ఏసీబీ వాళ్లు రైడ్ చేస్తే కలెక్టర్ యాక్షన్ తీసుకుంటారు. తనంతట తానే లెక్కలు గట్టి అంతా లంచగొండులేనని, వాటిని మూసేయాలి, ప్రైవేట్ పరం చేయాలంటూ ఆ పెద్దమనిషి పుస్తకంలో రాశాడు. మరి ఇలాంటి మనిషి రేపొద్దున మీకు మంచి చేయగలడా? అని ఆలోచన చేయాలి.



నాడు 3.97 లక్షలు.. నేడు అదనంగా 2.06 లక్షల ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో కొత్త రికార్డులు నెలకొల్పిన ప్రభుత్వం మనది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2019 వరకు 3.97 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే మనం అధికారంలోకి వచ్చాక 2,06,388 మందిని కొత్తగా నియామకాల ద్వారా శాశ్వత ఉద్యోగులుగా నియమించాం. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో 1.35 లక్షల మంది, హెల్త్ సెక్టార్‌లో 53,126 మంది ఉద్యోగులు మన కళ్లెదుటే కనిపిస్తారు. నష్టాల ఊబి నుంచి ఆర్టీసీని, ఉద్యోగులను కాపాడేందుకు 53 వేల మందిని రెగ్యులరైజ్ చేశాం. మెరుగైన ప్రభుత్వ వ్యవస్థ కోసం ఇవన్నీ చేశాం. గత ప్రభుత్వ డ్రామాలతో విసిగిపోయిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంపై కేబినెట్‌లో చర్చించాం. తొలుత 2014 జూన్‌కు ముందు 5 సంవత్సరాలు ఇస్తే సరిపోతుందనుకున్నాం. కానీ నేను జిల్లాలకు తిరగడం మొదలు పెట్టాక.. మాకు ఇబ్బందులున్నాయి, వాళ్లకు అవుతున్నాయి, మాకు రెగ్యులరైజ్ కావడం లేదని చెప్పారు. దీనిపై ఆలోచన చేశా. వారి ముఖంలో కూడా చిరునవ్వు చూడాలని మళ్లీ కేబినెట్‌లో పెట్టి వీరందరికీ ఇచ్చాం. మనసు పెట్టి మిగతావారికి కూడా మంచి జరగాలి, వారి ముఖంలో చిరునవ్వులు చూడాలనే తపన, తాపత్రయంతో అడుగులు వేశాం. దళారీ వ్యవస్థను తొలగించి ఆప్కాస్ ద్వారా ఒకటో తారీఖునే జీతాలు వచ్చేలా, లంచాలు, కటింగ్‌లు లేకుండా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ తెచ్చి చిరు ఉద్యోగులకు మంచి జరిగేలా అడుగులు వేశాం. ఉద్యోగులు నిశ్చింతగా తమ ఉద్యోగాలు చేసుకునేలా తగిన వాతావరణం కల్పిస్తూ అడుగులు ముందుకు వేశాం.



పోలీసులు, ఉద్యోగులపై భౌతిక దాడులా?

పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులపై టీడీపీ నేతలు పగబట్టి భౌతిక దాడులు జరుపుతున్నారు. 47 మంది పోలీసులపై పుంగనూరులో దాడి చేశారు. ఒకరి కన్ను కూడా పోయింది. పోలీసులు ఏం పాపం చేశారని దాడులు చేశారు? కన్ను పోగొట్టడానికి మీరు ఎవరు? ''మీకు పర్మిషన్ ఉన్న రూట్‌లో వెళ్లండి.. వేరే రూట్‌లో పోవద్దండి.. వేరే పార్టీ వాళ్లు ధర్నా చేసుకుంటున్నారు. గొడవలు జరుగుతాయి..'' అని పోలీసులు చెబితే శాంతి భద్రతల సమస్య సృష్టించి శవ రాజకీయాలకు కూడా వెనుకాడని వారిని గమనించమని కోరుతున్నా.

ఉద్యోగులకు మేలుపై వెనక్కి తగ్గం

ఉద్యోగుల ప్రయోజనాలు, వారికి మంచి చేసే విషయంలో ఎక్కడా వెనక్కు తగ్గే పరిస్థితి లేదని మరొక్కసారి మీకు తెలియజేస్తున్నా. రెండు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని శీనన్న (ఎన్జీవోల సంఘం చైర్మన్) అన్నారు. 2022 జూలై 1కి సంబంధించిన డీఏని దసరారోజు ఇచ్చే కార్యక్రమం చేస్తా. మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో మహిళా ఉద్యోగులకు మిగతా వారిలా 5 రోజుల అడిషనల్ హాలిడే కోరారు. దాన్ని కూడా మంజూరు చేస్తున్నాం. ఈ ప్రభుత్వం మీది. మీకు తోడుగా ఉంటున్న ప్రభుత్వం. ఆర్థిక ఇబ్బందులతో కొద్దో గొప్పో మీరు అనుకున్న స్థాయిలో నేను చేయలేకపోయి ఉండవచ్చు. కానీ మనసు నిండా ప్రేమ మాత్రం ఎక్కువగానే ఉంది. ఈ ప్రభుత్వం మీది. మీకు మంచి చేసే విషయంలో నాలుగు అడుగులు వేయడానికి ఎప్పుడూ ముందుంటా.

శాశ్వత ఉద్యోగాలకు కోత.. వ్యవస్థలు నిర్వీర్యం

ఇలాంటి వ్యక్తి కాబట్టే 2014-19 మధ్య శాశ్వత ఉద్యోగుల నియామకాన్ని చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా తగ్గించారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. ఆయన హయాంలో ఆర్టీసీ పరిస్థితి ఏమిటి? గవర్నమెంట్ ఆస్పత్రులు, గవర్నమెంట్ స్కూళ్ల పరిస్థితి ఏమిటి? ఇక గ్రామ స్థాయిలో పరిపాలన దేవుడెరుగు! అధికారులు, పారదర్శకతతో పని లేదు. జన్మభూమి కమిటీలు చాలు.. లంచాలు తీసుకుని ఎవరికి సిఫారసు చేస్తే అదే పరిపాలన. ఐదేళ్లలో కేవలం 34 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులనే నియమించారు. 1999 నుంచి 2004 మధ్య ఏకంగా 54 ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేశారు. ఇందుకోసం ఇంప్లిమెంటేషన్ సెక్రటేరియట్ అని ఓ విభాగాన్నే సెక్రటేరియట్‌లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను తన వాళ్లకు అమ్మేసుకున్నారు. ఉద్యోగులను నడిరోడ్డుపై వదిలేశాడు. ఆల్విన్, నిజాం షుగర్స్, చిత్తూరు, ప్రకాశం డెయిరీ.. ఇలాంటివి ఏకంగా 54 ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసిన చరిత్ర ఈ పెద్దమనిషిది. ఈరోజు ప్రభుత్వ ఉద్యోగుల గురించి మొసలి కన్నీరు కారుస్తుంటే ఇంతకంటే ఘోరం ఏముంటుంది? మనది ఉద్యోగుల అనుకూల ప్రభుత్వం. చంద్రబాబు, ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, దత్తపుత్రుడు.. వీరందరికీ ఉన్నదంతా ఒక్కటే.. కేవలం నా మీద కడుపుమంట. రాష్ట్ర ప్రజల మీద, ఉద్యోగుల మీదా వీరికి ఏమాత్రం ప్రేమ లేదు. వీరు చేసే రాజకీయ విమర్శలు, రెచ్చగొట్టే మాటలు, కట్టు కథలను నమ్మవద్దని సవినయంగా కోరుతున్నా.







సీఎం జగన్‌కు రాఖీ చూపుతున్న మహిళా ఉద్యోగి, సీఎంకు దండం పెడుతూ, విజిల్స్ వేస్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



ప్లకార్డులు చూపుతూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగులు

దశాబ్దాల సమస్యలను నాలుగేళ్లలో పరిష్కరించారు

ఉద్యోగులు మనసు పెట్టి పని చేసేలా సీఎం జగన్ సానుకూల నిర్ణయాలు: సజ్జల



సాక్షి, అమరావతి: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సీఎం జగన్ నాలుగేళ్లలోనే పరిష్కరించారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి తీసుకునే విధానపరమైన నిర్ణయాలను ప్రజల చెంతకు చేర్చాల్సిన బాధ్యత ఉద్యోగులదే కాబట్టి వారు ప్రశాంతంగా పనిచేసుకునేలా అనువైన వాతావరణాన్ని కల్పించారని చెప్పారు. ఉద్యోగులకు సమస్యలు లేకుండా ఉంటే మరింత మనసుపెట్టి పని చేయగలరని బలంగా విశ్వసిస్తూ వారి సమస్యలన్నీ సీఎం జగన్ పరిష్కరించారని తెలిపారు. ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులను రాజకీయాల కోసం వాడుకోకూడదని సీఎం దృఢంగా భావిస్తారని చెప్పారు. అలాంటి స్థిరమైన అభిప్రాయాలు కలిగిన వ్యక్తి ముఖ్యమంత్రి అయితే పరిపాలన ఎలా ఉంటుందో, సమస్యలను పరిష్కరించే ఆలోచన, ఎంత తక్కువ సమయం తీసుకుంటారో ఈ నాలుగేళ్లలో అందరూ చూశారన్నారు. కోవిడ్ సంక్షోభం సమయంలో అన్ని రకాలుగా ప్రజలకు తామున్నామని ప్రభుత్వం ముందడుగు వేయడంలో సీఎం ఆలోచనకు తోడు ఉద్యోగుల పాత్ర కూడా కీలకమన్నారు.

స్వల్ప వ్యవధిలో కీలక మార్పులు: బండి శ్రీనివాసరావు



ప్రభుత్వ వ్యవస్థలో అతి తక్కువ కాలంలో అనేక మార్పులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపరేఖలనే మార్చేశారన్నారు. 1.35 లక్షల ఉద్యోగాలు కల్పించి గ్రామ స్థాయికే పరిపాలనను వికేంద్రీకరించారని గుర్తు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రశంసించారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరితే సుప్రీంకోర్టు తీర్పు ఉందని గత ప్రభుత్వం తప్పించుకుందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వారిని క్రమబద్ధీకరించడం గొప్ప విషయమన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ఉద్యోగులకు హెచ్ఆర్ఏ 16 శాతం పెంచిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదేనన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఒకటో తేదినే జీతాలు ఇవ్వడం కూడా ఈ ప్రభుత్వంలోనే మొదలైందన్నారు. జీపీఎస్ విధానానికి ఏపీ ఎన్జీవో సంఘం ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

సంయమనంతో పనిచేశారు: సీఎస్



ఉద్యోగులకు సంబంధించిన అంశాలన్నింటినీ సానుకూలంగా పరిష్కరించామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. కష్టకాలంలో ఉద్యోగులు ఎంతో సంయమనంతో పనిచేశారని అభినందించారు. సమావేశాల్లో ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్జీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, మంత్రులు తానేటి వనిత, ఆదిమూలపు సురేష్, జోగి రమేష్, ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

26న పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పర్యటన

గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాల అమలుపై క్షేత్రస్థాయి పరిశీలన

సాక్షి, అమరావతి: గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు 29 మంది సభ్యులతో కూడిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఈ నెల 26వ తేదీన రాష్ట్రంలో పర్యటించనుంది. కమిటీ సభ్యులు విశాఖపట్నం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, ఆయా శాఖల పరిధిలో వివిధ పథకాల అమలు తీరును పరిశీలించడంతో పాటు ఆయా పథకాల లబ్ధిదారులతో మాట్లాడతారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సెక్రటరీ శైలేష్‌కుమార్ సింగ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్‌కు లేఖ రాశారు.

మనుబోలు-గూడూరు మధ్యలో విద్యుదీకరణ పూర్తి

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): మనుబోలు-గూడూరు మధ్య 7.4 కిలోమీటర్ల దూరం విద్యుదీకరణతో మూడో లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో అధికారులు సోమవారం నుంచి రైళ్ల రాకపోకలకు అవకాశం కల్పించారు. విజయవాడ-గూడూరు రైలు మార్గంలో రైళ్ల నిర్వహణ, ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఈ మార్గంలో విద్యుదీకరణతో మూడో లైన్ ప్రాజెక్టు పనులకు 2015-16లో రూ.3,246 కోట్లతో రైల్వేశాఖ పనులు చేపట్టింది. ఇప్పటివరకు ఉలవపాడు-మనుబోలు మధ్య 120 కి.మీ, చీరాల-కావలి మధ్య 44 కి.మీ విద్యుదీకరణతో మూడో లైన్ పనులు పూర్తి చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో 171 కి.మీ మేరకు పని పూర్తవగా, గూడూరు-సింగరాయకొండ మధ్య 127 కి.మీ మేర పనులు జరుగుతున్నాయి.

ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్‌గా దంతులూరి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా అనకాపల్లికి చెందిన దంతులూరి దిలీప్ కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల కాలానికి ఈ నియామకం చేపట్టినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఎఫ్ఏసీ) ఎన్. యువరాజ్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రక్షణ రంగానికి బ్రాండ్‌గా విశాఖ

అభివృద్ధికి పుష్కల అవకాశాలున్నాయి

- ఇందుకు ఎక్కువ సమయం పట్టదు
- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డా.వై.శ్రీనివాసరావు
- సొంతంగా సబ్‌మెరైన్లు తయారు చేస్తున్నాం
- నౌకలు, సబ్‌మెరైన్లను శత్రువులు కనిపెట్టకుండా కొత్త టెక్నాలజీ



సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగానికి ఒక బ్రాండ్‌గా మారేందుకు, నేవల్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి విశాఖపట్నంలో పుష్కల అవకాశాలున్నాయని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డా.వై శ్రీనివాసరావు అన్నారు. నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ ల్యాబొరేటరీ(ఎన్ఎస్‌టీఎల్)లో శనివారం జరిగిన 54వ ల్యాబ్ రైజింగ్ డే ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 'విశాఖపట్నంలో నేవల్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి చెందితే అత్యవసర పరిస్థితుల్లో సహకారం అందించేందుకు అవసరమైన మానవ వనరులు, మెషినరీ అందుబాటులోకి వస్తాయి. నేవల్ డిఫెన్స్ అంటే విశాఖ గుర్తుకురావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నాయి. హిందూస్తాన్ షిప్‌యార్డు, పోర్టులకు సంబంధించిన పరికరాలు, కమర్షియల్ నేవీ, ఇండియన్ నేవీకి ఏ పారిశ్రామిక సహకారం కావాలన్నా.. విశాఖ అత్యంత ముఖ్యమైన వనరు. రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తే.. విశాఖలో నేవల్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి చెందుతుంది. డాక్‌యార్డు, ఎన్ఎస్‌టీఎల్, నేవీ, షిప్‌యార్డుకు సహకారం అందించేలా బీఈఎల్ మాదిరిగా ఎల్అండ్‌టీ వంటి సంస్థలు వస్తే.. ఆ వెంటే ఎంఎస్ఎంఈలు కూడా ఏర్పాటవుతాయి. తద్వారా విశాఖ రక్షణ రంగానికి ఒక బ్రాండ్‌గా మారే అవకాశముంది. విశాఖ సమీప ప్రాంతాల్లో పోర్టులు, భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, రాజమండ్రి ఎయిర్‌పోర్టు, రైల్వే వ్యవస్థ కూడా ఉన్నందున.. అభివృద్ధి చెందేందుకు ఎక్కువ సమయం పట్టదు.

సొంతంగా సబ్‌మెరైన్లు, టార్పెడోలు..

సముద్ర గర్భంలోనూ సత్తా చాటే దిశగా అడుగులు పడుతున్నాయి. వరుణాస్త్ర విజయవంతమైంది. హెవీ వెయిట్, లైట్ వెయిట్ టార్పెడో ప్రయోగాలు విజయవంతమయ్యాయి. బ్యాటరీ ప్రొపల్షన్ టార్పెడోలు ప్రస్తుతం కీలకంగా మారాయి. క్షణాల్లో టార్పెడోలు దూసుకుపోయేలా బ్యాటరీల రూపకల్పన జరుగుతోంది. త్వరలో ఇవి అందుబాటులోకి రానున్నాయి. టార్పెడోలను సమర్థంగా కంట్రోల్ చేసే వ్యవస్థ కూడా సిద్ధమవుతోంది. నౌకలు, సబ్‌మెరైన్ల మోడల్ టెస్టింగ్స్ కోసం ఒకప్పుడు ఇతర దేశాలపై ఆధారపడే వాళ్లం. ఇప్పుడు అన్ని షిప్‌యార్డులూ ఎన్ఎస్‌టీఎల్ వైపే చూస్తున్నాయి. ఇప్పుడు సబ్‌మెరైన్లను సొంతంగా తయారు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. అలాగే యుద్ధ విమానాలు, సబ్‌మెరైన్‌లు, యుద్ధ నౌకల ఉనికిని శత్రుదేశాలు పసిగట్టకుండా అడ్డుకునే స్టెల్త్ టెక్నాలజీ అందుబాటులోకి తెస్తున్నాం. శత్రుదేశాలు ఏ ఆయుధాన్ని ప్రయోగించినా.. దాని నుంచి తప్పించుకునేందుకు అవసరమైన టెక్నాలజీ రూపకల్పనకూ ప్రయోగాలు జరుగుతున్నాయి' అని చెప్పారు

అనుకున్న సమయానికే 'పోలవరం పవర్ హౌస్'

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన మాటల్లోనే..

- పోలవరం పవర్ హౌస్ నిర్మాణాన్ని చేపట్టిన మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) నూతన కాంట్రాక్టు ప్రకారం మొదటి మూడు యూనిట్లను 2024 జూలై నాటికి పూర్తి చేయనుంది. తర్వాత రెండు నెలలకు ఒకటి చొప్పున మిగిలిన 9 యూనిట్లను పూర్తి చేస్తుంది. తొలిదశ కింద 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఏడు యూనిట్లను ప్రారంభించి 560 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతుంది. ఆ తర్వాత మిగిలిన 5 యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభిస్తుంది. నీటి నిల్వ స్థాయి తేలే వరకు ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించడం సాధ్యం కాదని, 2026 నాటికైనా ప్రాజెక్టు పూర్తవుతుందా అంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. నిర్ణీత సమయానికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుంది. 2025-26 ఆర్థిక ఏడాదిలో మొ 0త్తం 12 యూనిట్లు అందుబాటులోకి వస్తాయి.
- పోలవరం వద్ద 41.15 మీటర్ల కాంటూరు వరకే నీరు నిల్వ చేస్తే జల విద్యుత్ కేంద్రం ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కాదనే అపోహలున్నాయి. వాస్తవానికి ఒక్కో యూనిట్ 80 మెగావాట్ల పూర్తిస్థాయి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి నెట్ హెడ్ వద్ద 27 మీటర్లు, రిజర్వాయరు వద్ద 41.15 మీటర్లు, టెయిల్ వద్ద



13.64 మీటర్ల నీరు నిల్వ ఉంటే సరిపోతుంది. దీన్నిబట్టి రిజర్వాయరు నీటి మట్టం 41.15 మీటర్లు ఉంటే పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని స్పష్టమవుతోంది.

- ఒకవేళ స్పిల్‌వే ద్వారా వదిలే నీటి వల్ల టెయిల్ వాటర్ లెవల్ పెరిగి నెట్ హెడ్ వద్ద 27 మీటర్ల కంటే తక్కువ నిల్వ ఉంటే ఆ మేరకు విద్యుత్ ఉత్పత్తి తగ్గుతుంది. నీటి నిల్వ 41.15 మీటర్లకు పరిమితం చేసినా జల విద్యుత్ కేంద్రం నిర్వహణకు నష్టం లేదు. వరదల సీజన్‌లో ముందే విద్యుదుత్పత్తి ప్రారంభించొచ్చు.
- ముందు నిర్ణయించిన కాంట్రాక్టు సంస్థను తప్పించి వేరే సంస్థకు నిర్మాణం అప్పగించడం వల్ల సంప్రదింపులు (ఆర్బిట్రేషన్) కింద ఏపీ జెన్‌కో రూ.600 కోట్ల వరకు చెల్లించాలని, అది జెన్‌కోపై అదనపు భారమనే ప్రచారం జరుగుతోంది. కానీ గత కాంట్రాక్టు సంస్థతో ఇంకా సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఆర్బిట్రేషన్ వల్ల ఏపీజెన్‌కోపై ఏమాత్రం భారం పడదని, తీర్పు అనుకూలంగా వస్తుందని సంపూర్ణ విశ్వాసంతో ఉన్నాం.

సచివాలయ ఉద్యోగులకు తీపికబురు

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేయడంతో పాటు స్థానికంగా యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించారు. గతేడాది సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ (ప్రొబేషన్ డిక్లేర్) చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అప్పటినుంచి పే స్కేల్ ప్రకారం జీతాలు అందిస్తోంది. శాశ్వత ఉద్యోగులుగా మారి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం తొలి ఇంక్రిమెంట్, డీఏ పెంపుతో జీతాలు పెంచింది. పెరిగిన జీతాలు అందుకున్న ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- శాశ్వత ఉద్యోగులకు పెరిగిన పే స్కేల్
- తొలి ఇంక్రిమెంట్, డీఏ అందుకున్న ఉద్యోగులు
- జిల్లా కేంద్రం సమీపంలో వారికి 16 శాతం హెచ్ఆర్ఏ
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 9,410 మందికి ప్రయోజనం

భీమవరం(ప్రకాశం చౌక్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వార్డు, సచివాలయాల్లో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. శాశ్వత ఉద్యోగులుగా మారి ఏడాది పూర్తయిన వారికి ఏ మాత్రం జాప్యం లేకుండా ఇంక్రిమెంట్, డీఏ కలిపి జూలై నెల జీతాన్ని ఆగస్టులో అందించింది. తొలి ఇంక్రిమెంట్, డీఏ పెంపుతో జీతం పెరుగుదల కనిపించడంతో సచివాలయ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల్లో ఉద్యోగం చేపట్టిన తర్వాత ప్రొబేషన్ సకాలం పూర్తి చేయడం, తమని శాశ్వత ఉద్యోగులుగా చేయడంతో పాటు ఏడాది పూర్తయిన వెంటనే ఇంక్రిమెంట్, డీఏ పెంచడం సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని అంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 1,140 సచివాలయాల్లో 9,140 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఇంక్రిమెంట్ రూ.660

వార్డు ,గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఇంక్రిమెంట్ రూ.660 చెల్లించింది. డీఏను వార్డు సచివాలయ అడ్మిన్, గ్రామ సచివాలయ కార్యదర్శికి రూ.781 చొప్పున పెరిగింది. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.764 చొప్పున డీఏ పెంచారు.

మొత్తంగా రూ.1,500కు పైగా..

ప్రభుత్వం ఇంక్రిమెంట్‌తో పాటు డీఏ పెంచడంతో సచివాలయ ఉద్యోగులకు కేడర్‌ను బట్టి రూ.1,503 నుంచి రూ.1,546 వరకు జీతాలు పెరిగాయి. ఈ లెక్కన వార్డు అడ్మిన్లకు రూ.1,546, వార్డు సెక్రటరీలకు రూ.1,530, గ్రామ సచివాలయ సెక్రటరీలకి రూ.1,521 ,గ్రామ సచివాలయ ఉద్యోగులకు రూ.1,503 చొప్పున పెరిగింది.

16 శాతం హెచ్ఆర్ఏ

జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్లలోపు ఉన్న సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం 16 శాతం మేర హెచ్ఆర్ఏ అందిస్తోంది. దీంతో జిల్లా కేంద్రానికి సమీపంలోని వారికి రూ.950 అదనపు ప్రయోజనం చేకూరుతోంది. మిగిలిన ఉద్యోగులకు 12 శాతం హెచ్ఆర్ఏ వర్తిస్తోంది. మొదట్లో సచివాలయ ఉద్యోగులందరికీ ఒకే రకమైన హెచ్ఆర్ఏ వర్తించగా.. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నవారికి అదనపు మేలు చేకూరింది.

చాలా సంతోషం

ప్రొబేషన్ డిక్లేర్ చేసి పేస్కేల్ ద్వారా జీతాలు చెల్లించడం ఏడాది పూర్తికాగానే ఇంక్రిమెంట్, డీఏతో కలిపి జీతాలు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

–ఎ.శ్రీనివాస్, 3వ వార్డు అడ్మిన్, భీమవరం

గిరిజన ప్రాంత వాసులకు ఉచితంగా హెల్త్ స్క్రీనింగ్

క్యాంపులు నిర్వహిస్తోన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంత ప్రజల ఆరోగ్యాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇందులో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద గిరిజనులకు ఉచిత హెల్త్ స్క్రీనింగ్‌ను వైద్య శాఖ ప్రారంభించింది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా గిరిజన ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహించి ప్రజలను స్క్రీనింగ్ చేస్తోంది. రాష్ట్రంలోని 9 ఐటీడీఏల పరిధిలో సేవలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. కాగా, ఇప్పటికే ప్రకాశం జిల్లాలో కార్యక్రమం ప్రారంభమవగా, నెల్లూరులో త్వరలో మొదలు పెట్టనున్నారు. ఈ హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశ్రీ సీఈవో ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు.

'నాడు-నేడు' కళ్లతో చూడు రామోజీ

ప్రభుత్వ విద్యపై 'ఈనాడు' విద్వేషం

- పేద ప్రజల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా తప్పుడు రాతలు
- గత ప్రభుత్వం గాలికొదిలేసిన సర్కారు బడిని గాడిలో పెడుతుంటే ఆరోపణలా?
- 'నాడు-నేడు' తొలిదశలో రూ.3,669 కోట్లతో 15,713 పాఠశాలలకు మోక్షం
- పాఠశాలల్లో ఏర్పాటుచేసిన యంత్రాలకు ఐదేళ్ల వారంటీ..
- ఇప్పటిదాకా 18,802 నీటిశుద్ధి యంత్రాల రిపేర్లను కంపెనీలే చేశాయి..
- తాగునీటి యంత్రాల మెరుగైన నిర్వహణకు ఐఐటీ మద్రాస్ నిపుణుల సాయం
- దురుద్దేశంతో ప్రభుత్వ బడులపై ఎల్లో మీడియా విషప్రచారం


నాడు-నేడు.. నాణ్యతే లేదు చూడు

సాక్షి, అమరావతి: ఒక తప్పుడు ఆరోపణ చేస్తే దాని వెనకున్న నిజాలు బయటకొస్తాయనే భయం లేకుండా రామోజీరావు నిత్యం సిగ్గూఎగ్గూలేని రాతలు రాస్తూనే ఉన్నారు. రోజూ ఆయన వండి వారుస్తున్న కల్పిత కథల్ని జనం విశ్వసించే రోజులు పోయాయని తెలుసుకోలేని మొద్దు నిద్రలో ఆయనున్నారు. ఎందుకంటే.. పేద విద్యార్థులు చదువుకునేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన పత్రిక 'ఈనాడు' విషం కక్కుతోంది. ప్రభుత్వ పాఠశాలలపైన, ప్రభుత్వ విద్యా వ్యవస్థల మీద నిరంతరం బురద జల్లుతూ వాటి ప్రతిష్టను మసకబార్చేందుకు ఆపసోపాలు పడుతోంది. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అందులో పనిచేస్తున్న సిబ్బంది ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు ఈనాడు చేస్తున్న ప్రయత్నాలు అన్నీఇన్నీ కావు. రోజుకో అబద్ధాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అదే నిజమని నమ్మించేందుకు నానాపాట్లు పడుతోంది. ఇందులో భాగమే సోమవారం ప్రచురించిన ''నాడు-నేడు.. నాణ్యతే లేదు చూడు''.. కథనం. నిజానికి.. గత చంద్రబాబు ప్రభుత్వం బాధ్యతగా ప్రజలకు అందించాల్సిన ప్రభుత్వ విద్యను గాలికొదిలేసి.. పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని పిల్లల చదువు కోసం ఆస్తులను అమ్మే పరిస్థితులను కల్పించింది. కానీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టింది.

'నాడు-నేడు'తో మెరుగుపడుతున్న పాఠశాల విద్య..

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా మౌలిక సదుపాయాల కల్పన, ఇంగ్లిష్ మీడియం, బైలింగువల్ పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, సీబీఎస్ఈ సిలబస్, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, గోరుముద్ద.. ఇలా అనేక సంస్కరణలను అమలుచేసి కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం అనుసరించేలా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు నిజమైన అభ్యాస కేంద్రంగా పాఠశాలలను ప్రోత్సహించేందుకు మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన ఫలితాలు మెరుగుపడుతున్నాయి. అలాగే..

- మనబడి నాడు-నేడు 2020-21 మొదటిదశలో 15,713 పాఠశాలల్లో రూ.3,669 కోట్ల ఖర్చుతో పది మౌలిక సదుపాయాలు కల్పించారు.
- నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా, మరమ్మతులు, ఫ్యాన్లు-ట్యూబ్‌లైట్లతో విద్యుదీకరణ, విద్యార్థులకు, సిబ్బందికి ఫర్నిచర్, గ్రీన్‌చాక్ బోర్డులు, పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, ప్రహరీ, వంట గది నిర్మాణం చేశారు.
- ఇక నాడు-నేడు రెండో దశలో (2022-23)లో రూ.8 వేల కోట్ల అంచనాతో 22,344 పాఠశాలలు, అన్ని జూనియర్ కాలేజీలు, ఫౌండేషన్ పాఠశాల (అంగన్‌వాడీ)ల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. దశాబ్దాల పాటు మరమ్మతులకు నోచుకోని వేల పాఠశాలలు నాడు-నేడుతో బాగుపడుతున్నాయి. బాగున్న భవనాలకు మరమ్మతులు, శిథిలమైనవాటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణం చేపట్టారు. రెండోదశలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ పనులు చేసేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన విధానాలను అమలుచేస్తోంది. ఆయా స్కూళ్ల నిర్వహణకు నిధిని కూడా ఏర్పాటుచేసింది. నాణ్యతలేని పనులకు బాధ్యత ఎవరిదన్న అంశంలోనూ స్పష్టమైన నిబంధనలను రూపొందించింది.

ప్రతి వస్తువూ వారంటీతో కొనుగోలు..

చాక్‌బోర్డుల నుంచి, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, తాగునీటి యంత్రాలు.. ప్రతి వస్తువును నిర్దిష్టమైన వారంటీతోనే ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎక్కడ నాణ్యత దెబ్బతిన్నా వాటి స్థానంలో సంబంధిత కంపెనీనే కొత్తవి అమర్చేలా కచ్చితమైన ఒప్పందం చేసుకుంది. గ్యారంటీ, వారంటీ నిర్వహణలో ఆయా కంపెనీలన్నీ నిర్దిష్ట కాలపరిమితి వరకూ బాధ్యులుగా ఉన్నాయి.

- పాఠశాలల్లో కల్పించిన సదుపాయాల నిర్వహణ ఖర్చులకు, మొదటిదశలో చేపట్టిన పాఠశాలలకు, మూడో దశలో చేపట్టే పాఠశాలలకు మరమ్మతుల నిమిత్తం 2023-24లో రూ.329 కోట్ల నగదును పాఠశాల తల్లిదండ్రుల కమిటీలకు బదిలీచేసే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది.
- అంతేకాక.. ఎప్పటికప్పుడు స్కూళ్ల నిర్వహణ సమాచారాన్ని రియల్ టైమ్ పద్ధతిలో సేకరించి వెంటనే మరమ్మతులు చేపడుతున్నారు.

చెడిపోతే కంపెనీలతోనే మరమ్మతులు..

ఇక సరఫరా చేసిన వస్తువులు, పరికరాలు ఐదేళ్ల వారంటీలో ఉన్నాయి కాబట్టి, చెడిపోయిన వాటిని ఆయా కంపెనీలే మరమ్మతులు చేస్తాయి. ఇప్పటిదాకా రాష్ట్రవ్యాప్తంగా 18,802 నీటిశుద్ధి యంత్రాల మరమ్మతులకు వినతులు రాగా యంత్రాలను సరఫరా చేసిన కంపెనీలే మరమ్మతులు పూర్తిచేశాయి. మొదటి దశలో పాఠశాలల్లో ఏర్పాటుచేసిన తాగునీటి శుద్ధియంత్రాల నిర్వహణ కోసం ఐఐటీ మద్రాస్ నిపుణుల సూచన మేరకు ఆటో టీడీఎస్ కంట్రోల్, బ్యాక్‌వాష్ సిస్టమ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) యంత్రాలను అన్ని పాఠశాలల్లోని నీటిశుద్ధి యంత్రాలకు ఏర్పాటుచేస్తున్నారు.

- ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లలో అవకతవకలు జరిగాయనడంలో వాస్తవంలేదు. విద్యార్థులకు బెంచీల సరఫరా కోసం టెండర్ల ద్వారా 5.10 లక్షల సరఫరాకు ఒప్పందం జరగ్గా, 3,88,727 బెంచీలు మాత్రమే విద్యాశాఖ తీసుకుంది.
- గ్రీన్ చాక్‌బోర్డుల విషయంలో కూడా మొదటి కంపెనీ అనుకున్న సమయానికి సరఫరా చేయలేకపోయింది.దీంతో రెండో కంపెనీ సకాలంలో సరఫరా చేసేందుకు అంగీకరించడంతో ఆ కంపెనీతో ఒప్పందం జరిగింది. సీలింగ్ ఫ్యాన్లు విషయంలోనూ కంపెనీ చేసిన పొరపాట్లకు పెనాల్టీలు వేసి ప్రభుత్వం వసూలుచేస్తోంది.

వైద్య విద్యార్థులకు వరం..
డిజిటల్ లైబ్రరీ

- అత్యాధునిక సదుపాయాలతో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీలో ఏర్పాటు
- అందుబాటులో వేలాది టెక్ట్స్ బుక్స్, జర్నల్స్, వీడియోలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య విద్యకు సంబంధించిన అత్యాధునిక పుస్తకాలు, వివిధ రకాల అరుదైన చికిత్సలకు సంబంధించిన వీడియోలు, వేలాది జర్నల్స్‌తో కూడిన డిజిటల్ లైబ్రరీ (ఈ-లైబ్రరీ)ని వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. వైఎస్సార్ మెడ్‌నెట్ కన్సార్షియం పేరుతో ఏర్పాటు చేసిన ఈ లైబ్రరీలో మెడికల్, డెంటల్, ఫిజియోథెరపీ, ఆయుష్, పారా మెడికల్, నర్సింగ్ కోర్సులకు సంబంధించి వేలాది రకాల అత్యాధునిక పాఠ్యపుస్తకాలు, జర్నల్స్, అరుదైన చికిత్సలు, ట్రీట్‌మెంట్ ప్రొటోకాల్‌కు సంబంధించిన వీడియోలు ఉంచారు. ప్రతి విద్యార్థి డిజిటల్ లైబ్రరీని సులభంగా వినియోగించుకునేందుకు మైలాఫ్ట్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీనికోసం యూనివర్సిటీ రూ. 4 కోట్లు వెచ్చించింది.

మైలాఫ్ట్.. యూజర్ ఫ్రెండ్లీ యాప్..

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయంలో 2008లోనే డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. కానీ పరిమిత సంఖ్యలో మాత్రమే అక్కడ పుస్తకాలు అందుబాటులో ఉండేవి. లైబ్రరీలో మాత్రమే దాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉండటంతో లైబ్రరీ పనివేళల్లో వెళ్లేందుకు కుదరకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. పరిస్థితి గమనించిన ప్రస్తుత వర్సిటీ అధికారులు అత్యాధునిక పరిజ్ఞానంతో మైలాఫ్ట్ (మై లైబ్రరీ ఆన్ ఫింగర్ టిప్స్) అప్లికేషన్‌ను రూపొందించారు. ఈ యాప్ ద్వారా విద్యార్థులు, టీచింగ్ వైద్యులు, ఎక్కడి నుంచైనా తమ మొబైల్‌లో సైతం లాగిన్ అయ్యి డిజిటల్ లైబ్రరీని వినియోగించుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం 21 వేలకు పైగా ఈ- బుక్స్, 22,433కు పైగా ఈ- జర్నల్స్, 11,000 పైగా వీడియోలు డిజిటల్ లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా



ప్రతి విద్యార్థి ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా డిజిటల్ లైబ్రరీని ఆధునీకరించాం. మైలాఫ్ట్ యూజర్ ఫ్రెండ్లీ యాప్ ద్వారా విద్యార్థులు, ఫ్యాకల్టీ ఎక్కడి నుంచైనా, తమ మొబైల్స్‌లో సైతం లాగిన్ అయ్యే అవకాశం కల్పించాం. డిజిటల్ లైబ్రరీ వినియోగంపై అన్ని కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ వి.రాధికారెడ్డి, రిజిస్ట్రార్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం

సద్వినియోగం చేసుకోవాలి



మైలాఫ్ట్ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆదేశాల మేరకు టెక్నికల్ సిబ్బందితో కలిసి జోనల్ వారీగా సదస్సులు నిర్వహించి యాప్ వినియోగంపై ఫ్యాకల్టీ, విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నాం. వేలాది ఈ-బుక్స్, ఈ-జర్నల్స్, వీడియోలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి.

– డాక్టర్ కె.సుధ, కో ఆర్డినేటర్, కన్సార్షియం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ

కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధితులు

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఉన్న 21 మందికి నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స


పాడేరు జిల్లా ఆస్పత్రిలో కోలుకుంటున్న బస్సు ప్రమాద బాధిత ప్రయాణికులు

సాక్షి, పాడేరు: పాడేరు ఘాట్ లోయలో ఆర్టీసీ బస్సు దూసుకుపోయిన ఘటనలో గాయపడిన ప్రయాణికులు కోలుకుంటున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో 21 మందికి నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన సేవలందుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లు.. కలెక్టర్, ఇతర వైద్య శాఖ అధికారులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నారు. ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కణితి వెంకటరావులు ఆస్పత్రికి వెళ్లి బాధిత ప్రయాణికులను పరామర్శించారు. తీవ్ర గాయాలపాలైన బోడిరాజు, చిన్నమ్మలకు విశాఖలోని మెడికవర్ ఆస్పత్రిలో ఉన్నత వైద్య సేవలు అందడంతో ప్రాణాపాయం తప్పిందని పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు చెప్పారు. మెడికవర్ ఆస్పత్రిలో బాధితులను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శంకరరావు సోమవారం పరామర్శించారు. ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆయన తెలిపారు. ఆయా ఆస్పత్రుల్లో బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, పౌష్టికాహారం, ఇతర సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సీఎం కార్యాలయానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు నివేదికలు పంపుతున్నారు. ప్రయాణికులు కొండన్న, నారాయణమ్మల మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బేల 'గళం'!

▶ మొదటి పేజీ తరువాయి

అక్కడ పాదయాత్రను మమ అనిపించారు.

బెజవాడ టీడీపీలో గందరగోళం

టీడీపీ తనకు పట్టుందని చెప్పుకునే విజయవాడ నగరంలో లోకేష్ రెండు రోజులు పాదయాత్ర చేశారు. దీన్ని విజయవాడ ఎంపీ కేశినేని నాని బహిష్కరించారు. చాలారోజుల నుంచి ఆయన ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. పార్టీ ఆఫీసులో కూర్చుని రాజకీయాలు చేసేవారికి చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తున్నారని, క్షేత్రస్థాయిలో పనిచేసే వారిని పట్టించుకోవడం లేదని ఆయన మొదటి నుంచి బహిరంగంగానే విమర్శిస్తున్నారు. నగర నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమా, నాగుల్ మీరాతో పడకపోవడంతో కేశినేని నానిని పక్కనపెట్టారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో చంద్రబాబు ఆయన సోదరుడు కేశినేని చిన్నికి యాత్ర బాధ్యతలు అప్పగించారు.

అభ్యర్థులు లేక హైవే రూటు!

ఉమ్మడి కృష్ణా జిల్లాలో జాతీయ రహదారి గుండా లోకేష్ యాత్ర నిర్వహించి పూర్తయిందనిపించారు. ఎన్టీఆర్ జిల్లాను (పశ్చిమ కృష్ణా) పూర్తిగా వదిలేశారు. మైలవరం, తిరువూరు, నందిగామ నియోజకవర్గాలపై స్పష్టత లేకపోవడంతో యాత్ర అటు వెళ్లలేదు. పెనమలూరు, గన్నవరం నియోజక వర్గాలను మాత్రమే కవర్ చేస్తున్నారు. గన్నవరాన్ని తప్పించేందుకు వీలు కాకపోవడంతో వైఎస్సార్‌సీపీ ఎప్పుడో పక్కనపెట్టిన యార్లగడ్డ వెంకట్రావును అప్పటికప్పుడు చేర్చుకున్నారు. ఆయన్ను పార్టీలో చేర్చుకుని అక్కడ యాత్ర కొనసాగేలా ఏర్పాట్లు చేసుకునే దుస్థితి టీడీపీలో నెలకొంది. ఆ పక్కనే ఉన్న గుడివాడ వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా లోకేష్, చంద్రబాబు చేయడం లేదు. అక్కడ టీడీపీకి అభ్యర్థే లేరు. ఇద్దరు నేతలున్నా వారితో పని కాదని చంద్రబాబుకు బోధపడటంతో అలాగే వదిలేశారు.

గుంటూరులో దయనీయమే..

లోకేష్ పాదయాత్ర చేసినా గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ అటువైపు వెళ్లలేదు. సొంత పార్టీ ఎంపీ లేకుండానే నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్రను ముగించాల్సి వచ్చింది. గుంటూరు నగరంలో పాదయాత్ర ఎంటర్ కాలేదు. గుంటూరు ఈస్ట్, వెస్ట్ నియోజక వర్గాలకు సరైన అభ్యర్థులు లేకపోవడంతో వాటిని వదిలేశారు. రాజధాని ప్రాంతమైన తాడికొండ నియోజకవర్గంలో పాదయాత్ర చేసినా అది అమరావతి కోసం చేశారు. అక్కడి పార్టీ ఇన్‌ఛార్జి శ్రావణ్‌కుమార్‌ని అవమానించి వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే శ్రీదేవికి లోకేష్ ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో క్యాడర్‌లో గందరగోళం చెలరేగి యాత్రను పట్టించుకోలేదు. ప్రత్తిపాడు, తెనాలి నియోజకవర్గాల్లోనూ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.



మనం వినే ప్రతిదీ ఒక అభిప్రాయమే, వాస్తవం కాదు.
మనం చూసే ప్రతిదీ ఒక దృక్కోణమే, సత్యం కాదు.
– మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 22 ఆగస్టు 2023

సమర సన్నాహాలు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎట్టకేలకు ప్రతిపక్ష పార్టీ సొంత గూటిలో సర్దుబాట్లతో సమరానికి సన్నద్ధమవుతున్నట్టుంది. పది నెలల నిరీక్షణ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆదివారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన తీరు చూస్తే అదే అనిపిస్తుంది. నిరుడు జాతీయ అధ్యక్షుడైన మల్లికార్జున ఖర్గే ఆచితూచి వ్యవహరిస్తూ, ఇన్నాళ్ళకు పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ' (సీడబ్ల్యూసీ)ని పునర్వ్యవస్థీకరించారు. సరికొత్త సీడబ్ల్యూసీపై గాంధీ కుటుంబ ముద్ర సుస్పష్టం. అయితే, ఒకపక్క విశ్వాసపాత్రులైన పాత కాపుల్ని కదిలించకుండానే, మరోపక్క కొత్త వారికీ, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారికీ, వివిధ సామాజిక వర్గాలకూ స్థానం కల్పించారు. ఇలా పార్టీలో నవనవోత్సాహాన్ని నింపేందుకు ప్రయత్నించడం స్వాగతనీయం. సోనియా కుటుంబానికి వీరవిధేయుడైనప్పటికీ, కేవలం డూడూబసవన్నలా ఖర్గే ఉండిపోలేదు. కొత్త కార్యవర్గంలో గాంధీ శిబిరం వారితో పాటు తన సొంత శిబిరం వారికీ చోటిచ్చారు. వివిధ సామాజిక వర్గాలకు చోటిస్తూ సమ తూకం సాధించడంతో ఈ కొత్త కార్యవర్గం రానున్న ఎన్నికల టీమ్ అని అర్థమవుతోంది.

సోనియా అధ్యక్ష కాలంలోని 2020 సెప్టెంబర్ తర్వాత సీడబ్ల్యూసీ ప్రక్షాళన మళ్ళీ జరగడం ఇప్పుడే! అనేక విడతల చర్చల తర్వాత కొత్త కమిటీ కొలువు తీరింది. 39 మంది శాశ్వత సభ్యులు, 18 మంది శాశ్వత ఆహ్వానితులు, 14 మంది రాష్ట్ర ఇన్–ఛార్జులు, నలుగురు సంస్థాగత ఇన్–ఛార్జులు, మరో 9 మంది ప్రత్యేక ఆహ్వానితులు – ఇలా మొత్తం 84 మంది సభ్యులతో మునుపెన్నడూ లేనంతటి అతి పెద్ద సీడబ్ల్యూసీ ఇది. పాత, కొత్తల మేలు కలయికగా ఏర్పాటైన వర్కింగ్ కమిటీలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంచడం హర్షణీయం. రాజస్థాన్‌లో సొంత పార్టీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి 2020లో పార్టీ రాష్ట్ర అధ్యక్షపదవి, ఉప ముఖ్యమంత్రి పదవి పోగొట్టుకున్న సచిన్ పైలట్‌కు కార్యవర్గంలో స్థానమివ్వడం, అలాగే నిరుడు పార్టీ అంతర్గత ఎన్నికల్లో అధ్యక్ష పీఠానికి ఖర్గేతో పోటీపడిన శశి థరూర్‌కు సైతం చోటివ్వడం ఆశ్చర్యకరమే. అలాగే, పార్టీకి సోనియా నాయకత్వాన్ని ప్రశ్నించిన జి–23 బృందంలోని అసమ్మతి నేతల్లో భాగమైన ఆనంద్ శర్మ, ముకుల్ వాస్నిక్‌లను సైతం కొత్త సభ్యులుగా తీసుకోవడం గమనార్హం. ఇది అవసరమైన రాజకీయ చాణక్యమే.

విభిన్న స్వరాలు వినిపించేవారిని సైతం విధాన నిర్ణయాలు తీసుకొనే వేదికలో భాగస్వాముల్ని చేయడం అంతర్గత ప్రజాస్వామ్యానికి సూచిక. 138 ఏళ్ళ సుదీర్ఘ చరిత్ర గల ఒక పార్టీ సమకాలీన చైతన్యశీల ప్రస్థానానికీ, పురోగతికీ దీర్ఘకాలంలో అది కీలకం కూడా! ముఖ్యంగా ఈ ఏడాది చివరికల్లా మిజోరమ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికలున్న వేళ ఆ ప్రాంతాలకూ ప్రాముఖ్యం, ప్రాతినిధ్యం ఇస్తూ ఈ పునర్వ్యవస్థీకరణ సాగడం గమనార్హం. ఎన్నికలున్న రాజస్థాన్‌లో అసమ్మతి నేత సచిన్ పైలట్‌కూ, అలాగే ఛత్తీస్‌గఢ్‌లో బలమైన ఫ్యాక్షన్ నాయకుడూ, ఓబీసీ అయిన మంత్రి తామ్రధ్వజ్ సాహూకూ పార్టీ అత్యున్నత వేదికలో చోటివ్వడం తక్షణ ప్రయోజనాలకు తప్పక పనికొస్తుంది. అలా చూస్తే, ఆలస్యమైనా ఖర్గే ఆలోచించి పావులు కదిపారనుకోవాలి. గత కమిటీలో ఒక్క ఓబీసీయే ఉంటే, ఈసారి ఆరుగురికి స్థానం దక్కడం, 9 మంది ఎస్సీలకూ, ఒక గిరిజన నేతకూ సీటివ్వడం... ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కూ, సామాజిక న్యాయానికీ కట్టుబడి ఉన్నామనే భావన కలిగించడానికీ కాంగ్రెస్‌కు ఉపకరిస్తుంది. అయితే, 15 మంది స్త్రీలకు స్థానం కల్పించినా, మహిళా సాధికారత మంత్రం పఠిస్తున్న పార్టీ ఈ సంఖ్యను మరింత పెంచుకోవడం అవసరం.

నిజానికి, సీడబ్ల్యూసీలో 50 ఏళ్ళ లోపు వారు 50 శాతమైనా ఉండాలన్నది లక్ష్యమని కాంగ్రెస్ కొంతకాలంగా చెబుతోంది. గత ఏడాది మేలో ఉదయ్‌పూర్‌లో జరిగిన చింతన్ శిబిర్‌లో, ఈ ఏడాది ఫిబ్రవరిలో రాయ్‌పూర్‌లో సాగిన పార్టీ ప్లీనరీలో ఆ మేరకు సంకల్పం కూడా చెప్పుకుంది. తాజా పునర్వ్యవస్థీకరణ ఆ లక్ష్యాన్ని చేరుకోలేదు. అయితే, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనతే లాంటి యువ నాయకత్వాన్ని సైతం ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చడం పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించే ప్రయత్నంగా భావించవచ్చు. సీడబ్ల్యూసీలో శాశ్వత సభ్యుల సంఖ్యను 23 నుంచి 35కు పెంచుతామని రాయ్‌పూర్ ప్లీనరీలో చెప్పిన పెద్దలు ఆ అవధిని మరింత పెంచి, 39 మంది శాశ్వత సభ్యులను తీసుకోవడమూ అనేక రాజకీయ అనివార్యతలకు అద్దం పడుతోంది. సీడబ్ల్యూసీకి ఎన్నికలు జరపకుండా, ఖర్గేయే నామినేట్ చేస్తారని నిర్ణయించిన పార్టీ ఇప్పటికి ఈ ఘట్టాన్ని పూర్తి చేసింది. వెరసి, కొత్త కార్యవర్గం కూర్పు కొంత సృజనాత్మక ధోరణిలో, మరికొంత రాజీ మార్గంలో పయనించిందని చెప్పక తప్పదు.

శశిథరూర్ పేర్కొన్నట్టు, సిద్ధాంతాలకు కట్టుబడిన కార్యకర్తలే ఏ పార్టీకైనా జీవనాడి. వారితో నిండిన పార్టీలు, కార్యవర్గాలే ప్రజాకాంక్షలను నెరవేర్చడంలో ముందడుగు వేయగలవు. సీడబ్ల్యూసీ కూర్పులో ఆ సంగతి ఖర్గే బాగానే గ్రహించారు. కానీ, సవాళ్ళు ముగిసిపోలేదు. అద్వానీ తర్వాత స్వతంత్ర భారతావనిలో ఏకకాలంలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా, లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష నేతగా ఉన్న 81 ఏళ్ళ ఖర్గే ఎన్నికల బరిలోనూ కాంగ్రెస్‌ను తీరానికి చేర్చాలి. ఆ మధ్య దాకా నీరసించిన పార్టీ నిరుడు హిమాచల్‌లో, ఈ ఏడాది కర్ణాటకలో దక్కిన విజయాలతో తెరిపిన పడింది. ఆ విజయ పరంపరను కొనసాగించాలంటే అభ్యర్థుల ఎంపిక, ప్రచారవ్యూహాలు, 'ఇండియా' కూటమిలో ఇతర ప్రతిపక్షాలతో సంప్రతింపులు – ఇలా ఖర్గే చేతి నిండా పని ఉంది. సోనియా కుటుంబంతో సమన్వయం చేసుకుంటూనే ఆ పనిని ఆయన ఎంత సమర్థంగా నిర్వహిస్తారో చూడాలి. ఒక్కమాటలో అసలు ఆట ఇప్పుడే మొదలైంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.10.12 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** స్వాతి తె.4.37 వరకు (తెల్లవారితే బుధవారం), **వర్జ్యం:** ఉ.9.26 నుండి 11.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.40 వరకు, **అమృతఘడియలు:** రా.7.23 నుండి 9.05 వరకు.

సూర్యోదయం: 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

మార్పు కోసం మార్పా?

విశ్లేషణ



అభిషేక్ సింఘ్వీ

భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య సంహిత పేర్లతో కేంద్ర ప్రభుత్వం మూడు బిల్లులను ప్రవేశపెట్టింది. క్రిమినల్ కేసుల విచారణలో జాప్యానికి దివ్యౌషధమని హోమ్ మంత్రి చెబుతున్న ఈ కొత్త చట్టాలు అసలుకే మోసం తెచ్చే ప్రమాదం ఉంది. పైగా పోలీస్ కస్టడీకి సంబంధించిన మార్పులు ఈ నాగరిక కాలానికి చెందినవి కావు. ఇంత భారీ మార్పులకు శ్రీకారం చుడుతున్న ఈ ముసాయిదా బిల్లులపై విస్తృత సంప్రదింపులు జరపలేదు. బ్రిటిష్ కాలపు చట్టాలను సంస్కరించాలంటే పారదర్శకత అవసరం. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న బిల్లులు చూస్తే అది సంస్కరణల కోసం కాకుండా... ఏదో కొత్తది చేయాలి కాబట్టి చేస్తున్నట్లు కనిపిస్తోంది.

భారతీయ శిక్షా స్మృతి, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్(నేర విచారణ ప్రక్రియ చట్టం), ఎవిడెన్స్ యాక్ట్‌ల సమూల ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బిల్లులను ఒక్క వారం వ్యవధిలో సంపూర్ణంగా విశ్లేషించామని ఎవరైనా అంటే వారు అత్యంత మేధావులైనా కావాలి లేదా మోసకారులైనా(ఫ్రాడ్) అయివుండాలి. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో 356 సెక్షన్లు ఉండగా, ఇరవై రెండింటిని రద్దు చేస్తున్నారు, 175 సెక్షన్లలో మార్పులు/చేర్పులు చేస్తున్నారు, కొత్తగా ఎనిమిది సెక్షన్లను చేరుస్తున్నారు. ఇక భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ ఎస్ఎస్)లో ఏకంగా 533 సెక్షన్లు ఉన్నాయి. మార్పులు/చేర్పులు చేస్తున్న సెక్షన్ల సంఖ్య 160, రద్దు చేస్తున్నవి తొమ్మిది, కొత్తగా ప్రవేశపెడుతున్నవి తొమ్మిది. భారతీయ సాక్ష్య సంహితలో 170 సెక్షన్లు ఉండగా, 23 సెక్షన్లలో మార్పులు/చేర్పులు చేస్తున్నారు, తొమ్మిదింటిని రద్దు చేస్తున్నారు, ఒక సెక్షన్ కొత్తగా చేరుస్తున్నారు. నేనైతే మేధావిని కాదు, మోసకారిని కూడా కాదని అనుకుంటున్నా. కాబట్టి, ఈ మూడు కొత్త బిల్లుల సంపూర్ణ విశ్లేషణ చేసే సాహసాన్ని ఇతరులకు వదిలేసి, కొన్ని అసాధారణ విషయాలు, మంచి అంశాలు మాత్రం ప్రస్తావిస్తాను.

అన్నింటికంటే ముందుగా... అత్యంత విచిత్రమైన అంశం గురించి చూద్దాం. దేశంలోని క్రిమినల్ కేసుల విచారణలో జాప్యానికి (ఐదు కోట్ల పెండింగ్ కేసుల్లో మూడింట రెండొంతులు క్రిమినల్ కేసులే) దివ్యౌషధమని హోమ్ మంత్రి చెబుతున్న కొత్త చట్టాలు అసలుకే మోసం తెచ్చే ప్రమాదం ఉండటం. ఈ మూడు చట్టాల్లోని మొత్తం 505 సెక్షన్లలో చేసిన మార్పులను దృష్టిలో పెట్టుకుంటే వీటిపై వాద ప్రతివాదనలు పెరిగిపోతాయి. ఇప్పటికే కేసుల భారంతో కునారిల్లుతున్న న్యాయస్థానాలకు ఇది అదనపు భారమవుతుంది. కొత్త సెక్షన్ల నేపథ్యంలో వాదనలను కొత్తగా వినిపించాల్సిన పరిస్థితి వస్తుంది. కొత్తవాటికి అలవాటు పడేంత వరకూ ఇది కొనసాగుతుంది కాబట్టి విలువైన కోర్టు సమయం వృథా అవడం గ్యారెంటీ. బహుశా కొత్త చట్టాల తయారీ కమిటీలో ఉన్న న్యాయవాదులు గానీ, నిపుణులు గానీ దీన్ని గమనించలేదేమో.

రెండో విషయం... చట్టాల్లో చేపట్టదలచిన మార్పుల గురించి విస్తృత స్థాయిలో చర్చించి ఉంటే సమస్య చాలావరకూ పరిష్కారమయ్యేది. పద్దెనిమిది నెలల కాలం పాటు పనిచేసిన ఈ కమిటీ ఇలాంటి చర్చలేవీ చేపట్టిన దాఖలాలు లేవు. మూడు లా కమిషన్ల నివేదికలపై, పలు సంస్థల సంప్రదింపులపై మాత్రమే కమిటీ ఆధారపడింది. కమిటీ సభ్యుల ప్రాతినిధ్యం కూడా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు తగిన విధంగా లేదు. పైగా ఇలాంటి ప్రక్రియలో అతి ముఖ్యమైన పారదర్శకత, జవాబుదారీతనం అన్నవి అస్సలు లేకుండా పోయాయి.



మూడో విషయానికి వద్దాం... ఈ కొత్త ప్రతిపాదనల్లో దేశద్రోహ నేరం ప్రభుత్వ మోసం మినహా మరోటి కాదు. గత ఏడాది సుప్రీం కోర్టు సెడిషన్ చట్టాల్లోని నిబంధనలపై దాదాపుగా స్టే విధించింది. అయితే కేంద్రం ఒక అఫిడవిట్ దాఖలు చేసి... సెడిషన్ చట్టాన్ని సమీక్షిస్తున్నాము కాబట్టి, ఆ ప్రక్రియ సాగుతున్నంత కాలం స్టే విధించవద్దని కోరింది. సర్వోన్నత న్యాయస్థానం ఈ ప్రకటనను నమోదు చేసింది. సెడిషన్ చట్టం తాలూకూ తీవ్రతను గణనీయంగా తగ్గించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు చర్యలు చెప్పకనే చెప్పాయి. అయితే కొత్త ప్రతిపాదనల్లో జరిగింది మాత్రం దీనికి పూర్తిగా విరుద్ధం.

ఈ ఏడాది జూన్‌లో న్యాయ కమిషన్ దేశద్రోహ చట్టాన్ని కొనసాగించాల్సిందిగా సిఫారసు చేసింది. ఆ వెంటనే ప్రభుత్వం భారత న్యాయ సంహితకు సంబంధించిన 150వ సెక్షన్‌ను ప్రవేశపెట్టింది. మాటల గారడీతో పాత చట్టం కంటే మరింత నిరంకుశమైన చట్టాన్ని ప్రతిపాదించింది. సార్వభౌమత్వానికి, భారత ఐక్యతలకు భంగం కలిగించడం అన్న విషయాలకు మరింత విస్తృతమైన నిర్వచనాలను ఇచ్చింది. "ప్రభుత్వంపై ప్రేమ లేకపోవడం" అన్నదాన్ని మాత్రం తొలగించింది. దేశద్రోహ నేరాన్ని మోపేందుకు 1960లో సుప్రీంకోర్టు పెట్టిన పరీక్షను స్పష్టంగా తప్పింది. కేవలం మాటలు మాత్రమే దేశద్రోహానికి కారణం కాజాలవనీ, హింసను ప్రేరేపించడం, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం కూడా ఉన్నప్పుడు మాత్రమే దేశద్రోహం చట్టం అమలవుతుందని సర్వోన్నత న్యాయస్థానం తెలిపిన విషయం గమనార్హం. కొత్త చట్టంలో వీటిని విస్మరించడం మాత్రమే కాకుండా... ఎలక్ట్రానిక్, ఆర్థికాంశాలను చేర్చింది. పైగా మాటలు, పుస్తకాలు, నాటకం, కథనం వంటి అంశాలకూ దేశద్రోహ నిర్వచనాన్ని అన్వయించింది.

నాలుగో అంశాన్ని చూస్తే... పోలీస్ కస్టడీకి సంబంధించిన మార్పులు ఈ కాలానికి చెందినవి కావు. ప్రస్తుతం పోలీస్ కస్టడీ కోరడం లేదా ఇవ్వడమనేది అదుపులోకి తీసుకున్న పదిహేను రోజుల్లో జరగాలి. అది కూడా గరిష్ఠంగా 15 రోజుల వరకే లభిస్తుంది. సైద్ధాంతికంగా చూస్తే పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు కూడా బెయిల్ లభించవచ్చు కానీ ఆచరణలో ఇలా జరగదు. పోలీసుల విచారణ కొనసాగుతూ ఉంటుంది కాబట్టి ఇది సిద్ధాంతానికి విరుద్ధమన్నమాట. ప్రతిపాదిత కొత్త చట్టాల్లో పోలీసు కస్టడీ అవధి 15 రోజులుగానే ఉంచినా అదుపులోకి తీసుకున్న తరువాత 40 రోజుల్లో ఎప్పుడైనా (పదేళ్ల వరకూ జైలుశిక్ష పడే కేసుల్లో) కోరవచ్చు. ఒకవేళ కేసులో పదేళ్ల కంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉంటే అరెస్ట్ అయిన 60 రోజుల్లో ఎప్పుడైనా కస్టడీ కోరవచ్చు. అంటే, కొత్త చట్టాల ప్రకారం కనీసం 40 లేదా 60 రోజుల వరకూ బెయిల్ వచ్చే అవకాశమే లేకుండా పోతుంది. నిందితులు పోలీసుల కస్టడీలో ఉండటం అవసరమని ప్రాసిక్యూషన్ వాదిస్తూనే ఉంటుంది. పరిస్థితిని మరింత దిగజార్చే విషయం ఇంకోటి ఉంది. పోలీస్ కస్టడీని 40 లేదా 60 రోజుల కాలంలో నేరుగా 15 రోజులు కాకుండా... అప్పుడప్పుడూ కొన్ని రోజుల చొప్పున కూడా కోరవచ్చు. పౌరుల సురక్ష అంటే ఇదా?

ఐదో అంశం... సామాజిక సేవ అంశాన్ని చేర్చారు. మంచిదే కానీ కొత్తదేమీ కాదు. కాకపోతే వ్యవస్థీకృతం చేయాల్సిన అవసరముంది. చిన్న చిన్న తప్పులకు మాత్రమే కాకుండా, మిగిలిన వాటికీ విస్తరించాల్సిన అవసరముంది. అయితే బీఎన్ ఎస్ఎస్‌లో దీనికి కొన్ని పరిమితులు విధించారు. విచిత్రమైన విషయం ఏమిటంటే... చిన్న చిన్న తప్పుల జాబితాలో క్రిమినల్ డిఫమేషన్‌ను చేర్చడం. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి ఇటీవలే ఈ క్రిమినల్ డిఫమేషన్‌ను తీవ్రమైన తప్పిదంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ కేసులోనే 135 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీ తన సభ్యత్వాన్ని దాదాపుగా కోల్పోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే.

ఆరవ అంశం... ప్రతిపాదిత కొత్త చట్టాల్లో మూక హత్యలను చేర్చారు. మెచ్చదగిన విషయం. అయితే 2014 తరువాత ఈ రకమైన నేరాలు పెరిగేందుకు కారణమేమిటన్న విషయాన్ని చూడాలి. అలాగే ఇలాంటి నేరాల విచారణ పక్కాగా, రాజకీయ జోక్యం లేకుండా జరిగేందుకు అనువైన వాతావరణం ఉందా? అన్నది ప్రశ్న.

దురదృష్టవశాత్తూ ప్రతిపాదిత కొత్త చట్టాల విస్తృతి, లోతుపాతులను దృష్టిలో ఉంచుకున్నా... చిన్న చిన్న వివరాలను విస్మరించిన వైనాన్ని చూసినా ఇదంతా ఏదో ఒక తంతు పూర్తి చేయాలి కాబట్టి చేస్తున్నట్లుగా కనపడుతుంది. సంస్కరణలపై చిత్తశుద్ధి మాత్రం వ్యక్తం కాలేదు. 'ఎక్కడికి వెళ్తున్నావో తెలియనప్పుడు, ఏ దారీ నిన్ను ఎక్కడికి చేర్చదు' అని హెన్రీ కిసింజర్ చెప్పిన మాట నిజం!

వ్యాసకర్త ఎంపీ, మాజీ అదనపు సొలిసిటర్ జనరల్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నీడ నిజం



మీ నీడ మిమ్మల్ని పోలి ఉంటుంది. కానీ అదే సమయంలో అది ప్రతికూలమైనది. మీ నీడను తెలుసుకోవడమంటే మిమ్మల్ని మీరు తెలుసుకున్నట్టే.

– హరూకీ మురకామి, రచయిత

ఎవరు బాధ్యులు?



తమ పౌరుల మీద, ఇతర ప్రపంచం మీద యూఎస్ బయో దాడికి పాల్పడిందని రష్యన్, చైనీస్ సైన్యాలు ఆరోపించాయి. 'కోవిడ్'నూ, 'టీకాల'నూ ఉత్పత్తి చేసిన బైడెన్–ఒబామా షెల్ కంపెనీ మెటాబయోటా గురించి వాళ్లు ప్రస్తావించారు.

– లిజ్ చర్చిల్, యాక్టివిస్ట్

ప్రత్యక్ష నరకం



పాకిస్తాన్‌లోని మైనారిటీలకు ఇప్పుడు అక్కడి పంజాబ్ ప్రాంతం ప్రత్యక్ష నరకంగా మారింది. మరో దైవదూషణ కేసు. ఏ విధమైన విచారణ, సాక్ష్యాధారాలూ లేకుండా ఓ మనిషిని కాల్చిచంపారు. ఆయన ఇంటిని దోచుకున్నారు. వస్తువులను ఇంట్లోంచి బయటకు విసిరేశారు.

– ఫరాజ్ పెర్వాయిజ్, క్రైస్తవ యాక్టివిస్ట్

అనారోగ్య సమాజం



నేను చూస్తున్న ప్రతి రెండో, మూడో పేషెంట్‌కు ఫ్యాటీ లివర్ గ్రేడ్ 1, 2 దశ ఉన్నట్టు గమనిస్తున్నాను. ఆఖరికి ముప్పై ఏళ్ల యువకుల్లో కూడా! ఇది సమాజంలో సాధారణం అయిపోతోందా?

– ధ్రువ్ చౌహాన్, వైద్యుడు

నాకే వయసైందా?



నేను కాలేజీలో చదువుతున్నప్పుడు టామ్ క్రూజ్, షారుక్ ఖాన్, సన్నీ దేవల్ టాప్ స్టార్లుగా ఉండేవాళ్లు. ఇప్పుడు మా అబ్బాయి కాలేజీలో ఉన్నాడు– ఇప్పటికీ టామ్ క్రూజ్, షారుక్, సన్నీ దేవల్ స్టార్లుగానే ఉన్నారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

బాధ్యతాయుత వ్యాపారం



ఒక వ్యాపారాన్ని నిర్మించడం అంటే, అది కేవలం లాభాల గురించే కాదు, జనాల గురించి కూడా. ఒక సానుకూల సంస్కృతిని పెంపొందించడం నీతిబోధలా వినబడొచ్చు గానీ అది వ్యాపారానికి కూడా మంచిది. సమగ్రత, బాధ్యతలతో మనం విజయానికి కట్టుబడదాం. సహ ఆంత్రప్రెన్యూర్లందరికీ ప్రపంచ ఆంత్రప్రెన్యూర్ల దినోత్సవ (ఆగస్ట్ 21) శుభాకాంక్షలు.

– హర్ష్ మరీవాలా, ఆంత్రప్రెన్యూర్

సాంకేతికంగా ఆపారా?



బ్యాంకుకు చెల్లించాల్సిన 56 కోట్ల రూపాయల బకాయి చెల్లించకపోవడంతో బీజేపీ ఎంపీ సన్నీ దేవల్ జుహూ ఇంటిని బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ–వేలం వేయడానికి సిద్ధమైందని నిన్న దేశానికి తెలిసింది. ఈ ఉదయం, ఇరవై నాలుగ్గంటల లోపలే, 'సాంకేతిక కారణాల వల్ల' ఆ వేలాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా వెనక్కి తీసుకుందని మళ్లీ దేశానికి తెలిసింది. ఈ సాంకేతిక కారణాలు తలెత్తడానికి కారణం ఎవరు?

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ఎంపీ

వృద్ధులు గౌరవంగా బతికేలా...

అరవై ఐదేళ్లు దాటిన వయోవృద్ధులను ప్రభుత్వం కాపాడాలి. ఔను మరి, ఈ దేశ నిర్మాణంలో పాలుపంచుకొన్నవారిని పట్టించుకోని ప్రభుత్వాలు ఈ పనైనా చేసి పుణ్యం కట్టుకోవాలి. ఈ అంశాన్ని ఎంపీ జయా బచ్చన్ కూడా పార్లమెంటులో లేవనెత్తారు. భారతదేశంలో సీనియర్ సిటిజన్‌గా ఉండటమే నేరం అన్నట్లు ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయి. దేశంలో సీనియర్ సిటిజన్లు 70 సంవత్సరాల తర్వాత వైద్య బీమాకు అర్హులు కారు. వారు ఈఎమ్ఐపై రుణం పొందలేరు. వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వరు. పనిచేసి బతుకుదామంటే ఎవరూ పని కూడా ఇవ్వరు. కాబట్టి మనుగడ కోసం తప్పనిసరిగా ఇతరులపై ఆధారపడవలసి వస్తోంది. కానీ, పదవీ విరమణ పొందేవరకూ వీరంతా అన్ని పన్నులూ, బీమా ప్రీమియమ్‌లూ చెల్లిస్తారు. సీనియర్ సిటిజన్స్ అయ్యాక కూడా పన్నులన్నీ కట్టాల్సిందే!

భారతదేశంలో సీనియర్ సిటిజన్ల కోసం ఎటువంటి పథకమూ లేదు. రైలు ప్రయాణానికి ఇచ్చే 50 శాతం రాయితీ కూడా నిలిచిపోయింది. మరో వైపు రాజకీయాలలో ఉన్న సీనియర్ సిటిజన్లకే కాదు, కుర్రవాళ్లకు సైతం వాళ్లు ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపీ లేదా మంత్రి అయితే చాలు జీవితాంతం పెన్షన్‌తో సహా అనేక ప్రయోజనాలు కల్పిస్తోంది కేంద్రప్రభుత్వం. ఎవరో కొద్ది మంది రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప చాలా మందికి ఇటువంటి ప్రయోజనాలు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదు. పిల్లలు పట్టించుకోకపోతే ఈ వృద్ధుల పరిస్థితి ఏమిటో ఒకసారి ఊహించండి. వారు ఎక్కడికి వెళ్లాలి? ఇవ్వాళ ఇది బాధామయమైన, భయంకర సమస్య.

సీనియర్ సిటిజన్స్‌కు కోపం వస్తే తమ ఓటు ద్వారా ఎన్నికల్లో ప్రభుత్వాలను మార్చగలరనేది గుర్తుంచుకోవాలి. ఇప్పటికే వారు ఎన్ని ప్రభుత్వాల పతనాలను చూడలేదు! అందుకే అన్ని రాజకీయ పార్టీలూ సీనియర్ సిటిజన్స్‌కు కల్పించే సౌకర్యాలు, సంక్షేమ కార్యక్రమాలను తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలి. రైలు, బస్సు, విమాన ప్రయాణాలలో రాయితీలు కల్పించాలి. ఇన్సూరెన్స్ తప్పని సరిగా ఉండాలి. తుది శ్వాస విడిచే వరకూ ప్రీమియమ్ ప్రభుత్వాలే చెల్లించాలి. సీనియర్ సిటిజన్ల కోర్ట్ కేసులను తొందరగా పరిష్కరించడానికి చొరవ చూపాలి. ప్రతి నగరంలో అన్ని సౌకర్యాలతో 'సీనియర్ సిటిజన్ హోమ్'లను ఏర్పాటు చేయాలి. పదేళ్లువాడిన కార్ల నిషేధ నిబంధన వయో వృద్ధ పౌరుల విషయంలో సడలించాలి. ఈ నియమం వాణిజ్య వాహనాలకు మాత్రమే వర్తింపజేయాలి. ఈ కనీస సౌకర్యాలు, ప్రయోజనాలు కల్పించినప్పుడే వయోవృద్ధులు ఆత్మగౌరవంతో మలిదశ జీవితాన్ని ప్రశాంతంగా గడపగలరు. పెద్దలను గౌరవించాలన్న మన గొప్ప ప్రాచీన సంస్కృతిని ప్రభుత్వాలు కొనసాగించాలి.

– విశ్రాంత బ్రిగేడియర్ పోగుల గణేశం, సికింద్రాబాద్

వ్యవసాయంపైనా కృత్రిమ మేధ ప్రభావం

అభిప్రాయం



ఎన్. సీతారామయ్య

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వ్యవసాయ రంగంలోనూ అద్భుత ప్రయోజనాలు కలుగజేస్తోంది. మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఇప్పటికీ వ్యవసాయం వాటా దాదాపు 50 శాతం పైనే. ఇటువంటి వ్యవసాయ రంగంపై స్థిరంగా ఆధారపడి బతకడం కష్టమైన రోజుల్లో కృత్రిమ మేధ (ఏఐ) రైతుల్లో ఆశలు చిగురింపచేస్తోంది. మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజ్యూర్ ఓపెన్ ఏఐ' సర్వీస్ ద్వారా చాట్ జీపీటీ ఆధారంగా తయారైన 'జుగల్ బందీ' చాట్ బోట్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వేర్వేరు సంక్షేమ, సహాయ పథకాల వివరాలను అందిస్తుందీ సాఫ్ట్‌వేర్. వాట్సాప్ ద్వారా కూడా అందుకోగల ఈ చాట్ బోట్ ఇంగ్లీష్‌లో ఉన్న ప్రభుత్వ సమాచారాన్ని పది భాషల్లోకి అనువదించి మరీ రైతులకు అందిస్తూండటం విశేషం. నీరు, ఎరువులు, కీటక నాశినుల వంటి వాటిని అవసరమైనంత మాత్రమే వాడేలా చేసి పంట దిగుబడులు పెంచడం కోసం ఇది తోడ్పడగలదు.

వందేళ్ల వాతావరణ సమాచారం, మట్టి కూర్పు, పంటను ఆశించే చీడపీడలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వేసిన పంట ఎంత బాగా పండుతుంది అని కచ్చితంగా చెప్పగలదు. దీన్నే 'అంచనా విశ్లేషణ' (ప్రిడిక్టివ్ అనాలసిస్) అంటారు. ఒకవేళ నష్టం జరిగే అవకాశముంటే దాన్ని వీలైనంత తగ్గించుకునే సూచనలూ అందుతాయి.

వేర్వేరు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి విశ్లేషించడం, సొంతంగా పంటల తాలూకు సిమ్యులేషన్లు తయారు చేసుకుని అత్యున్నత సాగు పద్ధతులు, పంటలను అంచనా వేయడం సాధ్యమవుతుంది. జనరేటివ్ ఏఐ ద్వారా వ్యవసాయంలో వ్యర్థాలను గణనీయంగా తగ్గించగల 'ప్రిసిషన్ వ్యవసాయం' సాధ్యమవుతుంది. ఉదాహరణకు పంట పొలం మొత్తం తిరిగే డ్రోన్లు కలుపును గుర్తిస్తే అతితక్కువ కలుపు నాశినులతో వాటిని తొలగించే ప్లాన్‌ను కృత్రిమ మేధ అందివ్వగలదన్న మాట. అలాగే ఏయే మొక్కలకు నీరు అవసరం? వేటికి ఎండ కావాలన్న సూక్ష్మ వివరాలను కూడా ప్రిసిషన్ అగ్రికల్చర్ ద్వారా గుర్తించి అందించ



వచ్చు. ఉపగ్రహ ఛాయాచిత్రాలు, వాతావరణ సమాచారం, మట్టి కూర్పు వంటివన్నీ పరిగణించడం ద్వారా చేసే ప్రిసిషన్ అగ్రికల్చర్ వల్ల ఖర్చులు తగ్గుతాయి. దిగుబడులు పెరుగుతాయి.

జనరేటివ్ ఏఐని ఉపయోగిస్తే అధిక దిగుబడులిచ్చే, వాతావరణ మార్పులను తట్టుకోగల వంగడాలను వేగంగా సృష్టించడం సాధ్యమని నిపుణులు చెప్తున్నారు. జన్యు సమాచారాన్ని విశ్లేషించి ఏ రకమైన జన్యువులను తొలగిస్తే, చేరిస్తే లాభదాయకమో ఈ కృత్రిమ మేధ వేగంగా గుర్తించగలదు. ఇప్పటికే బెంగళూరుకు చెందిన ఒక కంపెనీ సిద్ధం చేసిన 'కిసాన్ ఏఐ' (కిసాన్ జీపీటీ) పది భారతీయ భాషల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంబంధిత కార్యక్రమాలు, పథకాల వివరాలను అందిస్తోంది. దీంతో పాటే దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకునేందుకు అవసరమైన సలహా, సూచనలు ఇస్తోంది. ప్రతినెలా కనీసం 40 వేల మంది రైతులు కిసాన్ ఏఐ ద్వారా లబ్ధి పొందుతున్నట్టు దాన్ని అభివృద్ధి చేసిన ప్రతీక్ దేశాయ్ తెలిపారు.

'డిజిటల్ గ్రీన్' అనే అంతర్జాతీయ సంస్థ గూయీ ఏఐతో జట్టుకట్టి వాతావరణ మార్పులను తట్టుకునేలా రైతులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూండగా, ఒడిశా వ్యవసాయ శాఖ 'అమాకృష్ ఏఐ' ద్వారా పంటల నిర్వహణలో రైతులకు సమాచారం అందిస్తోంది. ఇప్పటికే మిర్చి, పసుపు పంటల్లో నాణ్యతను తేల్చేందుకు కృత్రిమ మేధ ఆధారిత పరికరాలను వినియోగిస్తున్నారు. ఈ పంటలు ఏవైనా తెగుళ్లకు గురయ్యాయా? వాటిలోని రసాయనాల శాతం, రంగు, తేమ శాతం వంటి వాటిని నిమిషాల్లో తేల్చేస్తున్నారు. ఈ అంశాల ఆధారంగా మిర్చి, పసుపు పంటలకు గ్రేడింగ్ ఇస్తున్నారు. ముందు ముందు కృత్రిమ మేధ రైతుకు మరింత ప్రయోజనం చేకూరుస్తుందని ఆశిద్దాం.

నిప్పు, విద్యుత్తులు ఎలాగైతే మానవజాతి అభివృద్ధిని కీలక మలుపులు తిప్పాయో అలాగే కృత్రిమ మేధ కూడా అని అంటారు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్. మనిషీ యంత్రమూ చేయీ చేయీ కలిపి ఆడుతూ పాడుతూ పనిచేసే రోజులు వచ్చేశాయంటా రాయన.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | 94409 72048

నిన్ను నీవు తెలుసుకో!

ప్రభాకరన్ ఓ హేతువాది. ఆధ్యాత్మిక విషయాలకు ఆయన బహుదూరం. ఓరోజు రాత్రి కలలో తన పై అధికారితో పాటూ భగవాన్ రమణ మహర్షి కనిపించారు. దీంతో ఒకరోజు రమణాశ్రమానికి వెళ్లారు. ఆశ్చర్యమేమిటంటే, ఆయన ఆశ్రమంలో అడుగు పెట్టగానే భగవాన్ చిరుమందహాసం చేశారు. అంతే ఆ క్షణమే ప్రభాకరన్ సాష్టాంగ నమస్కారం చేశారు. భగవాన్ చూసిన ఒక్క చూపుతో ఆయన భక్తుడిగా మారారు. వారి మధ్య ఆత్మబంధం ఏర్పడింది. ప్రభాకరన్ ఆశ్రమంలో ఉన్న రోజుల్లో ఆయన అడిగిన అన్ని ప్రశ్నలకూ భగవాన్ జవాబిచ్చారు.

జ్యోతిర్మయం

ఓమారు భగవాన్ ప్రభాకరన్‌ని చూసి 'నువ్వు ప్రభాకరన్ అని చెప్పుకుంటున్నావు. అయితే ఈ ప్రభాకరన్ ఎవరు? అని అడిగారు. 'ఎందుకు నువ్వు (ఈ దేహం మాత్రమే) ప్రభాకరన్ అని అనుకుంటున్నావు? మీ పెద్దలు నిన్ను ప్రభాకరన్ అని పిలిచారు. నువ్వు హేతువాదివై ఉండి కూడా దానినెలా ఒప్పుకుంటున్నావు. నీ హేతువాద జ్ఞానంతో నిజంగానే నువ్వు ఎవరు అని తెలుసుకోవడానికి ప్రయత్నించు. అప్పుడు నామరూపాలతో కూడిన ఈ ప్రభాకరన్ అదృశ్యమై నీ నిజమైన స్వరూపం తెలుస్తుంది. ఈ లౌకిక బంధాలన్నీ అనుభవించేది నేను అనే తప్పుడు ఆలోచన ఆ క్షణమే పోతుంది' అన్నారు. ప్రభాకరన్ భగవాన్ భక్తుడైన తర్వాత వంద పేజీల 'ప్రపత్తి శతకం' రాశారు. ఈ పుస్తకం మొదట్లోనే 'ఓ భగవాన్! భక్తి పరిపూర్ణతకు నా హేతువాద శక్తియో, ఆధ్యాత్మికతయో, మరేదో కారణం కాదు. నా మీద ప్రసరించిన మీ చూపులే కారణ'మని పేర్కొన్నారు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

బాల్య వివాహాల నిరోధక చర్యలు అభినందనీయం

కృష్ణా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ కుమార్ లేఖ



సాక్షి, అమరావతి: బాల్య వివాహాలను నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ రాష్ట్ర కో–ఆర్డినేటర్, కృష్ణా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ బీవీఎస్ కుమార్ పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి సోమవారం ఆయన లేఖ రాశారు. బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేలా.. అధికారులతో ఒక కోర్ కమిటీ ఏర్పాటు చేస్తూ జీవో ఇవ్వడం, కలెక్టర్లతో సమావేశం నిర్వహించడం తదితర ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలిస్తాయని పేర్కొన్నారు. కొత్త జిల్లాలకు కూడా 'జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు (సీపీయూ), చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు(సీడబ్ల్యూసీ)లను ఏర్పాటు చేయాలని, జువెనైల్ జస్టిస్ యాక్ట్, మిషన్ వాత్సల్య వంటి కార్యక్రమాలను, చట్టాలను అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కుమార్ కోరారు.

ఫిలిప్పీన్స్‌లో కృష్ణాజిల్లా విద్యార్థి మృతి

రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం



పెనమలూరు: ఫిలిప్పీన్స్‌లో మెడిసిన్ చదువుతున్న కృష్ణా జిల్లాకి చెందిన విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అయోధ్య సత్యనారాయణ, శోభారాణిల ఏకైక కుమారుడు అయోధ్య జయసూర్య (23) మెడిసిన్ చదవటానికి మూడేళ్ల కిందట ఫిలిప్పీన్స్ వెళ్లాడు. ఫిలిప్పీన్స్ బనీలాడ్ సిబు సిటీ, యూవీ గుల్లాస్ కాలేజీలో చేరాడు. జయసూర్య ఆదివారం బైక్ నడుపుతూ రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. కాలేజీ యాజమాన్యం ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే పార్థసారథి, ఎంపీ వల్లభనేని బాలశౌరి అధికారులతో మాట్లాడారు. వచ్చే నెలలో ఇంటికి రావాల్సిన కుమారుడు ఇలా హఠాత్తుగా మరణించడంతో తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

30 నుంచి దుర్గగుడిలో పవిత్రోత్సవాలు

అన్ని ఆర్జిత సేవలు రద్దు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. 29వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉదక శాంతితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 30వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ, అనంతరం స్నపనాభిషేకం, నిత్య అలంకరణ, పవిత్రాల ధారణ జరుగుతుంది. ఉదయం 9 గంటలకు అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. అనంతరం గణపతి పూజ, మండపారాధన, అగ్నిప్రతిష్టాపన, సర్వప్రాయశ్చిత్త విధి తత్తత్ దేవతారాధన జరుగుతుంది. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు మూలమంత్ర హవనం, వేద పారాయణ వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 1వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పూర్ణాహుతి, కలశోద్వాసన కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని 30వ తేదీ నుంచి 1వ తేదీ వరకు ఆలయంలో జరిగే అన్ని ప్రత్యక్ష, పరోక్ష సేవలను నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో భ్రమరాంబ తెలిపారు.

కులాల కుమ్ములాటలకు దూరంగా ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ భవిష్యత్ రథసారథులు విద్యార్థులేనని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో 5, 10వ ర్యాంకులు సాధించిన భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎ.వెంకట శివరాం, వైవీ మణీందర్‌రెడ్డికి సోమవారం గుంటూరు శివారు గోరంట్లలోని భాష్యం హాస్టల్ క్యాంపస్ గ్రౌండ్స్‌లో అభినందన సభ జరిగింది. ఇందులో పాల్గొన్న వెంకయ్య మాట్లాడుతూ కులాల కుమ్ములాటలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. భాష్యం విద్యాసంస్థల ఎదుగుదలకు నిర్వాహకులు, అధ్యాపకుల్లోని క్రమశిక్షణ, అంకితభావమే కారణమన్నారు. ప్రపంచంతో భారత్ పోటీ పడుతోందని, చంద్రయాన్–3 విజయానికి చేరువలో ఉందన్నారు. తెలుగుతో పాటు ఇంగ్లిష్ ఎంతో ముఖ్యమన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, సలహాదారు మైఖేల్ రాజు, త్రివేణి స్కూల్స్ డైరెక్టర్ డాక్టర్ వీరేంద్ర చౌదరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలో చెక్కు చెదరని నైపుణ్యం

- అనేక రకాల నేతతో పట్టు సాధించిన రాష్ట్రం
- ఒక్కొక్క చోట ఒక్కో రకమైన నేత మన ప్రత్యేకం
- రాష్ట్రంలో 24 జిల్లాల నుండి మొత్తం 35 చేనేత ఉత్పత్తులు
- 'ఒక జిల్లా..ఒక ఉత్పత్తి' గుర్తింపునకు దరఖాస్తు



సాక్షి, అమరావతి: పొందూరు ఖద్దరు.. ఉప్పాడ జమ్‌దానీ చీరలు.. పెడన కలంకారీ వస్త్రాలు.. మంగళగిరి చీరలు.. ధర్మవరం సిల్క్ చీరలు ఇలా అనేక రకాల చేనేత వస్త్రాలు మన రాష్ట్రానికి సొంతం. తాజాగా మరికొన్ని రకాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వాటి వివరాలు తెలిస్తే.. చేనేతలో చెక్కు చెదరని నైపుణ్యం మనది అని గర్వంగా చెప్పుకోవచ్చు. ఏ రాష్ట్రంలో అయినా ఒకటి, రెండు రకాల ప్రత్యేకతలను సంతరించుకున్న చేనేత వస్త్రాల ఉత్పత్తి చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 26 జిల్లాలకు గాను 24 జిల్లాల్లో 35 రకాల చేనేత రకాల ఉత్పత్తులు నేయడం అరుదైన రికార్డు. 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్–ఒడీఓపీ) కార్యక్రమంలో అవార్డు కోసం వీటి వివరాలతో రాష్ట్ర చేనేత జౌళి శాఖ దరఖాస్తు చేయడం విశేషం. కాగా, ఇప్పటికే రాష్ట్రంలో దాదాపు 8 రకాల చేనేత రకాలను 'ఒక జిల్లా–ఒక ఉత్పత్తి' కార్యక్రమంలో కేంద్రం గుర్తించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మరింత కసరత్తు చేసి 35 రకాల చేనేత ఉత్పత్తులను ఓడీఓపీ అవార్డు కోసం తాజాగా దరఖాస్తు చేయడంతో ఎంపిక చేయాల్సి ఉంది. ఇప్పటికే ఉప్పాడ జమ్‌దానీ చీరలు, పెడన కలంకారీ, మంగళగిరి చీరలు, ధర్మవరం సిల్క్ చీరలు, వెంకటగిరి కాటన్ చీరలకు జియోగ్రాఫికల్ ఇండికేషన్(జీఐ) సర్టిఫికెట్ ఇచ్చారు.

చేనేతను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్

రాష్ట్రంలో చేనేత రంగానికి అన్ని విధాలుగా సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహం అందిస్తున్నారు. నేతన్న నేస్తంతోపాటు నవరత్నాల ద్వారా అమలు చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాల ద్వారా చేనేత కుటుంబాలకు భరోసా ఇస్తున్నారు. దీనివల్ల రాష్ట్రంలో చేనేత వస్త్రాల ఉత్పత్తి ఊపందుకుంది. ఏ రాష్ట్రానికి లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అనేక రకాల చేనేత ఉత్పత్తులు అందరి ఆదరణకు నోచుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఒక జిల్లా–ఒక ఉత్పత్తి (ఓడీఓపీ)' కార్యక్రమానికి మన రాష్ట్రంలోని 24 జిల్లాల్లో ఉత్పత్తి చేస్తున్న 35 రకాల చేనేత ఉత్పత్తులను అవార్డుల కోసం దరఖాస్తు చేశాం. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల దరఖాస్తులను పరిశీలించి అవార్డులకు ఎంపిక చేస్తారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌లో అనేక రకాల చేనేత ఉత్పత్తులు ఉన్నాయనే విషయం జాతీయ స్థాయిలో ప్రచారం జరగడంతోపాటు వాటి మార్కెటింగ్‌కు సైతం మేలు జరుగుతుంది.

– కె.సునీత, ముఖ్య కార్యదర్శి, చేనేత జౌళి శాఖ

ఏ ఉత్పత్తి.. ఏ జిల్లాలో..



జిల్లా	ఉత్పత్తి
శ్రీకాకుళం	పొందూరు ఖద్దరు ధోతీ, షర్టింగ్
విజయనగరం	డిజైన్ బెడ్‌షీట్స్
పార్వతీపురం మన్యం	బొబ్బిలి చీరలు
అనకాపల్లి	పాయకరావుపేట సిల్క్ చీరలు
కాకినాడ	ఉప్పాడ జామ్‌దానీ చీరలు, పెద్దాపురం సిల్క్ ధోతీలు, షర్టింగ్స్
అంబేడ్కర్ కోనసీమ	బండారులంక చీరలు, అంగర చీరలు, పసలపూడి చీరలు
తూర్పుగోదావరి	పులగుర్త కాటన్ షర్టింగ్, చీరలు, మురమండ కాటన్ షర్ట్‌లు, చీరలు, వీరవరం సిల్క్ చీరలు, దుళ్ల చీరలు
పశ్చిమగోదావరి	వేమవరం తేలిక, బరువు చీరలు
ఏలూరు	ఏలూరు కాటన్ చీరలు
కృష్ణా	పెడన కలంకారీ వస్త్రాలు, బందరు చీరలు
ఎన్టీఆర్ జిల్లా	ఆర్ట్ సిల్క్ చీరలు
గుంటూరు	మంగళగిరి చీరలు, వస్త్రాలు
పల్నాడు	సత్తెనపల్లి బెడ్‌షీట్స్
బాపట్ల	చీరాల సిల్క్ చీరలు
ప్రకాశం	ఈతముక్కల గళ్ల లుంగీలు
నెల్లూరు	పాటూరు కాటన్ సిల్క్ చీరలు
కర్నూలు	కోడుమూరు గద్వాల్ చీరలు, ఎమ్మిగనూరు బెడ్‌షీట్స్
నంద్యాల	నందివర్గం సాదా టవల్స్, లుంగీలు
అనంతపురం	ధర్మవరం సిల్క్ చీరలు
శ్రీసత్యసాయి	ధర్మవరం సిల్క్ చీరలు
వైఎస్సార్	మాధవరం చీరలు, ప్రొద్దుటూరు కోరా సిల్క్ షర్టింగ్
అన్నమయ్య	మదనపల్లె సిల్క్ చీరలు
చిత్తూరు	కొల్లగంటు టై అండ్ డై గళ్ల లుంగీలు
తిరుపతి	వెంకటగిరి కాటన్ చీరలు, శ్రీకాళహస్తి కలంకారీ వస్త్రాలు, చెన్నేరు సిల్క్ చీరలు



గరుడవాహనంపై దేవదేవుడు



గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప

తిరుమల: గరుడపంచమి సందర్భంగా సోమవారం రాత్రి తిరుమలలో శ్రీమలయప్పస్వామి తనకు ఇష్టవాహనమైన గరుడునిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య గరుడ వాహన సేవ అత్యంత రమణీయంగా జరిగింది. ఏటా శ్రావణ శుక్ల పంచమి నాడు గరుడ వాహన సేవ ఘనంగా నిర్వహిస్తారు. నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందదాయకంగా ఉండేందుకు, స్త్రీలు తమకు పుట్టే సంతానం గరుడునిలా బలశాలిగా ఉండేందుకు 'గరుడ పంచమి' పూజ చేస్తారు.

తెలంగాణ

మంత్రివర్గంలోకి 'పట్నం'

- రేపు ఉదయం 11.30కు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం
- తాండూరులో పైలట్‌తో రాజీ ఫార్ములాలో భాగంగా పదవి

సాక్షి, హైదరాబాద్: తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ టికెట్ కేటాయింపులో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ సయోధ్య కుదిర్చారు. తాండూరు టికెట్‌పై రాజీఫార్ములాలో భాగంగా శాసనమండలి సభ్యుడిగా ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి ఈ నెల 23న బుధవారం రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఉదయం 11.30కు రాజ్‌భవన్‌లో పట్నం రాష్ట్ర మంత్రివర్గంలో చేరతారు. 2014 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరిన మహేందర్‌రెడ్డి తాండూరు నుంచి గెలిచి రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2018లో తాండూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత శాసనమండలి సభ్యుడిగా పట్నం మహేందర్‌రెడ్డి ఎన్నిక కాగా, ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిన నాటి నుంచి ఇద్దరు నేతల నడుమ విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకుని పలుమార్లు బహిరంగంగా విమర్శలకు పూనుకున్నారు. 2023లో తాండూరు అసెంబ్లీ టికెట్ కోసం ఇద్దరు నేతలు తీవ్రంగా పోటీ పడుతున్న నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్యవర్తిత్వం వహించారు. రోహిత్ రెడ్డికి టికెట్ ఇస్తే సహకరించాలని మహేందర్‌రెడ్డిని కోరడంతో పాటు ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్త్‌లో అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే శాసనమండలి నుంచి కేబినెట్‌లోకి తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 2021 మే నెలలో ఈటల రాజేందర్‌ను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేసిన నాటి నుంచి కేబినెట్ బెర్త్ ఖాళీగా ఉంది. ప్రస్తుతం కుదిరిన రాజీ ఫార్ములా మేరకు కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌లో పట్నం మహేందర్‌రెడ్డి మంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ ఏడాది చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో పట్నం మహేందర్‌రెడ్డి సుమారు మూడు నెలలపాటు మంత్రిగా అధికారిక హోదాలో పనిచేస్తారు.

45 మందికి తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలు

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 45 మంది ప్రముఖులకు కీర్తి పురస్కారాలను ప్రకటించింది. తెలుగు వర్సిటీ ఏటా ఈ పురస్కారాలను ఇస్తున్న విషయం తెలిసిందే. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ తెలిపారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో డాక్టర్ చెన్నమనేని హన్మంతరావు (ఆధ్యాత్మిక సాహిత్యం) డాక్టర్ వెలుదండ వెంకటేశ్వరరావు (ప్రాచీన సాహిత్యం), సంగెవేని రవీంద్ర (సృజనాత్మక సాహిత్యం), ఎన్.గోపాలకృష్ణ (కాల్పనిక సాహిత్యం), చేవూరు సుబ్బారావు (అనువాద సాహిత్యం), డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ (అనువాదం), సంగనభట్ల చిన్న రామకిష్టయ్య (బాలసాహిత్యం), రేగులపాటి విజయలక్ష్మి (ఉత్తమ రచయిత్రి), వసుమతి (ఉత్తమ రచయిత్రి), కె.ప్రభాకర్ (వచన కవిత), చెరుకు సత్యనారాయణరెడ్డి (గేయ కవిత), సందాపురం బిచ్చయ్య (పద్య రచన), డాక్టర్ శాస్త్రుల రఘుపతి (పద్య రచన), కూర చిదంబరం (కథ), చుండూరు సీత (నవల), రాచమల్ల ఉపేందర్ (హాస్య రచన), ఎస్.ఆర్.పృథ్వీ (వివిధ ప్రక్రియలు), నాగబాల సురేశ్ కుమార్ (ఉత్తమ నాటక రచయిత), దొంతి జంగయ్య గౌడ్ (ఉత్తమ నటుడు), బెంగళూరు పద్మ (ఉత్తమ నటి), అభినయ శ్రీనివాస్ (నాటకరంగంలో కృషి), వెంకు (జనరంజక విజ్ఞానం), డాక్టర్ గుంజి వెంకటరత్నం (పరిశోధన), ప్రొఫెసర్ అమరేశం రాజేశ్వర శర్మ (చందస్సు), అన్నంరాజు సుబ్బారావు (సాహిత్య విమర్శ), వల్లూరి రమేశ్ (అవధానం), డాక్టర్ సాకే భారతి (మహిళాభ్యుదయం), విన్నకోట మురళీకృష్ణ (లలిత సంగీతం), డాక్టర్ చల్లా విజయలక్ష్మి (శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు), తేలు విజయ (జానపద గాయకులు), వై.గంగాధర్ (జానపద కళలు), డాక్టర్ షేక్ హసీన (జీవిత చరిత్ర), పరాంకుశం వేణుగోపాలస్వామి (పత్రికా రచన), పేరిణి శ్రీనివాస్ (పేరిణి నృత్యం), డాక్టర్ చింతా రవి బాలకృష్ణ (కూచిపూడి నృత్యం), ధనుంజయ లాడె (సంఘసేవ), టి.రమేశ్ (హేతువాద ప్రచారంలో కృషి), ప్రొఫెసర్ కందిమళ్ళ భారతి (గ్రంథాలయ సమాచార విజ్ఞానం), వేముల శ్రీనివాసులు (గ్రంథాలయకర్త–ముల్కనూరు), వేముల వెంకటేశ్వర్లు (సాంస్కృతిక సంస్థా నిర్వహణ), అలీ (ఇంద్రజాలం), శ్యాంమోహన్ (కార్టూనిస్ట్), డాక్టర్ సంధ్యా లక్ష్మి (జ్యోతిషం), మేకిరి దామోదర్ (ఉత్తమ ఉపాధ్యాయులు) భార్గవి (చిత్రలేఖనం–మహిళ) ఉన్నారు. త్వరలో వర్సిటీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీరికి పురస్కారాలు అందజేస్తామని రిజిస్ట్రార్ తెలిపారు.

శ్రీవారికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- అక్టోబరు 15 నుంచి 23వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు



తిరుమల: తిరుమల శ్రీవారికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడో ఏటా అధికమాసం వస్తూ ఉంటుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం (భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం)నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ రెండు బ్రహ్మోత్సవాలకు పెద్ద తేడా ఉండదు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ఈ ఏడాది అధికమాసం ఉన్న కారణంగా సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 15 నుంచి 23వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 18న ధ్వజారోహణం, 22న గరుడ వాహనం, 23న స్వర్ణ రథం, 25న రథోత్సవం (మహారథం), 26న చక్రస్నానం, ధ్వజా వరోహణం జరుగనున్నా యి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా అక్టోబరు 19న గరుడవాహనం, 22న స్వర్ణరథం, 23న చక్రస్నానం జరుగనున్నాయి.

ఆర్జిత సేవలు రద్దు

బ్రహ్మోత్సవాల కారణంగా సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు, అక్టోబరు 15 నుంచి 23వ తేదీ వరకు అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. ముందస్తుగా ఆర్జిత బ్రహ్మోత్సవం సేవా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులను నిర్దేశిత వాహనసేవకు మాత్రమే అనుమతిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల అంకురార్పణ కారణంగా అక్టోబరు 14న సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది.

ఇదే కదా.. సుపరిపాలన

- వైఎస్ జగన్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- భారీగా పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, పరిశ్రమలు
- రాష్ట్రంలో అభివృద్ధి లేదన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టకపోతే ఏపీకి నష్టం
- 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న కొమ్మినేని

సాక్షి, విశాఖపట్నం: 'రాష్ట్రంలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు.. వలంటీర్ల ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు.. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు.. పోర్టులు, హార్బర్లు, పరిశ్రమలు.. సుపరిపాలన అంటే ఇదే కదా..' అని మేధావులు అభిప్రాయపడ్డారు. సోమవారం విశాఖపట్నంలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై అవర్ స్టేట్.. అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటెలెక్చువల్ ఫోరం నిర్వహించిన సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'వలంటీర్లు ఇంటింటికి వచ్చి ప్రజలకేం కావాలని అడగడం.. ప్రతి నెలా మొదటి తేదీనే ఇంటికే వచ్చి పింఛన్లు ఇవ్వడం, సచివాలయాల్లో అవినీతి లేకుండా అన్ని సేవలు అందించడం, హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు వంటివి ఏనాడైనా చూశామా?' అని ప్రశ్నించారు. పేద విద్యార్థుల ఉన్నతి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని అమలు చేస్తుంటే చంద్రబాబు అండ్ కో అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ధర్నాలు చేసేవాళ్లని.. ఆర్బీకేలు వచ్చిన తర్వాత ఎక్కడైనా ఆ పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతానికి పైగా హామీలను సీఎం జగన్ అమలు చేశారన్నారు. ఇలా ఎప్పుడైనా.. ఏ పార్టీ అయినా చేసిందా అనే విషయాన్ని ఆలోచించాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ప్రతికూల పరిస్థితుల్లోనూ అభివృద్ధిలో పరుగులు తీస్తున్నా ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇంటెలెక్చువల్ ఫోరం వ్యవస్థాపక కార్యదర్శి జి.శాంతమూర్తి, ఏఎస్‌యూ మాజీ వీసీ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్, ఏయూ ప్రొఫెసర్ వెంకట్రావు మాట్లాడుతూ.. సంక్షేమం పథకాలపై విమర్శలు చేసిన ప్రతిపక్షాలు కూడా ఇప్పుడు సీఎం జగన్ బాటలోనే వెళ్తున్నాయని చెప్పారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఉత్తరాంధ్ర కంటే రాష్ట్రానికి ఎక్కువ మేలు జరుగుతుందన్నారు. ఉన్నత విద్యకు పెద్ద పీట వేసి.. విద్యార్థుల భవిష్యత్‌ను సీఎం జగన్ తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్ బాగుండేలా సీఎం జగన్ అనేక పథకాలు తీసుకువచ్చారని చెప్పారు. సదస్సులో యాక్సిస్ సెవెన్ ఎకో స్ట్రక్చర్స్‌కు చెందిన పాల్ భాస్కర్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ జేడీ లావణ్య, కార్పొరేటర్ పల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ తీర్పు బహుజనులదే

1,058వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అధికారం కోసం బాబు అండ్‌కో లాంటి ఎంతమంది దొంగలు ఏకమైనా అంతిమ తీర్పు బహుజనుల ఓట్లపైనే ఆధారపడి ఉంటుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,058వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు పేదవాడికి చేసిన మేలేంటో చెప్పి ప్రజల్లోకి వస్తే మంచిదని లేకుంటే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. బాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆయన రాజగురువు రామోజీ చేసిన అవినీతి అంతా ఇంతా కాదని, చిట్‌ఫండ్‌ల పేరుతో ప్రజాధనం నిలువు దోపిడీ చేసిన రామోజీ లాంటి అవినీతి పరులకు శిక్షలు పడాల్సిందేనని డిమాండ్ చేశారు. పేదోడికి ఓ న్యాయం.. పెద్దోళ్లకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బాబుకు ఆయనకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా ప్రచారం చేస్తున్న పవన్, వామపక్ష పార్టీలు, బీజేపీలకు రాష్ట్రంలో చరమగీతం తప్పదన్నారు. అవినీతి సొమ్ముతో రాష్ట్రంలో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్,, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ చేస్తున్న పాదయాత్రలు ఎవరికి ప్రయోజనమో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదలకు నేరుగా సంక్షేమ పథకాలను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అంతా రుణపడి ఉన్నారని స్పష్టం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు విచారణలు ప్రత్యక్ష ప్రసారం

- 29 కోర్టుల్లో ప్రారంభించిన సీజే జస్టిస్ అలోక్ అరాధే
- న్యాయవ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులోని 29 కోర్టు హాల్స్‌లో విచారణల ప్రత్యక్ష ప్రసారాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సోమవారం ప్రారంభించారు. ఉదయం 10.15 గంటలకు హైకోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రత్యక్ష ప్రసార సేవలను ప్రారంభించి.. న్యాయవాదులకు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత 10.30 గంటల నుంచి కోర్టుల విచారణలు ప్రత్యక్ష ప్రసారమయ్యాయి. ప్రత్యక్ష ప్రసారాలతో న్యాయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని సీజే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

లింక్ క్లిక్ చేస్తే...

హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించిన లింక్ ఇచ్చారు. ఈ లింక్ ద్వారా కోర్టును ఎంపిక చేసుకుని ప్రత్యక్ష ప్రసారాలు వీక్షించవచ్చు. ఫస్ట్ కోర్టు విచారణ ప్రత్యక్ష ప్రసారం ఇప్పటికే అందుబాటులో ఉంది. కరోనా సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు కొనసాగగా, ఆ తర్వాత హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడుతున్నారు. 2020లో ప్రత్యక్ష ప్రసారాలను అందుబాటులోకి తెచ్చిన గుజరాత్ హైకోర్టు, ఆ తర్వాత యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించింది. కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టులు కూడా ప్రత్యక్ష ప్రసారాలు, యూట్యూబ్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ప్రత్యక్ష ప్రసారాలతో పారదర్శకత పెరుగుతుందని న్యాయ నిపుణులు పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇదిలాఉండగా, హైకోర్టు, కిందికోర్టుల విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ 2022లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కూడా దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన నాటి సీజే ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులోభాగంగా ప్రసారాలకు కావాల్సిన మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

అధికారికి 'పల్లె' లంచం ఎర

- బరితెగించిన టీడీపీ మాజీమంత్రి
- నాలుగు ఎకరాల్లో ప్లాట్లు వేసి విక్రయించేందుకు పల్లె రఘునాథరెడ్డి స్కెచ్
- అనుమతులివ్వడం కుదరదని తేల్చిచెప్పిన అధికారులు
- డబ్బు తీసుకుని పనిచేయాలంటూ ఒత్తిడి
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలు



కదిరి తహసీల్దార్ కార్యాలయంలో చేతిలో డబ్బులతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

సాక్షి, పుట్టపర్తి : చంద్రబాబు హయాంలో 'తెలుగు తమ్ముళ్లు' లంచాలు, దౌర్జన్యాలతో పనులు కానిచ్చుకున్నట్లుగానే ఇప్పుడూ బరితెగిస్తున్నారు. తమ పనులు చేయాలని డిమాండ్ చేస్తూ అధికారులకు డబ్బులు ఎరగా వేసేందుకూ వెనుకాడడంలేదు. ఇందుకు తాజాగా సోమవారం శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండల రెవెన్యూ అధికారికి లంచం ఇచ్చేందుకు ఏకంగా టీడీపీ మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డే ప్రయత్నించిన ఫొటోలు బయటకొచ్చాయి. ఆ వివరాలు..

కదిరిలో పల్లె రఘునాథరెడ్డికి సంబంధించి శ్రీవివేకానంద పేరుతో డిగ్రీ కాలేజీ ఉంది. కాలేజీకి సెక్యూరిటీ కార్పస్ ఫండ్ కోసం సైదాపురం రెవెన్యూ పొలంలో 38/1, 38/2, 38/5, 38/6 సర్వే నంబర్లలోని 4.5 ఎకరాల స్థలాన్ని పూచీగా చూపించారు. ప్రస్తుతం ఈ స్థలాన్ని సుమారు 88 ప్లాట్లుగా విభజించి క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఎలాంటి హద్దులు చూపకుండానే అమ్మకాలు చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు పరిశీలించి.. అనుమతుల్లేవని తేల్చారు. ఈ తతంగం చాలారోజుల క్రితమే జరిగింది. ప్రస్తుతం ఈ స్థలానికి అధికారిక అనుమతులివ్వాలని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. అయితే, వారు ససేమిరా అన్నారు.

డబ్బు ఎరగా చూపి..

రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి నుంచి పల్లె రఘునాథరెడ్డిపై ఒత్తిడి ఎక్కువైంది. ఈ క్రమంలో పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అనుమతులివ్వాలని కోరారు. లంచాలు ఇచ్చేందుకూ ప్రయత్నించారు. డబ్బు వద్దని.. నిబంధనల ప్రకారమే పనిచేస్తామని రెవెన్యూ అధికారులు తేల్చిచెప్పినట్లు తెలిసింది. తాజాగా.. సోమవారం ఉదయం కూడా కదిరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన పల్లె రఘునాథరెడ్డి తన చేతిలో ఇలా'నోట్లు' పట్టుకుని ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

మోసపూరిత బుద్ధి మానుకుంటే మంచిది : ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

అవినీతికి పాల్పడటం, అక్రమాలు చేయడం టీడీపీ నేతలు మానుకుంటే మంచిది. సెక్యూరిటీ కార్పస్ ఫండ్‌కు అనుమతులు తీసుకున్న స్థలంలో ప్లాట్లు వేసి విక్రయాలు చేయడం సరికాదు. మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. ఎలాంటి అనుమతులివ్వడం సాధ్యంకాదని రెవెన్యూ అధికారులు తేల్చిచెప్పారు. అయితే.. డబ్బులతో అధికారులకు గాలం వేయాలని పల్లె రఘునాథరెడ్డి ప్రయత్నించడం సిగ్గుచేటు.

క్లుప్తంగా...

చేపలు తింటే ఐశ్వర్యారాయ్ లాంటి కళ్లే

మహారాష్ట్ర మంత్రి విజయ్‌కుమార్ గవిట్

ముంబై: ప్రతిరోజూ చేపలు తింటే ఐశ్వర్యారాయ్ లాగా అందమైన, సొగసైన కళ్లు పొందవచ్చని మహారాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్‌కుమార్ గవిట్ వ్యాఖ్యానించారు. నందర్బార్ జిల్లాలో ఓ కార్యక్రమంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. 'నిత్యం చేపలు తినేవారి చర్మం సున్నితంగా, నున్నగా మారుతుంది. కళ్లు వెలుగులు విరజిమ్ముతాయి. అప్పుడు ఎవరైనా సరే మీ వైపు ఆకర్షితులు కావాల్సిందే. సినీ నటి ఐశ్వర్యారాయ్ గురించి చెప్పాలంటే ఆమె మంగళూరులో సముద్రం ఒడ్డున నివసించారు. చేపలు బాగా తినేవారు. ఆమె కళ్లను మీరు గమనించారా? మీరూ చేపలే రోజూ తింటే ఐశ్వర్యారాయ్ లాంటి కళ్లను పొందవచ్చు' అని గవిట్ చెప్పారు.

కిల్లర్ నర్సుకు జీవితకాల జైలు శిక్ష

లండన్: చిన్నారుల సీరియల్ కిల్లర్ నర్సు లూసీ లెట్బీ(33)కి బ్రిటన్ కోర్టు జీవితకాల జైలు శిక్ష విధించింది. కౌంటెస్ ఆఫ్ చెస్టర్ హాస్పిటల్‌లో పనిచేసే లూసీ 2015 జూన్, 2016 జూన్ మధ్య కాలంలో ఏడుగురు నవజాత శిశువులను పొట్టనబెట్టుకోవడంతోపాటు మరో ఆరుగురు పసికందుల హత్యకు యత్నించినట్లు ఆరోపణలొచ్చాయి. వీటిపై 10 నెలలపాటు విచారణ చేపట్టిన మాంచెస్టర్ క్రౌన్ కోర్టు జడ్జి జస్టిస్ జేమ్స్ సోమవారం ఈ మేరకు శిక్షను ప్రకటించారు. మిగిలిన జీవితకాలమంతా ఆమె కటకటాల వెనుకే గడపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదే ఆమెకు సరైన శిక్ష అని పేర్కొన్నారు. భారత సంతతికి చెందిన పిల్లల వైద్యుడు డాక్టర్ రవి జయరాం ఆస్పత్రి అధికారులను అప్రమత్తం చేయడంతో లూసీ దారుణాలు వెలుగులోకి వచ్చింది.

వరిసాగు పైపైకి.. పప్పు ధాన్యాలు కిందకి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలు, పెరిగిన భూగర్భ జలాల లభ్యత కారణంగా వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. గత ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు దేశ వ్యాప్తంగా 3.45 కోట్ల హెక్టార్లుగా ఉంటే ఈ ఏడాది అది 15 లక్షల హెక్టార్లు (4 శాతం) మేర పెరిగి 3.60 కోట్ల హెక్టార్లకు చేరిందని కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. అయితే ఈ ఏడాది పప్పుధాన్యాల సాగు మాత్రం 6 శాతం మేర తగ్గింది. గత ఏడాది మొత్తంగా పప్పుధాన్యాల సాగు 1.26 కోట్ల హెక్టార్ల మేర ఉంటే అది ఈ ఏడాది 12 లక్షల హెక్టార్ల మేర తగ్గి 1.14 కోట్ల హెక్టార్లకు పరిమితం అయ్యిందని వివరించింది. ముఖ్యంగా కందుల సాగు బాగా తగ్గిందని వెల్లడించింది.

చల్లగా చావు దెబ్బ

అత్యాధునిక కూలింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసిన చైనా?

- 'లేజర్'ఆయుధాలను వెడెక్కనీయదు
- నిజమైతే యుద్ధ రీతుల్లో సమూల మార్పులు
- నిత్యం యుద్ధానికి సిద్ధంగా ఉంచుతుంది



అంతరిక్ష యుద్ధంలో చైనా నానాటికీ దూసుకుపోతోంది. ఇంధన ఆయుధ పరిజ్ఞానంలో అతి గొప్ప పురోగతి సాధించినట్లు చైనా సైన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. కనీ వినీ ఎరుగని అత్యాధునిక కూలింగ్ సిస్టం ఒకదాన్ని కనిపెట్టినట్టు చంగ్‌షాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీకి చెందిన శాస్త్రవేత్తలు ప్రకటించారు. అత్యంత హెచ్చు ఇంధన సామర్థ్యంతో కూడిన లేజర్లను పెద్దగా వేడెక్కనీయకుండా, నిరంతరం శక్తివంతంగా, ఎంతటి పెను దాడికైనా నిత్యం సిద్ధంగా ఉంచేందుకు ఈ విధానం దోహదపడుతుందని వర్సిటీ వర్గాలను ఉటంకిస్తూ సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వార్తా సంస్థ ఒక కథనం వెలువరించింది. ఈ విధానం సఫలమైందన్న వార్త నిజమైతే చైనా అమ్ములపొదిలోని అత్యాధునిక ఆయుధాలు అతి శక్తివంతమైన లేజర్ కిరణాలను ఎప్పుడు కావాలంటే అప్పుడు విచ్చలవిడిగా ప్రయోగించగలవు. అప్పుడిక యుద్ధం తీరు తెన్నులే సమూలంగా మారిపోతాయని సంబంధిత వర్గాలు విశ్లేషించాయి. పరిశోధన వివరాలను చైనీస్ జర్నల్ ఆక్టా ఆప్టికా సైనికాలో ప్రచురితమయ్యాయి.

వేడే అసలు శత్రువు

ఇలాంటి అతి శక్తివంతమైన లేజర్ ఆయుధాలను ప్రయోగించే క్రమంలో భరించలేనంత వేడి ఉద్భవిస్తుంది. ఇది సదరు ఆయుధాలకే తీవ్రంగా నష్టం చేస్తుంది. దీంతో ఆయుధం పాడవకుండా ఉండేందుకు ఆ వేడిని సంపూర్ణంగా తట్టుకునే కూలింగ్ వ్యవస్థను కనిపెట్టినట్టు చైనా చెబుతోంది. లేజర్ ఆయుధాల అభివృద్ధిలో ఇలా వాటిని చల్లబరచడమే అతి పెద్ద సాంకేతిక సవాలు.

అమెరికా అప్పట్లోనే తయారు చేసినా...

ఇలాంటి అత్యాధునిక లేజర్ ఆయుధ వ్యవస్థల తయారీలో అమెరికా చాలాకాలంగా ఎంతో ముందుంది. నేవీ అడ్వాన్స్‌డ్ కెమికల్ లేజర్, మిడిల్ ఇన్ఫ్రా రెడ్ అడ్వాన్స్‌డ్ కెమికల్ లేజర్, టాక్టికల్ హై ఎనర్జీ లేజర్, స్పేస్ బేస్డ్ లేజర్ వంటివెన్నో ఇందులో ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో ప్రయోగించినప్పుడు అద్భుతాలు చేశాయి. శబ్ద వేగాన్ని మించి దూసుకుపోగల సూపర్ సానిక్ క్షిపణులను సైతం ధ్వంసం చేసి చూపించాయి. అయితే భారీ పరిమాణం, బరువు కారణంగా వాటిని అటకెక్కించారు. పైగా వాటి పరిధి మహా అయితే కొన్ని కిలోమీటర్లు మాత్రమే. కానీ లేజర్ కాంతి పుంజం విధ్వంసక శక్తిని ఎన్నో రెట్లు పెంచినట్లు లేజర్ కాంతిపుంజ ఆయుధాల శాస్త్రవేత్త యువాన్ బృందం చెబుతోంది.

స్పేస్ ఎక్స్ పైకీ ప్రయోగం?

కూలింగ్ సిస్టమ్ సాయంతో పనిచేసే ఈ అధునాతన లేజర్ క్షిపణి వ్యవస్థ సంప్రదాయ వ్యవస్థలతో పోలిస్తే చాలా చవకైనది. ఎంతో ప్రభావవంతమైనది కూడా. పైగా దీన్ని రీఛార్జ్ చేయాల్సిన అవసరం ఉండదు. అవసరమైతే స్పేస్ ఎక్స్ తాలూకు స్టార్ లింక్ వంటి ఉపగ్రహ వ్యవస్థల పైకి ఈ లేజర్ ఆయుధాలను ప్రయోగించే యోచనలో చైనా ఉన్నట్టు చెబుతున్నారు.

హెచ్ యు ఇంధన సామర్థ్యంతో కూడిన లేజర్ ఆయుధాల ప్రయోగం విషయంలో ఇది నిజంగా ఒక గొప్ప ముందడుగు

-లేజర్ కాంతి పుంజ ఆయుధాల శాస్త్రవేత్త యువాన్ షెంగ్ ఫు

'భరించలేనంత వేడిని నిరోధించగలిగామని చైనా చెబుతున్న దాంట్లో ఏ మాత్రం నిజమున్నా ఇది నిస్సందేహంగా అతి పెద్ద ముందడుగే. ఎందుకంటే అమెరికా విఫలమైంది సరిగ్గా ఈ విషయంలోనే'

- బ్రిటిష్ సైనికాధికారి స్టీవ్ వీవర్

-సాక్షి, నేషనల్ డెస్క్

2014కు ముందు సర్వం అవినీతి, కుంభకోణాలమయం

పేదల హక్కులను, సంపదను దోచుకున్నారు

- మేమొచ్చాక ప్రతి పైసా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే..
- ప్రజలు ఎగువ ఆదాయ వర్గంలోకి చేరుకుంటున్నారు
- టీచర్ల శిక్షణా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



భోపాల్: దేశంలో 2014కు ముందు మొత్తం అవినీతి, కుంభకోణాలే రాజ్యమేలాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పేద ప్రజల హక్కులను, సంపదను విచ్చలవిడిగా దోచుకున్నారని మండిపడ్డారు. పేదల కోసం ప్రభుత్వం కేటాయించిన సొమ్ము వారికి చేరకుండా మధ్యలోనే లూటీ చేశారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చాక ఆ అరాచకానికి తెరపడిందని, ఇప్పుడు ప్రతి పైసా నేరుగా పేదల బ్యాంకు ఖాతాల్లోకే పంపిస్తున్నామని ఉద్ఘాటించారు. నీతి ఆయోగ్ నివేదికను ఆయన ప్రస్తావించారు. గత ఐదేళ్లలో ఏకంగా 13.50 కోట్ల మంది భారతీయులు దారిద్య్ర రేఖ దిగువ(పీబీఎల్) కేటగిరీ నుంచి బయటపడ్డారంటూ నీతి ఆయోగ్ ప్రకటించిందని గుర్తుచేశారు. దేశంలో పన్నులు చెల్లించేవారి సంఖ్య భారీగా పెరిగిందని అన్నారు. పన్నుల సొమ్మును మంచి పనుల కోసం, దేశ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్న నమ్మకం వారిలో కనిపిస్తోందని చెప్పారు. సోమవారం మధ్యప్రదేశ్‌లో కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. భోపాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 'అమృతకాలంలో' తొలి సంవత్సరం నుంచే సానుకూల వార్తలు రావడం ఆరంభమైందని, దేశంలో సంపద వృద్ధి చెందుతోందని, పేదరికం తగ్గిపోతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్(ఐటీఆర్)లు దాఖలు చేసే వారి సగటు వార్షికాదాయం ఆదాయం 2014లో రూ.4 లక్షలు ఉండేదని, ఇప్పుడు అది రూ.13 లక్షలకు చేరిందని వెల్లడించారు. ప్రజలు దిగువ ఆదాయ వర్గం నుంచి ఎగువ ఆదాయ వర్గంలోకి చేరుకుంటున్నారని మోదీ తెలిపారు.

దేశమంతటా సానుకూల వాతావరణం

దేశంలో దాదాపు అన్ని రంగాలు బలోపేతం అవుతున్నాయని, అదే స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, నూతన ఉద్యోగాల సృష్టి జరుగుతోందని ప్రధాని చెప్పారు. 2014లో మన దేశం ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని, ఇప్పుడు ఐదో ఆర్థిక వ్యవస్థగా మారిందని చెప్పారు. కొత్తగా నియమితులైన 5,580 మంది ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది.

ఎనిమిదేళ్ల గర్విత్.. మిస్టర్ కూల్

లిఫ్ట్‌లో చిక్కుకుపోయి హోంవర్క్ చేసుకున్న ఫరీదాబాద్ బాలుడు

ఫరీదాబాద్: మనం వెళ్తున్న లిఫ్ట్ హఠాత్తుగా ఆగిపోతే ఏం చేస్తాం? ఒక్కసారిగా కంగారుపడతాం. కేకలు వేస్తాం. ఎప్పుడు బయటపడతామా అని క్షణక్షణం ఎదురుచూస్తాం. లిఫ్ట్ తలుపులు తెరుచుకుని క్షేమంగా బయటకువచ్చేదాకా ఆందోళన తగ్గదు. కానీ, హరియాణాలో లిఫ్ట్‌లో చిక్కుకుపోయిన ఎనిమిదేళ్ల బాలుడు గర్విత్ ఏమాత్రం టెన్షన్ పడకుండా రెండు గంటలపాటు చక్కగా హోంవర్క్ పూర్తిచేసుకున్నాడు. మిస్టర్ కూల్ అనిపించుకున్నాడు. హరియాణా రాష్ట్రం గ్రేటర్ ఫరీదాబాద్‌లోని సెక్టార్-86లో ఉన్న ఒమాక్సీ హైట్ సొసైటీ అపార్టుమెంట్ నాలుగో అంతస్తులో గర్విత్ తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం 5 గంటలకు ట్యూషన్ కోసం అదే అపార్టుమెంట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌కు లిఫ్ట్‌లో బయలుదేరాడు. రెండో అంతస్తుకు చేరుకోగానే లిఫ్ట్ ఆగిపోయింది. కాసేపు ఎదురు చూసినా లిఫ్ట్ కదల్లేదు. ఇక చేసేదిలేక హోంవర్క్ చేసుకోవడం ప్రారంభించాడు. గర్విత్ ఇంకా రాలేదంటూ ట్యూషన్ టీచర్ అతడి తండ్రి పవన్‌కు ఫోన్ చేసింది. దాంతో ఆందోళనకు గురైన పవన్ అపార్టుమెంట్ అంతటా గాలించడం మొదలుపెట్టాడు. రెండో అంతస్తుకు చేరుకొని బిగ్గరగా పిలవడంతో గర్విత్ స్పందించాడు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయానని బదులిచ్చాడు. రాత్రి 7 గంటలకు ఇతరుల సాయంతో లిఫ్ట్ డోర్లను బలవంతంగా తెరవగా, గర్విత్ నవ్వుతూ బయటకువచ్చాడు. హోంవర్క్ లిఫ్ట్‌లో పూర్తి చేసుకున్నానని చెప్పాడు. పిల్లాడి ధైర్యం చూసి అపార్టుమెంట్‌వాసులు ఆశ్చర్యపోయారు.

రేపే చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్

ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ప్రపంచ దేశాలు • ల్యాండర్ మాడ్యూల్ చక్కగా పనిచేస్తోందని ఇస్రో ప్రకటన

బెంగళూరు/న్యూఢిల్లీ: ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న చంద్రయాన్-3 ల్యాండర్ కీలక ఘట్టానికి సమయం సమీపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే బుధవారం సాయంత్రం సరిగ్గా 6.04 గంటలకు ల్యాండర్ 'విక్రమ్' చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై కాలు మోపనుంది. సాయంత్రం 5.20 గంటల నుంచే ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం కానుంది. ఎలాంటి విఘ్నాలు తలెత్తకుండా ల్యాండర్ క్షేమంగా చంద్రుడిపై దిగితే కేవలం భారతీయులకే కాదు, ప్రపంచానికి కూడా అదొక చిరస్మరణీయ ఘట్టమే అవుతుంది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన మొట్టమొదటి దేశంగా భారత్ చరిత్రకెక్కుతుంది. అంతేకాదు చంద్రుడిపై భద్రంగా దిగిన నాలుగో దేశంగా రికార్డు సృష్టిస్తుంది. చంద్రయాన్-3 ల్యాండర్ మాడ్యూల్ ఇప్పటికే అక్కడ చంద్రుడి కక్ష్యలో పరిభ్రమిస్తున్న చంద్రయాన్-2 ఆర్బిటార్‌తో కమ్యూనికేషన్ ఏర్పర్చుకుందని ఇస్రో సైంటిస్టులు సోమవారం వెల్లడించారు. రెండూ పరస్పరం సంభాషించుకుంటున్నాయని తెలిపారు. 'వెల్‌కమ్, బడ్డీ!' అంటూ ల్యాండర్ మాడ్యూల్‌కు ఆర్బిటార్ స్వాగతం పలకిందని చెప్పారు. ఆర్బిటార్‌తో అనుసంధానం వల్ల ల్యాండర్ మాడ్యూల్ గురించి మరింత ఎక్కువ సమాచారం తెలుసుకోవడానికి వీలవుతుందని అన్నారు. ల్యాండర్ మాడ్యూల్ ప్రస్తుతం చక్కగా పనిచేస్తోందని, ఇప్పటికైతే ఎలాంటి అవరోధాలు కనిపించడంలేదని వెల్లడించారు. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఢిల్లీలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్రసింగ్‌తో సమావేశమయ్యారు. ల్యాండర్ మాడ్యూల్ స్థితిగతులను ఆయనకు వివరించారు. ఈ మొత్తం ప్రయోగానికి సంబంధించిన అన్ని వ్యవస్థలూ బాగా పని చేస్తున్నాయని తెలిపారు.

లేదంటే 27వ తేదీన ల్యాండింగ్?

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): ల్యాండింగ్ విషయంలో ఇస్రో కీలక ప్రకటన చేసినట్లుగా తెలుస్తోంది. ల్యాండర్ మాడ్యూల్ ప్రస్తుతం చందమామకు అత్యంత సమీపానికి చేరుకుంది. ఇక ల్యాండింగే తరువాయి. ఈ నెల 23న సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుడి ఉపరితలంపై క్షేమంగా దించడానికి ఇస్రో శాస్త్రవేత్తలు కసరత్తు చేస్తున్నారు. ల్యాండింగ్‌కు రెండు గంటల ముందు ల్యాండర్‌లో ఉన్న సైంటిఫిక్ పరికరాలతో చంద్రుడి ఉపరితలంపై పరిస్థితిని మరోమారు క్షుణ్నంగా సమీక్షిస్తామని ఇస్రో ప్రకటించింది. పరిస్థితి పూర్తి అనుకూలంగా ఉంటేనే ల్యాండ్ చేస్తామని వెల్లడించింది. ఒకవేళ అనుకూలంగా లేకపోతే ల్యాండింగ్ ప్రక్రియను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేయనున్నట్లు ఇస్రో అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. చంద్రయాన్-2, రష్యా లూనా-25 క్రాష్ ల్యాండింగ్ అయిన నేపథ్యంలో చంద్రయాన్-3 విషయంలో సైంటిస్టులు మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



ల్యాండర్‌మాడ్యూల్ తీసిన దక్షిణ ధ్రువం ఛాయాచిత్రం

దక్షిణ ధ్రువం చిత్రాలు విడుదల

ల్యాండర్ మాడ్యూల్‌లోని ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడెన్స్ కెమెరా(ఎల్‌హెచ్‌డీఏసీ) చిత్రీకరించిన చందమామ దక్షిణ ధ్రువం ఫొటోలను ఇస్రో విడుదల చేసింది. జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్ క్షేమంగా కాలు మోపడానికి ఈ కెమెరా తోడ్పడనుంది. రాళ్లు, గుంతలను ఫొటో తీసి, అవి లేని చోట ల్యాండర్ దిగడానికి అనువైన ప్రదేశాన్ని ఈ కెమెరా గుర్తిస్తుంది.

ప్రకాశ్‌రాజ్ పోస్టుపై రగడ

ముంబై: చంద్రయాన్-3 ప్రయోగాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ 'ఎక్స్'లో ఆదివారం చేసిన పోస్టు వివాదానికి దారితీసింది. ఆయనపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోలింగ్ జరుగుతోంది. చొక్కా లుంగీ ధరించిన ఓ వ్యక్తి టీ వడబోస్తున్న కార్టూన్ చిత్రాన్ని ప్రకాశ్‌రాజ్ పోస్టు చేశారు. కన్నడ భాషలో దీనికి వ్యాఖ్యను కూడా జతచేశారు. "ఇప్పుడే అందిన వార్త. చంద్రయాన్ నుంచి మొదటి చిత్రం ఇప్పుడే వచ్చింది" అని పేర్కొన్నారు. అయితే, అందులో టీ వడబోస్తున్న చాయ్‌వాలా ఎవరన్నది ప్రకాశ్‌రాజ్ బయటపెట్టలేదు. ఇస్రో మాజీ చైర్మన్ కె.శివన్‌ను ఎద్దేవా చేస్తూ ఈ పోస్టు పెట్టారని ప్రకాశ్‌రాజ్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. అయితే, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకొని పోస్టు చేశారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


సౌదీ సైన్యం కాల్పుల్లో వందలాది మంది మృతి !

దుబాయ్: సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించేందుకు యత్నించిన ఇథియోపియా వలసదారులపై సౌదీ బలగాలు జరిపిన కాల్పుల్లో వందలాదిమంది మృతి చెందినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ మంగళవారం తెలిపింది. సైన్యం మెషిన్ గన్లు, మోర్టార్లతో జరిపిన కాల్పుల్లో చనిపోయిన వారి సంఖ్య వందల్లో ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలను విడుదల చేసింది. యెమెన్ వైపు ఉన్న సరిహద్దు నుంచి వస్తున్న వలసదారుల పైకి సౌదీ బలగాలు కాల్పులు జరపడంపై ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. హ్యూమన్ రైట్స్ వాచ్ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తోందని సౌదీ అధికారి ఒకరు ఖండించారు. సౌదీలో ప్రస్తుతముంటున్న 7.50 లక్షల మంది ఇథియోపియన్ శరణార్థుల్లో 4.50 లక్షల మంది అనధికారికంగా ఉంటున్నవారే. ఇప్పటికే నిరుద్యోగ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సౌదీ ప్రభుత్వం వీరిని వెనక్కి పంపించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

మణిపూర్ రహదారులు మళ్లీ దిగ్బంధం

ఇంఫాల్: మణిపూర్‌లోని కాంగ్‌పోక్పిలో జాతీయ రహదారులపై కుకీలు తిరిగి నిరవధిక దిగ్బంధనం చేపట్టారు. రాష్ట్రంలోని కొండప్రాంతాల్లో నివాసం ఉంటున్న తమకు నిత్యవసరాలను సరిపడా అందజేయాలంటూ కుకీలకు చెందిన సదర్ హిల్స్ ట్రైబల్ యూనిటీ కమిటీ(సీవోటీయూ) డిమాండ్ చేసింది. నాగాలాండ్‌లోని దిమాపూర్‌ను ఇంఫాల్‌తో కలిపే రెండో నంబర్ జాతీయ రహదారితోపాటు ఇంఫాల్‌తో అస్సాంలోని సిల్చార్‌ను కలిపే 37వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం కుకీలు బైఠాయించారు. కాగా, పటిష్ట బందోబస్తు నడుమ నిత్యావసరాలతో కూడిన 163 వాహనాలు రెండో నంబర్ జాతీయ రహదారి మీదుగా ఇంఫాల్ వైపుగా వెళ్తున్నాయని పోలీసులు తెలిపారు. తమకు నిత్యావసరాలు, ఔషధాలు అందకుంటే ఈ నెల 26 నుంచి దిగ్బంధనం చేస్తామని కుకీ జో డిఫెన్స్ ఫోర్స్ హెచ్చరించింది. అల్లర్లకు సంబంధించి కుకీలపై నమోదైన కేసుల ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని కోరుతూ కుకీ విద్యావంతులు లేఖ రాశారు.

'రేపిస్ట్' ఢిల్లీ అధికారి సస్పెన్షన్



ఖాఖా దంపతులు

న్యూఢిల్లీ: బాలికను అత్యాచారం చేసినట్లు ఆరోపణలున్న ఢిల్లీ ప్రభుత్వ అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. సదరు అధికారితోపాటు ఈ నేరంలో పాలుపంచుకున్నట్లు ఆరోపణలున్న ఆయన భార్యనూ సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేమోదయ్ ఖాఖాను తక్షణమే సస్పెండ్ చేయాల్సిందిగా చీఫ్ సెక్రటరీని ఆదేశించినట్లు సీఎం కేజ్రీవాల్ తెలిపారు. ప్రేమోదయ్ ఖాఖా ఢిల్లీ మహిళా శిశు అభివృద్ధి శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇతని స్నేహితుడు 2020 అక్టోబర్‌లో చనిపోవడంతో స్నేహితుని కూతురును అప్పటి నుంచి తన ఇంట్లోనే ఉంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమెపై ఖాఖా పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. గర్భం దాల్చిన బాలికకు భార్య సాయంతో అబార్షన్ టాబ్లెట్లు వేయించారు. అనారోగ్యం పాలైన విషయం తెలిసి, వేరే చోట ఉంటున్న తల్లి వచ్చి బాలికను తీసుకెళ్లింది. బాలిక జరిగిన ఘోరాన్ని వెల్లడించడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖాఖాను, ఆయన భార్యను ప్రశ్నించిన పోలీసులు అరెస్ట్ చేశారు.

రాజ్యసభ ఎంపీగా జైశంకర్ ప్రమాణం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జై శంకర్ సహా తొమ్మిది మంది ఎంపీలు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం పార్లమెంట్ హౌజ్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. 2019లో తొలిసారి రాజ్యసభకు ఎన్నికైన జైశంకర్ రెండోసారి గుజరాత్ నుంచి ఇటీవల రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు బీజేపీకి చెందిన బాబూభాయ్ జెసంగ్‌భాయ్ దేశాయ్ (గుజరాత్), కేస్రీదేవ్ సింగ్ దిగ్విజయ్‌సింగ్ ఝాలా (గుజరాత్), నాగేంద్ర రాయ్ (పశ్చిమ బెంగాల్)లు, ఐదుగురు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు డెరెక్ ఒబ్రీయాన్, డోలా సేన్, సుఖేందు శేఖర్ రే, ప్రకాష్ చిక్ బరైక్, సమీరుల్ ప్రమాణ స్వీకారం చేశారు.

ట్రంప్ నోట మళ్లీ భారత్‌పై పన్ను మాట

వాషింగ్టన్: భారత్‌లో కొన్ని ఉత్పత్తులపై టారిఫ్‌లు అధికంగా ఉన్నాయంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అధ్యక్ష పగ్గాలు మళ్లీ చేపడితే భారత్‌పై ప్రతీకార పన్ను విధిస్తానని పేర్కొన్నారు. తాజాగా ఆయన ఫాక్స్ బిజినెస్ న్యూస్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. 'భారత్‌లో ట్యాక్సులు మరీ ఎక్కువ. హార్లీ డేవిడ్ సన్‌లాంటి అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీగా పన్నులు వేస్తోంది. అక్కడ 100 శాతం, 150, 200 శాతం వరకు పన్నులున్నాయి. మనం మాత్రం వారి ఉత్పత్తులకు ఎలాంటి పన్నులు విధించకూడదా? అది సరికాదు. మనం కూడా పన్నులు వసూలు చేయాల్సిందే. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే భారత్‌పై పరస్పర సమానమైన ప్రతీకార పన్ను విధిస్తా'అని ఆయన హెచ్చరించారు.

రాహుల్ సాహసోపేత ప్రయాణం



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం లద్దాఖ్‌లోని కార్దుంగ్‌లా పాస్‌ను సందర్శించారు. లేహ్ నుంచి ఇతర బైకర్లతో కలిసి 40 కిలోమీటర్లు పూర్తిగా పర్వత ప్రాంతంలోనే బైక్‌పై ప్రయాణించి ఇక్కడికి చేరుకున్నారు. స్థానికులతో మాట్లాడారు. ఈ మార్గం ప్రపంచంలో మోటార్‌సైకిల్ ప్రయాణించే అత్యంత ఎత్తయిన రోడ్లలో ఒకటి.

అమెరికాలో 'హిల్లరీ' బీభత్సం

దక్షిణ కాలిఫోర్నియాలో భూప్రకంపనలు

వాషింగ్టన్: అమెరికాలోని పలు రాష్ట్రాల్లో హిల్లరీ తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. తుపాను ధాటికి దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. భీకర గాలులు వీస్తున్నాయి. వర్షం కారణంగా పలు రహదారులు పూర్తిగా నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ముఖ్యంగా దక్షిణ కాలిఫోర్నియాలోని పలు ప్రాంతాల్లో కుంభవృష్టి కురుస్తోంది. ఈ ప్రాంతంలో ఈ స్థాయిలో వర్షం కురవడం 84 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి అని స్థానిక అధికారులు వెల్లడించారు. తుపాను బీభత్సం సృష్టిస్తుండడంతో నెవెడాలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. తుపాను వల్ల ఏ మేరకు ఆస్తి నష్టం జరిగిందన్న దానిపై సర్వే ప్రారంభించారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే డెత్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలు వరదల్లో చిక్కుకోవడం గమనార్హం. మరోవైపు దక్షిణ కాలిఫోర్నియాలో భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దక్షిణ కాలిఫోర్నియాలోని ఓజాయ్ సిటీకి ఈశాన్య దిక్కున ఆదివారం మధ్యాహ్నం భూప్రకంపనలు సంభవించాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.1గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలియజేసింది. భూ అంతర్భాగంలో 4.8 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు సంభవించినట్లు వెల్లడించింది. భూకంపానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. లాస్‌ఏంజెలెస్ నగర సమీపంలో భూమి రెండుసార్లు కంపించినట్లు అధికారులు గుర్తించారు.



కాలిఫోర్నియాలోని పామ్ డిసర్ట్ ప్రాంతంలో వంతెనను తాకుతున్న ప్రవాహం

క్షిపణుల నుంచి సంగీతం దాకా..

ముందంజలో మహిళలు: ముర్ము

న్యూఢిల్లీ: ఎన్నో అవాంతరాలను అధిగమిస్తూ మహిళలు క్షిపణుల నుంచి సంగీతం వరకు వివిధ రంగాల్లో ఎంతో సాధించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మహిళా శక్తిపై ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలోని మానెక్ షా సెంటర్‌లో సోమవారం జరిగిన ఆర్మీ అధికారుల భార్యల సంక్షేమ సంఘం(ఏడబ్ల్యూడబ్ల్యూఏ) సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగించారు. 'మహిళల సాధికారిత దిశగా ఏడబ్ల్యూడబ్ల్యూఏ సాగిస్తున్న ప్రయత్నాలను మెచ్చుకుంటున్నాను'అని అన్నారు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందనేది పాత సామెత. కానీ, ఈ రోజు దానిని విజయం సాధించిన ప్రతి పురుషుడి పక్కన ఒక మహిళ ఉంది అని చెప్పుకోవచ్చని ముర్ము అన్నారు. 'నారీశక్తి అందించే సేవలు సమాజానికే కాదు, యావత్తు దేశం పురోగతికి కీలకంగా మారాయి. క్షిపణుల నుంచి సంగీతం వరకు, మహిళలు అనేక అవరోధాలను ఎదుర్కొంటూ ఎంతో ఉన్నత శిఖరాలకు ఎదిగారు'అని ఆమె అన్నారు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
మంగళవారం । 22 । ఆగస్టు । 2023

ఆన్‌లైన్ గేమింగ్ నిషేధానికి కమిషన్

సాక్షి, చెన్నై: ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం, పర్యవేక్షణ కోసం ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటైంది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నజీముద్దీన్ నేతృత్వంలో ఈ కమిషన్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వివరాలు.. ఆన్‌లైన్ రమ్మీని నిషేధిస్తూ , ఇతర గేమింగ్‌లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ గేమింగ్ నిషేధ కమిషన్, క్రమబద్ధీకరణ– 2023 పేరిట గెజిట్‌లో వివరాలతో పాటు మార్గదర్శకాలను గతంలో విడుదల చేశారు. తాజాగా ఈ చట్టం అమలు, పర్యవేక్షణ తదితర అంశాల కోసం కమిషన్‌ను నియమించారు. రిటైర్డ్ ఐఏఎస్ నజీముద్దీన్ నేతృత్వంలోని ఈ కమిషన్‌లో మాజీ ఐపీఎస్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులను సభ్యులుగా నియమించారు.

న్యూస్‌రీల్

అత్యవసర సేవలకు రెడ్ హెల్త్ అంబులెన్స్‌లు



జెండా ఊపుతున్న భారతిరెడ్డి

సాక్షి, చెన్నై: అత్యవసర చికిత్స నిమిత్తం రోగులు, ప్రమాదాల బారిన పడ్డ వారిని ఆసుపత్రులకు తరలించేందుకు రెడ్ హెల్త్ అంబులెన్స్‌లు రంగంలోకి దిగాయి. వివరాలు.. సోమవారం వడపళనిలో జరిగిన కార్యక్రమంలో విజయా గ్రూప్‌ఆఫ్ హాస్పిటల్స్‌తో రెడ్ హెల్త్ భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. 10 నిమిషాలలోపు అంబులెన్స్‌లు రోగులను ఆస్పత్రులకు తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ అంబులెన్స్‌లను జెండా ఊపి రోడ్డెక్కించారు. ఈ విషయంపై మీడియాతో విజయ గ్రూప్ ఆఫ్ ఆసుపత్రుల మేనేజింగ్ ట్రస్టీ, సీఈఓ బి. భారతిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తాము రోగుల ఆరోగ్య సంరక్షణ, భద్రతకు ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రోగులను తరలించేందుకు వీలుగా అత్యవసర సేవల నెట్‌వర్క్‌గా ఉన్న రెడ్ హెల్త్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. రెడ్ హెల్త్ ప్రతినిధి షలభ్ డాంగ్ మాట్లాడుతూ, చెన్నై కేంద్రంగా అధునాతన అంబులెన్స్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రస్తుతం విజయ ఆసుపత్రితో ఒప్పందం చేసుకున్నామని, దశల వారీగా తమ సేవలను విస్తృతం చేస్తామన్నారు.

సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు బాంబు బెదిరింపు



కొరుక్కుపేట: చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అయితే పోలీసుల విచారణలో అది బూటకమని తేలింది. వివరాలు.. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7 గంటలకు పోలీస్ కంట్రోల్ రూంకు ఓ టెలిఫోన్ కాల్ వచ్చింది. అందులో మాట్లాడిన వ్యక్తి..'సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్టు, అది కాసేపట్లో పేలుతుంది' అని చెప్పి డిస్‌కనెక్ట్ చేశారు. వెంటనే సెంట్రల్ రైల్వే స్టేషన్ పోలీసులకు, ఫ్లవర్ బజార్ పోలీసులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. 50 సెంట్రల్ రైల్వే ఇన్‌స్పెక్టర్ గోవిందరాజ్, రైల్వే సెక్యూరిటీ ఫోర్స్ పోలీసులు స్నిఫర్ డాగ్స్, ఫైర్ ఇంజన్ సహాయంతో రైల్వే స్టేషన్‌కు చేరుకుని సోదాలు నిర్వహించారు. రైళ్లలో ప్రయాణికుల వస్తువులు, ట్రాక్ ఏరియాను పరిశీలించి తప్పుడు సమాచారమని తేల్చారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యాసర్పాడి మల్లిపూకాలనీకి చెందిన మణికందన్ (21)ను అదుపులోకి తీసుకున్నారు. కాగా నిందితుడు మానసిక రోగిగా తేలింది.

27న చెన్నైలో పురాతన కార్ల ప్రదర్శన

సాక్షి, చెన్నై : ది హిస్టారికల్ కార్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(హెచ్‌సీఏఐ) నేతృత్వంలో ఈనెల 27వ తేదీన చెన్నైలో పురాతన కార్ల ప్రదర్శన జరగనుంది. ఈ వివరాలను సోమవారం హెచ్‌సీఏఐ అధ్యక్షుడు రంజిత్ ప్రతాప్ స్థానికంగా ప్రకటించారు. ఈ ప్రదర్శన రాయల్ టెక్ పార్క్ సమీపంలోని హోటల్ తుర్యా క్యాంపస్‌లో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇందులో దేశం నలుమూల నుంచి పురాతన కార్లను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రదర్శిస్తామన్నారు. చెన్నై ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించేందుకే ఈ ప్రదర్శన నిర్వహిస్తామని ప్రకటించారు.

రూ. వెయ్యి పథకానికి 1.55 కోటి దరఖాస్తులు

సాక్షి, చెన్నై: కలైంజ్ఞర్ మహిళ హక్కు మొత్తం పథకం కోసం 1.55 కోట్ల మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారంతో ఈ దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఫీల్డ్ సర్వే ద్వారా వివరాలను సరిచూసి లబ్ధిదారుల జాబితాను ప్రకటించనున్నారు. గృహిణులకు నెలకు రూ. 1000 నగదు పంపిణీ నిమిత్తం కలైంజ్ఞర్ మహిళా హక్కు మొత్తం పేరిట పథకాన్ని సీఎం స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 15 నుంచి ఈ పథకం అమల్లోకి రానుంది. గత నెల నుంచి లబ్ధిదారుల వద్ద దరఖాస్తులను స్వీకరించారు. ఈ పథకం కోటి మందికి వర్తింపజేయనున్నారు. అయితే, కోటి 50 లక్షల దరఖాస్తులను తొలుత ముద్రించారు. ఆ తర్వాత మరికొందరికి అవకాశం ఇస్తూ, మరో 10వేలు ముద్రించారు. ఇందులో కోటి 55 లక్షల దరఖాస్తులను మహిళల పూర్తి చేసి అధికారులకు సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగియడంతో, ఇక ఫీల్డ్ సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇక చెన్నైలో 9.58 లక్షల మంది ఈ పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుల సంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను పెంచుతుందా..? లేదా..? అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

పేరూర్‌లో మెగా నిర్లవణీకరణ ప్రాజెక్టు

దక్షిణాసియాలోనే అతి పెద్ద నిర్లవణీకరణ ప్రాజెక్టు చెన్నై శివార్లలో రూపుదిద్దుకోనుంది. ఇందుకోసం చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలోని ఈసీఆర్ మార్గంలో ఉన్న పేరూర్‌ను ఎంపిక చేశారు. రూ. 4,276 కోట్లతో రోజుకు 400 మిలియన్ లీటర్ల సముద్రపు నీటిని శుద్ధీకరించి తాగునీటిగా ప్రజలకు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ పనులకు సోమవారం సచివాలయం నుంచి సీఎం ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు.

- రూ. 4,276 కోట్లతో నీటిశుద్ధి పనులు
- 400 మిలియన్ లీటర్ల ఉత్పత్తే లక్ష్యం
- శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్
- 2026 నాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయం







నిర్లవణీకరణ ప్రాజెక్టు పనులకు శంకు స్థాపన చేస్తున్న సీఎం స్టాలిన్ (ఇన్‌సెట్) ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తూ..

సాక్షి, చెన్నై: మహానగరం చెన్నై నీటి అవసరాలను తీర్చడంలో నిర్లవ ణీకరణ పథకం కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఉత్తర చెన్నై పరిధిలోని మీంజూరులో రోజుకు 120 మిలియన్ లీటర్ల సముద్రపు నీటిని శుద్ధీకరించి పంపిణీ చేయనున్నారు. అలాగే ఈస్ట్‌కోస్ట్ రోడ్డులోని నెమ్మేలిలో మరో ప్లాంట్ పనులు ముగింపు దశకు చేరాయి. ఇక్కడి నుంచి రోజుకు 150 మిలియన్ లీటర్లను ఉత్పత్తి చేసి దక్షిణ చెన్నై పరిధిలోని ప్రాంతాలకు సరఫరా చేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. ఇక చెన్నై మహా మహానగరంగా విస్తరించడం, ఈ పరిధిలోకి కొత్తగా చేరిన ప్రాంతాల్లో భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపంలోని పేరూర్‌లో మూడో నిర్లవణీకరణ పథకం ప్రాజెక్టు పనులపై దృష్టి పెట్టారు.

సీఎం శంకుస్థాపన..

పేరూర్ సముద్ర తీరం లో రూ.4,276 కోట్ల 44 లక్షల అంచనా వ్యయంతో రోజుకు 400 మిలియన్ లీటర్ల నీటిని సమర్థంగా నిర్లవణీకరణ పథకం ద్వారా ఉత్పత్తి చేయనున్నారు. ఈ పనులకు సచివాలయం నుంచి సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఈప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించిన నమూనాను వీక్షించారు. చెన్నైమెట్రో వాటర్ బోర్డు నేతృత్వంలో చేపట్టనున్న ఈ మూడో ప్రాజెక్టు జపాన్ బ్యాంక్ సహకారంతో దక్షిణాసియాలోనే తొలి అతిపెద్ద నిర్లవణీకరణ యూనిట్‌గా తీర్చిదిద్దనున్నారు. 2026 నాటికి పనులు ముగించి నీటిని ప్రజలకు వినియోగించనున్నారు. సముద్రంలో హెచ్‌డీపీఈ పైపుల ఏర్పాటు, ఎయిర్ ఫ్లోటేషన్ యూనిట్లు, ద్వంద్వ గ్రావిటీ ఇసుక ఫిల్టర్ యూనిట్లు, ఆధునిక పద్ధతిలో సముద్రంలోని చెత్తను తొలగించే ప్రత్యేక పరికరాలు ఇక్కడ కొలువు దీర్చనున్నారు. భవనాలు తదితర నిర్మాణాలే కాదు పేరూర్ నుంచి చెన్నై శివారులోని 22 పంచాయతీలను కలుపుతూ 22.67 లక్షల మందికి నీటిని అందించే విధంగా 59 కి.మీ దూరం పైప్‌లైన్లను ఏర్పాటు చేయనున్నారు. మీంజూరు ప్రాజెక్టు నుంచి ఉత్తర చెన్నై పరిధిలో 10 లక్షల మందికి ప్రస్తుతం నిర్లవణీకరణ పథకం నీళ్లు అందిస్తున్నామని, త్వరలో దక్షిణ చెన్నై పరిధిలో 18 లక్షల మందికి లబ్ధి చేకూరే విధంగా నెమ్మేలి ప్రాజెక్టు నుంచి నీటి పంపిణీ జరగబోతోందని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కేఎన్ నెహ్రూ, సీఎస్ శివదాస్ మీన, నీటి పారుదల శాఖ ప్రధాన కార్యదర్శి కార్తికేయన్, చెన్నైమెట్రో వాటర్ బోర్డు చైర్మన్ కిర్లోష్ కుమార్, జపాన్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ టగా మసయుకి, భారత్‌లోని జపాన్ అంతర్జాతీయ సహకార ఏజెన్సీ ప్రధాన అధికారి సైటో భారతదేశం కోసం జపాన్ అంతర్జాతీయ సహకార సైటో మిత్సునోరి, వాటెక్ వాపెక్ ఓ చైర్మన్, ఎండీ రాజీవ్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం హరిత హారం పథకానికి శ్రీకారం

అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఎం హరిత హారం పథకం ఆవిష్కరణ కార్యక్రమం సచివాలయంలో జరిగింది. ఈ పథకానికి శ్రీకారం చుట్టడమే కాకుండా, 40 మందిని ఎంపిక చేశారు. పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ నేతృత్వంలో జిల్లాలలో పచ్చదనంపై అవగాహన, పచ్చదనంతో కూడిన వాతావరణం కల్పించే విధంగా సీఎం హరిత హారం పథకం అమలు చేయనున్నారు. ఈ పథకాన్ని అమలు చేయడానికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాగ్నిటివ్ స్టడీస్, అన్నా యూనివర్సిటీ ద్వారా 40 మందిని ఎంపిక చేశారు. పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి, జీవవైవిధ్య పరిరక్షణ, స్థిరమైన జీవనశైలి వంటి అంశాలతో యువతకు ఓ వేదికగా ఈ పథకం రూపొందించినట్లు ప్రకటించారు. తమిళనాడు వ్యాప్తంగా మెరుగైన పర్యావరణ సేవలు, బలమైన సంస్థాగత నిర్మాణాలను అమలు చేయడం, అభివృద్ధి పద్ధతులు, పర్యావరణ అంశాలపై సుదీర్ఘ పరిశోధ వంటి అంశాలపై ఎంపికైన 40 మంది ఇక, గ్రీన్ కామ్రేడ్స్‌గా పిలవబడుతారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో మంత్రి శివ వీ మెయ్యనాథన్, పర్యావరణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహూ తదితరులు పాల్గొన్నారు.



హరితహారం పథకం అమలుకు ఎంపికైన వలంటీర్లు

స్టెరిలైట్ పిటిషన్‌ను తిరస్కరించండి

- సుప్రీంకోర్టుకు రాష్ట్రప్రభుత్వ లిఖితపూర్వక అభ్యర్థన




స్టెరిలైట్ సంస్థ

సాక్షి, చెన్నై : స్టెరిలైట్ లక్ష్యంగా వేదాంతా గ్రూప్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జరిమానా విధించి మరీ కొట్టివేయాలని సుప్రీంకోర్టుకు తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు రాష్ట్ర పర్యావరణశాఖ తరఫున లిఖిత పూర్వక వాదనను సోమవారం కోర్టులో ప్రభుత్వ న్యాయవాది సమర్పించారు. వివరాలు.. తూత్తుకుడిలోని స్టెరిలైట్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఏళ్ల తరబడి జరిగిన ఉద్యమం గురించి తెలిసిందే.అ న్నాడీఎంకే హయాంలో ఉద్యమం ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది. అల్లర్లు చెలరేగాయి. తుపాకీ కాల్పుల్లో 13 మంది మరణించారు. ఈ ఘటనతో స్టెరిలైట్‌కు శాశ్వతంగా తాళం వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ ఎలాగైనా తమ సంస్థను తెరిపించుకునేందుకు వేదాంతా గ్రూప్ ప్రయత్నాలు విస్తృతంగా చేస్తూ వస్తున్నాయి. పలు మార్లు కోర్టుల్లో చుక్కెదురైనా పట్టు వదలని విక్రమార్కుడి తరహాలో తన పోరాటాన్ని ఆ సంస్థ చేస్తూ వస్తోంది. కింది కోర్టుల తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ పిటిషన్‌ను సైతం దాఖలు చేసింది. దీనిపై లిఖిత పూర్వక వాదనను సమర్పించాలని గత విచారణ సమయంలో న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో తమిళనాడు పర్యావరణ శాఖ తరఫున ప్రభుత్వం న్యాయవాది పూర్ణిమా కృష్ణమూర్తి సోమవారం లిఖిత పూర్వక వాదనను కోర్టులో సమర్పించారు. సుమారు 22 ఏళ్లకు పైగా తూత్తుకుడిలో పర్యావరణానికి తీవ్ర ఆటంకాన్ని స్టెరిలైట్ కల్పిస్తోందని అందులో వివరించారు. ఫలితంగా ఆ పరిసరాల్లో రెడ్ అలర్ట్ హెచ్చరిక జారీ చేయాల్సిన పరిస్థితి ఇవ్వాల్సిన పరిస్థితి ఈ సంస్థ వల్ల ఏర్పడిందన్నారు. స్టెరిలైట్‌కు శాశ్వత తాళం వేశామని, ఈ పరిశ్రమను తెరిచేందుకు అవకాశాలు, అనుమతులు ఇవ్వకూడదని కోరారు. గతంలో కోర్టులు ఇచ్చిన అనేక ఉత్తర్వులను స్టెరిలైట్ యాజమాన్యం వేదాంతా గ్రూప్ ఖాతరు చేయలేదని, ఈ దృష్ట్యా, జరిమాన విధించి మరీ తాజాగా వారు దాఖలు చేసిన పిటిషన్‌ను తోసి పుచ్చాలని అభ్యర్థించారు.

వధువు.. వరుడి తండ్రి మధ్యలో ఈగో!

పెరిగిన గడ్డం ఓ వరుడి పాలిట శాపంగా మారింది. కొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఆ వరుడికి అతడి తండ్రే విలన్ అయ్యాడు. తాను నీట్‌గా షేవింగ్ చేసుకుని రమ్మంటే, వధువు మాటలు విని గడ్డం ట్రిమ్ చేసుకుని వచ్చిన తనయుడిపై కన్నెర్ర చేసిన ఆ తండ్రి ఏకంగా వివాహాన్ని ఆపేశాడు. సంచలనం కలిగించిన ఈ వినూత్న వివాదాన్ని మీరూ చదవండి..

- గడ్డం వివాదంతో ఆగిన వివాహం
- కోయంబత్తూరులో సంచలనం



సాక్షి, చెన్నై: కోయంబత్తూరు నగరం పరిధిలోని సూలూరుకు చెందిన ఓ పారిశ్రామికవేత్త తన కుమారుడికి వివాహ ఏర్పాట్లు చేశాడు. మూడు నెలల క్రితం పొల్లాచ్చి ప్రాంతానికి చెందిన యువతితో నిశ్చితార్థం జరిగింది. ఇరు వర్గాల పెద్దలు మూడు నెలలుగా పెళ్లి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తనకు కాబోయే భార్యతో ఆ పారిశ్రామికవేత్త తనయుడు నిత్యం ఫోన్‌లో బీజీ కూడా అయ్యాడు. ఈ పరిస్థితుల్లో ఆ వరుడు నిత్యం గడ్డంతో కనిపించే వాడు. పెళ్లి సమయానికి గడ్డం తీసివేసి నీట్‌గా షేవింగ్ చేసుకోవాలని తండ్రి సూచిస్తూ వచ్చాడు. ఆ మేరకు పెళ్లి గడియల సమయం ఆసన్నమైంది. సోమవారం వివాహం బ్రహ్మాండంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం తండ్రి ఆదేశాల మేరకు బ్యూటీ పార్లర్‌కు వెళ్లి తన గడ్డం తొలగించి నీట్‌గా షేవింగ్ చేసుకునేందుకు వరుడు వెళ్లాడు. అయితే బ్యూటీ పార్లర్‌లో ఏమి జరిగిందో ఏమోగానీ, గడ్డంను ట్రిమ్ చేసుకుని ఇంటికి వచ్చిన తనయుడిని చూసిన తండ్రి ఆగ్రహానికి లోనయ్యాడు. షేవింగ్ ఎందుకు చేసుకోలేదంటూ ప్రశ్నించాడు.

వధువుకు నచ్చినందుకేనా.

తనకు కాబోయే భర్త గడ్డంతోనే పెళ్లి పీటలు ఎక్కాలని, కాస్త ట్రీమ్ చేసుకుంటే చాలుని వధువు సూచించినట్లు తండ్రికి.. వరుడు సమాధానం చెప్పాడు. ఈ సమాధానం తండ్రిని చిర్రెత్తుకొచ్చింది. ఇప్పుడే నాకు గౌరవం ఇవ్వడం మానేసినట్టున్నావ్..? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. గడ్డం తీస్తేనే పెళ్లి అని తేల్చి చెప్పేశాడు. దీంతో ఎవరి మాట వినాలో అయోమయంతో తల్లడిల్లిన ఆ తనయుడు చివరకు తండ్రిని బుజ్జగించే ప్రయత్నం చేశాడు. అయితే, ఏమాత్రం వెనక్కి తగ్గని ఆ తండ్రి తన సామాజిక మాధ్యమాల్లో సోమవారం జరగాల్సిన తన కుమారుడి వివాహం ఆగిందని, ఎవ్వరూ రావాల్సిన అవసరం లేదని ప్రకటించేశాడు. ఇది వధువు కుటుంబం దృష్టికి చేరడంతో వరుడి ఇంటికి పరుగులు తీశారు. తాను చెప్పినట్టుగా గడ్డం తొలగించకుండా వధువు చెప్పినట్టుగా ట్రిమ్ చేసుకొచ్చిన తనయుడు పరిస్థితిని వారికి వివరించాడు. బంధువులు, వధువు కుటుంబం బుజ్జగించినా ఆ తండ్రి ఏమాత్రం తగ్గకపోవడం ఉదయం జరగాల్సిన వివాహం ఆగిపోయింది. కాగా తన కంపెనీలోని కార్మికులే గడ్డం పెంచితే తాను ఒప్పుకోనని.. అలాంటిది కొడుకే ఈ నియమాన్ని ఉల్లంఘించడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సదరు తండ్రి చెప్పడం కొసమెరుపు. ఈ విషయం మీడియాకి తెలియడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

కావేరి జల వివాద పరిష్కారానికి ప్రత్యేక బెంచ్

- సుప్రీంకోర్టు నిర్ణయం



కావేరి నది

సాక్షి, చెన్నై: కావేరి నదీజలాల వివాదంపై విచారించేందుకు ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయనున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్ర చూడ్ ప్రకటించారు. ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన బెంచ్‌లో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన అత్యవసర పిటిషన్ విచారణకు రానుంది. వివరాలు.. మూడేళ్ల అనంతరం తమిళనాడు – కర్ణాటక మధ్య కావేరి జల వివాదం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ ఏడాది కర్ణాటక నుంచి తమిళనాడుకు వాటా నీరు పూర్తిస్థాయిలో అందడం లేదు. కేంద్రంతో పాటు కావేరి యాజమాన్య సంస్థ సైతం చేతులు ఎత్తేయడంతో ఇక, సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించాల్సి వచ్చింది. గతవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని అత్యవసరంగా పరిగణించాలని, తమిళనాడులోని డెల్టా జిల్లాల్లో సాగుకు నీరు అందక రైతులు పడుతున్న కష్టాలు, పంటలు ఎండే అవకాశం తదితర అంశాలను సుప్రీంకోర్టు ముందు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులు ఉంచారు. అత్యవసర పిటిషన్‌గా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఇదివరకు ఈ కేసును విచారించిన బెంచ్‌లోని న్యాయమూర్తుల వివరాలను ఈ సందర్భంగా తమిళనాడు న్యాయవాదుల వద్ద ప్రధాన న్యాయమూర్తి ఆరా తీశారు. గత బెంచ్‌లో ఉన్న న్యాయమూర్తులు పదవీ విరమణ పొందిన నేపథ్యంలో కావేరి వ్యవహారంపై కొత్త బెంచ్ ఏర్పాటుకు సీజేఐ ఆదేశాలు జారీ చేశారు. ఈ పిటిషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, కొత్త బెంచ్ ఏర్పాటుతో విచారణ వేగవంతం చేస్తామన్నారు. అదే సమయంలో కర్ణాటక తరపు న్యాయవాదులు మేఘదాతులో డ్యాం నిర్మాణ ప్రస్తావనను సీజేఐ ముందు ఉంచారు. అయితే వారి వాదనను తోసి పుచ్చుతూ, ఏదేని వాదనలు ఉంటే కొత్త బెంచ్ ముందు వినిపించాలని, ఆ బెంచ్‌ను అభ్యర్థించుకోవాలని సూచించారు. మంగళవారం లేదా బుధవారం కొత్త బెంచ్ కావేరి వ్యవహారంపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా, కావేరి జల వ్యవహారం సుప్రీంకోర్టులో విచారణ మొదలు కానున్న నేపథ్యంలో కర్ణాటక నుంచి కావేరి నదిలో నీటి రాక కాస్త పెరిగింది. మేట్టూరు జలాశయంలోకి ఈ నీరు వచ్చి చేరుతుండడం గమనార్హం.

పెరగనున్న డీఎంకే జిల్లాల సంఖ్య

- రెండు నియోజకవర్గాలకు ఓ కార్యదర్శి నియామకం

సాక్షి, చెన్నై: డీఎంకే పార్టీ పరంగా జిల్లాల సంఖ్య పెరగనుంది. రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓ కార్యదర్శిని నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన కసరత్తులు తేనాం పేటలోని డీఎంకే కార్యాలయం అన్నా అరివాలయంలో జరుగుతున్నాయి. వివరాలు.. రాష్ట్రంలో 38 జిల్లాల ఉన్న విషయం తెలిసిందే. అయితే తమకు అనుకూలంగా అయా జిల్లాలను ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర అని విభజించుకుని కార్యదర్శులు, కమిటీలను డీఎంకే, అన్నాడీఎంకే తదితర ప్రధాన పార్టీలు తమ కార్యక్రమాలను విస్తృతం చేస్తూ వస్తున్నాయి. ఆ దిశగా రాష్ట్రంలో ఇప్పటికే డీఎంకే పరంగా జిల్లాల సంఖ్య 72గా ఉంది. ఇందులో జిల్లాల కార్యదర్శులు, నగర కార్యదర్శులు కూడా ఉన్నారు. తాజాగా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ తమ పరిపాలనా సౌలభ్యం కోసం పార్టీ పరంగా జిల్లాల సంఖ్యను పెంచేందుకు సిద్ధమయ్యారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను మరింతంగా దరిచేర్చడమే కాకుండా, పార్టీ పరంగా కీలకంగా ఉన్న వారికి పదవులు కేటాయించడం, ప్రజలతో జిల్లాల కార్యదర్శులు, ముఖ్య నేతలు మమేకం అయ్యేందుకు మరింత అవకాశం కల్పించేందుకు జిల్లాల విభజనపై దృష్టి పెట్టి ఉన్నారు. పార్టీ పరంగా ప్రస్తుతం ఉన్న జిల్లాల సంఖ్యను పెంచేందుకు సంబంధించిన కసరత్తులు మొదలు పెట్టారు. తమకు పట్టు తక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఇక్కడ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలను ఓ జిల్లాగా విభజించి ఓ కార్యదర్శి, జిల్లా కమిటీని నియమించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 234 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నా, సగానికి సగం కాకుండా పార్టీ పరంగా జిల్లాల సంఖ్యను కనీసం 100 లేదా 110 వరకు తీసుకెళ్లేందుకు సంబంధించిన ఆదేశాలను సీనియర్లకు స్టాలిన్ ఇచ్చినట్టు సంకేతాలు వెలువడ్డాయి. అన్నా అరివాలయం వేదికగా ఈ పనులు వేగంగా జరుగుతో న్నట్టు ఓ నేత పేర్కొన్నారు.

60 మంది నిందితుల అరెస్టు

కొరుక్కుపేట: ఆవడి పోలీస్ అథారిటీ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున జరిపిన దాడిలో 60 మంది రైడర్లను (వివిధ కేసుల్లో నిందితులు) అరెస్టు చేసినట్లు కమిషనర్ కె.శంకర్ వెల్లడించారు. ఈ దాడుల్లో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ విజయకుమార్, సెంకుర్రం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కమిషనర్లు సహా 100 మందికి పైగా పోలీసులు పాల్గొన్నట్లు వివరించారు. అరెస్టయిన వారిలో 28 మంది హత్య కేసుకు సంబంధించిన వారు. అదేవిధంగా హత్యాయత్నం కేసులో 11 మంది, గంజాయి కేసులో ఇద్దరు వ్యక్తులు, పీడీ యాక్ట్ ఉన్న ఓ నిందితుడు, ఇతర ప్రధాన నేరస్థులు 18 మంది ఉన్నట్లు ప్రకటించారు.

కరుణ శతజయంతి ఉత్సవాలపై సీఎం సమీక్ష



మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సాక్షి, చెన్నై: డీఎంకే దివంగత నేత కలైంజ్ఞర్ కరుణానిధి శత జయంతి ఉత్సవాల విస్తృతం గురించి అధికారులు, సీనియర్ మంత్రులతో సీఎం స్టాలిన్ సమీక్షించారు. ఆధునిక తమిళనాడు రూపకర్త కలైంజ్ఞర్ కరుణానిధిని గౌరవించుకునే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు జరిగిన వేడుకలను మంత్రులు సీఎంకు వివరించారు. దీనిపై సీఎం స్టాలిన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల నేతృత్వంలో వేడుకలను విస్తృతం చేయడం కోసం మంత్రుల నేతృత్వంలో 12 మందితో కమిటీని ప్రకటించారు. ఇందులో భాగంగా కోయంబత్తూరులో కలైంజ్ఞర్ స్మారకం, చెన్నై సెమ్మొళి పార్కులో కలైంజ్ఞర్ పేరిట ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించారు. నేటి యువతకు కలైంజ్ఞర్ వ్యక్తిత్వాన్ని తెలియజేసే విధంగా, 100 పేజీలతో ఆయన జీవిత చరిత్ర పుస్తకం రూపకల్పనకు చర్యలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు దురై మురుగన్, నెహ్రూ, పెరియస్వామి, ఏవీ వేలు, తంగం తెన్నరసు, ఉదయనిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో 2024 పెట్టుబడుల మహానాడు గురించి చర్చించారు. 100 దేశాల నుంచి ఐదు వేల ప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానించాలని నిర్ణయించారు.

చిత్రం.. చెప్పే సంగతులు!



చెన్నై నగరంలో సుందర తీరంగా ఉన్న మెరీనా బీచ్‌కు కూతవేటు దూరంలో నొచ్చికుప్పం మురికివాడ ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిసరాలను సుందరంగా తీర్చి దిద్దేందుకు కన్నగి ఆర్ట్ డిస్ట్రిక్, ఎస్.టి. ప్లస్ ఆర్ట్ ఇండియా ఫౌండేషన్ చర్యలు తీసుకుంది. చిత్రకారుల పర్యవేక్షణలో విద్యార్థి, యువ సమూహం మురికివాడల్లో కనిపించే దృశ్యాలనే తమ సుందర చిత్రాలుగా అక్కడి బహుళ అంతస్థుల గోడలపై తీర్చిదిద్దారు. ప్రస్తుతం మెరీనా తీరంలో ఈ మురికివాడ తాజా పెయింటింగ్ దృశ్యాలతో మరింత ఆకర్షణగా మారింది.

– సాక్షి, చెన్నై

క్లుప్తంగా

చెన్నైలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రెయిన్, స్పైన్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు నెహ్రూ, పెరియస్వామి

సాక్షి, చెన్నై: చెన్నై రేడియల్ రోడ్డులో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రెయిన్ అండ్ స్పైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం దీనిని మంత్రులు కేఎన్ నెహ్రూ, పెరియస్వామి ప్రారంభించారు. కావేరి ఆసుపత్రి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ గురించి డాక్టర్ చంద్రకుమార్ మీడియాకు వివరించారు. ఇటీవల కాలంగా ప్రజల్లో మెదడు, వెన్నెముక వంటి సమస్యలు పెరిగాయని పేర్కొన్నారు. అందుకే ఇలాంటి రుగ్మతలతో వచ్చే రోగుల కోసం ఉత్తమ సౌకర్యాలు, అత్యాధునిక పరికరాలతో సకాలంలో వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ స్థాయిలో మౌలిక సదుపాయాలు, వైద్య నిపుణుల బృందాన్ని ఇక్కడ నియమించామన్నారు. 24 గంటల పాటు వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కావేరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

తనయుడిని హత్య చేసిన తల్లి

తిరువొత్తియూరు: మధురవాయల్ సమీపంలో తనయుడిని తల్లి హత్య చేసినట్లు వెలుగులోకి రావడంతో తల్లిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. వివరాలు.. చెన్నై మధురవాయల్ సమీపంలోని పులియంబేడు ప్రాంతానికి చెందిన హరి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య సెల్వి. వీరి కుమారుడు పూవరసన్ (23) రామాపురంలోని ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం వీరు ఇంటిలో ఇంటి నుంచి ఎవరు బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు వెళ్లి చూడగా తల్లి కుమారుడు ఇద్దరూ రక్తపు మడుగులో స్పృహతప్పి పడి ఉన్నారు. పోలీసులు సెల్వి, పూవరసన్‌ను కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకున్న సెల్వి తన కుమారుడిని తానే ఇనుప కంబీతో కొట్టినట్లు చెప్పారు. తనపై ఎవరు దాడి చేశారో ఆమె చెప్పలేదు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం పూవరసన్ మృతి చెందాడు. సెల్వి భర్తను పోలీసులు ప్రశ్నించగా తన భార్య తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు తెలిపాడు.

రూ.25 కోట్లతో ఆలయ మరమ్మతు పనులు

- దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు వెల్లడి
- కరుమారియమ్మన్ ఆలయంలో పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు

తిరువళ్లూరు: తిరువేర్కాడులో ప్రసిద్ధి చెందిన దేవీ కరుమారియమ్మన్ ఆలయంలో రూ.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ మరమ్మత్తు పనులను మంత్రి శేఖర్‌బాబు సోమవారం ఉదయం ప్రారంభించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి కరుమారియమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని ఆలయ నిధులు రూ. 5 కోట్లు, దాతల నుంచి సేకరించిన రూ.20 కోట్లతో పాటు మొత్తం రూ.25 కోట్లు వ్యయంతో మరమ్మతు పనులను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ పనులను రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మీడియాతో మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ తిరువేర్కాడు అమ్మవారి ఆలయంలో గర్భగుడి, అర్ధమండపం, మహామండపం, నల్లరాతితో ఆలయ ప్రాకారాలు ఏర్పాటు, ఎత్తు పెంపు, ఉప ఆలయాల ఏర్పాటు తదితర పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 ఆలయాలను ఎంపిక చేసి మాస్టర్‌ప్లాన్ ద్వారా ఆలయ మర్మమతు పనులు చేయడానికి అంగీకరించినట్లు తెలిపారు.

భారీగా నిధుల కేటాయింపు

తిరుచెందూరు మురుగన్ ఆలయాన్ని రూ.300 కోట్లు, పెద్దపాళ్యం భవానీ అమ్మవారి ఆలయానికి రూ. 170 కోట్లు, పళణి దండాయుధపాణి ఆలయానికి రూ.99 కోట్లు, తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పనుల కోసం రూ.103 కోట్లు, రామేశ్వరం రామనాథ స్వామివారి ఆలయ పనుల కోసం 159 కోట్లు, తిరువణ్ణామలై ఆలయానికి రూ.78 కోట్లు, సమయపురం మారియమ్మన్ ఆలయానికి రూ.64 కోట్లు, వడలూరు వల్లలార్ ఆలయానికి రూ.99.90 కోట్లు, తిరువేర్కాడు అమ్మవారికి ఆలయానికి మరో రూ.65 కోట్లతో పనులను చేపట్టడానికి మాస్టర్ ప్లాన్ ద్వారా అంగీకరించినట్లు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. దీంతో పాటు వయలూరు సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయం, మేల్ మలైయనూర్ అంకాళపరమేశ్వరి అమ్మవారు, కల్లళగర్ ఆలయం, శిరువాపురిలో మురుగన్ ఆలయాలతో కలిసి ఐదు ఆలయాలను ఈ ఏడాదిలో మాస్టర్ ప్లాన్‌లో చేరి మరో రూ.200 కోట్లుతో మర్మమత్తు పనులు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు వాటి ఆస్తులను పరిరక్షించడానికి తమ ప్రభుత్వం కఠిన నిర్ణయాలను తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూందమల్లి ఎమ్మెల్యే కృష్ణస్వామి, దేవదాయశాఖ కమిషనర్ మురళీధరన్, ఆర్డీఓ జయరాజ్ పౌలిన్, జాయింట్ కమిషనర్ ముల్లైతో పాటు పలువురు పాల్గొన్నారు.

101 సవర్ల నగలు చోరీ

అన్నానగర్: మధురై లాడ్జిలో ఉన్న ముంబయికి చెందిన ఓ నగల కంపెనీ ఉద్యోగి వద్ద 101సవర్ల నగలను అపహరించిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. ముంబైలోని మహారాష్ట్ర రాష్ట్రం దాదాన్సీ స్ట్రీట్‌లో నివాసముంటున్న జితేంద్ర కుమార్ రమేష్ జైన్ (36) జ్యూవెలరీ కంపెనీ ఉద్యోగి. అతను మదురైలో స్థానికంగా ఉన్న నగల దుకాణాల్లో ఆర్డర్లు తీసుకుని తన డబ్బుతో నగలు తయారు చేసి విక్రయిస్తున్నాడు. ఈక్రమంలో దుకాణాల్లో ఆర్డర్ చేసిన నగలను డెలివరీ చేసేందుకు 18వ తేదీన మదురై వచ్చాడు. మేలమాసి రోడ్డులోని ఓ నగల దుకాణంలో 345 గ్రాముల ఆభరణాలపై టెలీ పన్ను కట్టారు. తర్వాత మిగిలిన 101 సవర్ల నగలతో,షాప్ ఫ్లోర్‌లోని లాడ్జిలో బస చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయి మరుసటి రోజు (ఆగస్టు 19) గదికి తిరిగి వచ్చాడు. ఆపై గదిలో ఉంచిన 101 తులాల ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందాడు. రమేష్ జైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిలగర్ దిడల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులను బహిష్కరించి న్యాయవాదుల ఆందోళన



ఊత్తుకోట కోర్టు ఆవరణలో ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

తిరువళ్లూరు: వందేళ్లకు పైగా ఆచరణలో ఉన్న చట్టాలను మార్చడంతో పాటు భాష స్వేచ్ఛను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తిరువళ్లూరు జిల్లాలోని న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన నిర్వహించారు. ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రోసీజర్‌కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు చట్టాల నిబంధనలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం సవరించింది. దీంతో పాటు భాషాస్వేచ్ఛ ఉన్న భారతదేశంలో సంస్కృతం భాషలో అర్థాలు వచ్చే విధంగా రూపొందించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళన నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఇందులో భాగంగానే తిరువళ్లూరులోని జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులకు దూరంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్ణయాలను పునఃసమీక్షించి వెంటనే వెనుక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. కాగా ఊత్తుకోట, ఆవడి, పూందమల్లి, పొన్నేరి తదితర ప్రాంతాల్లోనూ న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. ఇందులో న్యాయవాదుల సంఘం నేతలు ఆధామ్, బీకే నాగరాజ్, బహుజన్ శ్రీనివాసన్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేకు 293 వినతులు

తిరువళ్లూరు: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు 293 వినతులు వచ్చినట్లు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ తెలిపారు. ఇందులో పట్టాల కోసం 87 వినతులు, ఉపాధి కోసం 34, మౌలిక సదుపాయాలు కల్పించాలని 57 వినతులు, పక్కా గృహాల కోసం 74 మంది వినతిపత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. డీఎస్ఓ జవహర్‌బేగం, ఆదిద్రవిడ సంక్షేమశాఖ అధికారి సెల్వరాణి, డిప్యూటీ కలెక్టర్ మధుసూదనన్, డిప్యూటీ కలెక్టర్ గాయత్రీసుబ్రమణ్యం, వికలాంగుల సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసన్ పాల్గొన్నారు.

మెరీనా తీరానికి చేరిన విద్యార్థి మృతదేహం

అన్నానగర్: చెన్నైలోని కోడంబాక్కంకు చెందిన అరుల్(14) అనే విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గత శనివారం అరుల్ తన స్నేహితులు యోగేశ్వరణ్, దర్శన్‌తో కలిసి మెరీనా బీచ్‌కు వచ్చాడు. ఆ తర్వాత ముగ్గురూ సముద్రంలోకి దిగి స్నానం చేశారు. అప్పుడు ముగ్గురూ పెద్ద అలల్లో చిక్కుకుని సముద్రంలోకి ఈడ్చుకెళ్లారు. విద్యార్థులు కేకలు వేయడంతో ప్రజలు పోలీసులకు సమాచారం అందించారు. రక్షకులు ఆ ప్రాంతంలో వెతకగా, యోగేశ్వరన్, దర్శన్‌ని రక్షించారు. అరుల్ ఒక్కడే మిస్సయ్యాడు. కోస్ట్‌గార్డ్ సిబ్బంది ఆదివారం విద్యార్థి కోసం హెలికాప్టర్ సహాయంతో అరుల్ కోసం వెతికారు. కానీ దొరకలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మెరీనా బీచ్‌లో అరుల్ మృతదేహాన్ని కోస్ట్‌గార్డ్ అధికారులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసు వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

తిరువొత్తియూరు: మెరీనా తీరం చూడడానికి వచ్చిన ఓవృద్ధురాలు సోమవారం ఉదయం రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసు వాహనం ఢీకొని ఘటనా స్థలంలోనే మృతి చెందింది. వివరాలు.. చెన్నై సమీపంలోని అంబత్తూరు కల్లికుప్పం ప్రాంతానికి చెందిన మేరీ (57) సోమవారం తన కుటుంబంతో మెరీనా సముద్ర తీరంలోని ఎంజీఆర్, కరుణానిధి సమాధులను చూసేందుకు వచ్చారు. అనంతరం కామరాజర్ రోడ్డు దాటుకుని ప్రెసిడెన్సీ కళాశాలకు రావడానికి యత్నించారు. ఆ సమయంలో లైట్‌హౌస్ నుంచి సెక్రటరియెట్‌కు వస్తున్న పోలీసు వాహనం ఢీకొంది. దీంతో మేరి అక్కడికక్కడే మరణించారు. అన్నా సమాధి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఒమాందూర్ ఆసుపత్రికి తరలించారు.

పన్నీరు కొత్త పత్రిక ప్రారంభం



పన్నీరు సెల్వం

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకేను కైవసం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న మాజీ సీఎం పన్నీరు సెల్వం ఓ కొత్త పత్రికను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర పర్యటనకు సిద్ధమయ్యారు. అన్నాడీఎంకేను పళణి స్వామి తన గుప్పెట్లోకి తెచ్చుకుని మదురై వేదికగా ఆదివారం బ్రహ్మాండ మహానాడును విజయవంతంచేసుకున్న విషయం తెలిసిందే. అదే సమయంలో న్యాయ పోరాటం ద్వారా ఏదో ఒక రోజు పార్టీని తన గుప్పెట్లోకి తీసుకుంటానన్న ధీమాతో ఉన్న మాజీ సీఎం పన్నీరు సెల్వం తన ప్రచారం కోసం కొత్త పత్రికపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం అన్నాడీఎంకే పళణి స్వామి గుప్పెట్లోకి చేరడంతో ఆ పార్టీకి చెందిన జే న్యూస్ ఛానల్, పత్రిక ప్రస్తుతం ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తోంది. అలాగే గతంలో దివంగత సీఎం జయలలిత ఏర్పాటు చేసిన జయ టీవీ ఛానల్, మరో పత్రిక అన్నాడీఎంకేలో చీలికతో ఆవిర్భవించిన దినకరన్ నేతృత్వంలోని అమ్మ మక్కల్‌మున్నేట్రకళగంకు అనుకూలంగా ఉంది. ఈ పరిస్థితులలో తన కంటూ ప్రచారం కోసం ఓ పత్రిక ఏర్పాటు పన్నీరుకు అనివార్యమైంది. దీంతో పురట్చి తొండన్ పేరిట కొత్త పత్రికను సోమవారం ఏర్పాటు చేశారు. చెన్నై ఎగ్మూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పత్రిక తొలి కాఫీని పన్నీరు సెల్వం విడుదల చేశారు. దీనిని ఆ పార్టీ నేతలు బన్రూటి రామచంద్రన్, వైద్యలింగం, మనోజ్ పాండియన్ తదితరులు అందుకున్నారు. అలాగే, తన బలాని చాటే విధంగా, మద్దతు దారులను ఏకం చేసేందుకు పన్నీరు రాష్ట్ర పర్యటనకు రెడీ అయ్యారు. సెప్టెంబరు 3వ తేదీ నుంచి ఆయన పర్యటన మొదలు కానుంది. కాంచీపురం నుంచి తన పర్యటన కు శ్రీకారం చుట్టే విధంగా పన్నీరు రూట్ మ్యాప్ సిద్ధంచేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా, పన్నీరుతో జత కట్టిన అమ్మమక్కల్ మున్నేట్ర కళగంనేత టీటీవీ దినకరన్ మదురై మహానాడు గురించి వ్యాఖ్యలు చేశారు. ఇది చైతన్య మహానాడు కాదు అని, వారి పతనానికి నాంది పలికే మహానాడు అని విమర్శించారు. స్టాలిన్, పళణి స్వామి ఇద్దరు దొందు దొందే అని, ఈ ఇద్దరు హిట్లర్‌కు బ్రదర్స్ అని ఎద్దేవా చేశారు.

శ్మశానానికి దారి కల్పించాలని ధర్నా

వేలూరు: కన్నియంబాడి యూనియన్ పరిధిలోని నుంజుకొండాపురం గ్రామ పంచాయతీలో 700కు పైగా కుటుంబాలు నివశిస్తున్నాయి. ఈ గ్రామస్తులు ఎవరైనా మృతి చెందితే మేడలపాడి మీదుగా వెళ్లే కమండల నాగనది గుండా నదికి అవతలి వైపునకు ఉన్న శ్మశాన వాటికకు తీసుకెళ్లాల్సి వస్తోంది. అయితే వర్షంకాలంలో ఈ నదిని దాటలేక అవస్థలు పడుతున్నారు. ఇదిలా స్థానికంగా నివాసం ఉంటున్న కన్నయ్య భార్య రేవతి పాముకాటుకు గురై ఆదివారం మృతి చెందింది. అంత్యక్రియలు చేసేందుకు ప్రస్తుతం నదిలో నీరు ఉండడంతో తీసుకెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందుగా మృతదేహన్ని రోడ్డుపై పెట్టి రాస్తారోకో నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం అతికష్టంపై నీటిలోనే మోసుకెళ్లి శ్మశానంలో పాతి పెట్టారు.

మరోసారి పోలీస్ అధికారిగా..



నటి మృణాల్ ఠాగూర్



దర్శకుడు ఏఆర్ మురుగదాస్‌తో శివకార్తికేయన్

తమిళ సినిమా: నటుడు శివ కార్తికేయన్ మరోసారి పోలీస్ అధికారిగా నటించడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. మావీరన్ చిత్ర విజయంతో మంచి ఖుషీగా ఉన్న ఈయన ప్రస్తుతం రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై కమలహాసన్ నిర్మిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. దీనికి రాజ్‌కుమార్ పెరియ సామి దర్శకత్వం వహిస్తూ, ఇందులో మేజర్‌గా నటిస్తున్నట్లు సమాచారం. నటిసాయి పల్లవి నాయకిగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా శివ కార్తికేయన్ తదుపరి చిత్రానికి కూడా కమిట్ అయ్యారు. ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఈయన నటించనున్నారు. ఇందులో బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాగూర్ నాయకిగా నటించనున్నట్లు సమాచారం. కాగా ఇందులో శివ కార్తికేయ మరోసారి పోలీస్ అధికారిగా నటించబోతున్నట్లు తెలుస్తోంది. ఈయన ఇంతకు ముందు కాక్కిసట్టై చిత్రంలో పోలీస్ అధికారిగా నటించారు. అదేవిధంగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్ చివరిగా దర్శకత్వం వహించిన చిత్రం దర్బార్. ఇందులో రజినీకాంత్ పోలీస్ అధికారిగా నటించిన విషయం తెలిసిందే. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేదు. ఆ తర్వాత ఏఆర్.మురుగదాస్ చాలా గ్యాప్ తీసుకుని శివ కార్తికేయన్ హీరోగా మరోసారి పోలీస్ కథనే నమ్ముకుని చిత్రం చేయడానికి సిద్ధమవుతున్నారు. కాగా ఈ చిత్రాన్ని స్పైడర్ చిత్ర నిర్మాతలు నిర్మించనున్నట్లు తెలిసింది. దీనికి అనిరుధ్ సంగీతం అందించినట్లు, షూటింగ్ అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కోలీవుడ్ టాక్స్

ఖర్మ ఎవరినీ విడిచిపెట్టదు!



నటి శృతిహాసన్

తమిళ సినిమా: ఆత్మవిశ్వాసం కలిగిన నటీమణుల్లో శృతిహాసన్ ఒకరు అని చెప్పవచ్చు. చర్యలు చాలా బోల్డ్‌గా ఉంటాయి అయితే వాటిని సమర్థించుకోవడానికి గట్స్ కావాలి. అలాంటి గట్స్ మెండుగా ఉన్న నటి శృతిహాసన్. ఈ బ్యూటీ లోకనాయకుడు కమల్ హాసన్ నటి సారికల వారసురాలు అన్న విషయం తెలిసిందే. అయితే ఆ ఒక్క ప్లస్ పాయింట్ తోనే శృతిహాసన్ నటిగా నిలదొక్కుకోలేదు. అందుకు తన టాలెంట్‌ను ఉపయోగించుకొని కథానాయకిగా రాణిస్తున్నారు. హిందీ, తమిళం భాషల కంటే తెలుగులోనే మంచి విజయాలను, పేరును తెచ్చుకున్న నటి శృతిహాసన్. నిజానికి తమిళంలో నటించాలనే ఆశ ఈమెకు చాలానే ఉంది. ఎందుకనో ఇక్కడ దర్శక నిర్మాతలు శృతిహాసన్‌ను పట్టించుకోవడం లేదు. సరైన సక్సెస్‌లు లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. ఈమె తమిళంలో నటించిన చివరి చిత్రం లాభం. ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ సరసన పాన్ ఇడియా చిత్రం సలార్‌లో నటిస్తున్నారు. దీంతోపాటు హాయ్ నాన్న అనే చిత్రంలోని శృతిహాసన్ నటిస్తున్నారు. అదేవిధంగా ది ఐ అనే హాలీవుడ్ చిత్రం కూడా చేస్తున్నారు. కాగా హేతువాది కమలహాసన్ కూతురు అయిన శృతి హాసన్‌కు మాత్రం కర్మ సిద్ధాంతాలపై నమ్మకం ఎక్కువ. ఈమె ఇన్ స్టాగ్రామ్‌లో తరచూ అభిమానులతో ముచ్చటిస్తుంటారు. కాగా శృతిహాసన్ ప్రేమ వ్యవహారం గురించి రకరకాల వదంతులు దొర్లుతుంటాయి. అలాంటి వాటిని పెద్దగా పట్టించుకోని ఈమె ఇటీవల ఖర్మ సిద్ధాంతం గురించి మాట్లాడారు. ఆమె ఇన్‌స్టాగామ్‌లో 'కొందరు తమ గోతులను తవ్వి దాటడానికి తయారవుతున్నారు. దాన్ని తాను ప్రశాంతంగా గమనిస్తున్నాను. మనం మన పనిని చేసుకుంటూ పోవాలి ఏదేమైనా ఖర్మ కచ్చితంగా తన ప్రభావాన్ని చూపిస్తుంది. ఆ ఆటను మాత్రం చూడండి' అని పేర్కొన్నారు.

అడియే వైవిధ్యభరిత కథా చిత్రం

తమిళ సినిమా: సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ కథానాయకుడిగా నటించిన చిత్రం అడియే. 95 చిత్రం ఫేమ్ గౌరీ జీ.కిషన్ నాయక్‌గా నటించిన ఈ చిత్రంలో ప్రేమ్, ఆర్ జె విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని మాలి అండ్ మాన్వి మూవీ మేకర్స్ పతాకంపై ప్రభ ప్రేమ్ కుమార్ నిర్మించారు. విగ్నేష్ కార్తీక్ వహించిన ఈ చిత్రానికి గోకుల్ బెనాయ్ ఛాయాగ్రహణంను, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న అడియే చిత్రం ఈ నెల 25వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత ప్రభ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ అడియే చిత్రం కచ్చితంగా నిజం సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. దర్శకుడు విగ్నేష్ కార్తీక్ బృందం వైవిధ్య భరిత కథా చిత్రంగా దీన్ని రూపొందించారన్నారు. జీవీ ప్రకాష్ కుమార్ ఎంతగానో సహకరించారని పేర్కొన్నారు. ఈ సంస్థలో పనిచేసిన తర్వాత వేరే సంస్థలో చిత్రం చేయడం కష్టం అనే అభిప్రాయాన్ని దర్శకుడు విగ్నేష్ కార్తీక్ వ్యక్తం చేశారు. కారణం విచిత్ర నిర్మాత తమకు అంత స్వేచ్ఛను ఇచ్చారని అన్నారు. అడియే విభిన్న ప్రేమ కథా చిత్రంగా ఉంటుందన్నారు. పార్లర్ యూనివర్సల్, ఆల్టర్నేట్ రియాల్టీ నేపథ్యంలో రూపొందించిన చిత్రం ఇదని చెప్పారు. జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ అడియే సాధారణ కథ చిత్రంగా ఉండదన్నారు. చాలా వైవిధ్యంతో కొత్త అనుభవం కావాలని కోరుకునేవారు ఈ చిత్రాన్ని థియేటర్లకు వెళ్లి చూడవచ్చని పేర్కొన్నారు.



అడియే చిత్ర యూనిట్

జవాన్ కోసం ఆరుగురు ఫైట్ మాస్టర్స్



జవాన్ చిత్రం ఫైట్ మాస్టర్స్

తమిళసినిమా: ప్రపంచ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం జవాన్. షారూఖ్ ఖాన్ కథానాయకుడిగా నటించి తన సొంత నిర్మాణ సంస్థ రెడ్ చిల్లీ పతాకంపై నిర్మించిన చిత్రం ఇది. ఈయన ఇంతకు ముందు నటించిన పఠాన్ చిత్రం సంచలన విజయాన్ని సాధించడంతో జవాన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరో విశేషం ఏమిటంటే ఇందులో కోలీవుడ్ నటీనటులు, సాంకేతిక వర్గం ఎక్కువగా పని చేశారు. కోలీవుడ్ యువ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహించిన ఇందులో నయనతార నాయకిగా, విజయ్ సేతుపతి ప్రతినాయకుడిగా నటించారు. అనిరుధ్ సంగీతాన్ని అందించిన జవాన్‌లో మరో విశేషం ఆరుగురు అంతర్జాతీయ స్థాయి ఫైట్ మాస్టర్స్ పని చేయడం. స్పిరో రజటోస్, యనిక్ బెన్, ట్రెయిన్ మాత్రే, కెచ్చా కంపాక్డీ, అనల్ అరసు మొదలగు ఆరుగురు ఫైట్ మాస్టర్స్ కంపోజ్ చేసిన పోరాట దృశ్యాలు, బైక్, కారు ఛేజింగ్స్ జవాన్ చిత్రంలో హైలెట్ కానున్నాయని యూనిట్ సభ్యులు తెలిపాయి. జవాన్ చిత్రం ట్రైలర్ చూస్తేనే యాక్షన్ సన్నివేశాలు అదుర్స్ అనిపించేలా ఉన్నాయి. పాటలను భారీగా ఖర్చు చేసి బ్రహ్మాండంగా చిత్రీకరించారు. దీంతో జవాన్ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 7వ తేదీన తెరపైకి రానుంది.

అర్జున్ దాస్, శివాత్మిక జంటగా నూతన చిత్రం

తమిళ సినిమా: గేంబ్రియో పిక్చర్స్ పతాకంపై సుధా సుకుమార్ నిర్మిస్తున్న తొలి చిత్రం ఆదివారం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. నటుడు అర్జున్ దాస్ గతి శివాత్మిక రాజశేఖర్ జంటగా నటిస్తున్న ఇందులో నాజర్, కాళీ వెంకట్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఇంతకుముందు సిలనేరంగలిల్ సిలమనిదర్ గళ్ చిత్రం ఫేమ్ విశాల్ వెంకట్ వహిస్తున్న తాజా చిత్రం ఇది. డి. ఇమాన్ సంగీతాన్ని, పిఎం. రాజ్‌కుమార్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ చక్కని వినోదంతో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్ డ్రామాగా ఈ చిత్రం ఉంటుందన్నారు. నటుడు అర్జున్ దాస్, శివాత్మిక రాజశేఖర్‌కు మంచి గుర్తింపు తెచ్చిపెడుతుందన్నారు. ఇందులో నటీనటులు అందరికీ ప్రాముఖ్యత ఉంటుందని పేర్కొన్నారు. నిర్మాత సుధా సుకుమార్ మాట్లాడుతూ ఇప్పటికే పలు డిజిటల్ రంగాల్లో ఉత్తమ సేవలను అందిస్తోందని తాజాగా సినీ రంగ ప్రవేశం చేసినట్లు చెప్పారు. విశాల్ వెంకట్ మంచి దర్శకుడని, అందుకు ఆయన తొలిచిత్రమే ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. తాము కథలోని సందేహాల గురించి 10 సార్లు అడిగినా చాలా సహనానంతో వివరించారని చెప్పారు. ఇది ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కథలోని పాత్రలకు తగిన నటినట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా నటుడు ఖాళీ వెంకట్‌కు ఇది చాలా ప్రత్యేక చిత్రంగా ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో మంచి విషయం ఉందని, నటుడు నాజర్ వంటి సీనియర్ నటుడుతో కలిసి పనిచేయటం సంతోషంగా ఉందని నటుడు అర్జున్ దాస్ పేర్కొన్నారు. సంగీత దర్శకుడు డి.ఇమాన్‌కు తాను పెద్ద అభిమానినని, ఆయన సంగీతాన్ని అందిస్తున్న చిత్రంలో తాను నటించడం ఆనందంగా ఉందన్నారు.



నూతన చిత్రం ప్రారంభోత్సవంలో యూనిట్ సభ్యులు

క్లుప్తంగా

రూ.47.56 లక్షల విలువైన బంగారం స్వాధీనం

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో సోమవారం వేకువజామున రూ.47.56 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చి విమానాశ్రయానికి సోమవారం వేకువజామున సింగపూర్ నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం వచ్చింది. ఇందులో వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ఓ మహిళా ప్రయాణికురాలిని పరీక్షించగా ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో రూ.47.56 లక్షల విలువైన బంగారు గొలుసును గుర్తించారు. అధికారులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఆమె తంజావూరుకు చెందిన రేణుక (25) అని తేలింది.

విషం తాగి యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: తాంబరం సమీపంలో ఆదివారం రాత్రి ప్రేమ విఫలం కావడంతో ఓ యువకుడు మద్యంలో విషం కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నై తాంబరం సెలైయూర్ సమీపంలోని రాజకీళ్పాక్కం అన్న వీధికి చెందిన విజయ్ (27) భవన నిర్మాణ కార్మికుడు. కొన్నేళ్లుగా అదే ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. విజయ్ మద్యపానం కారణంగా ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో యువతి విజయ్‌ని విడిచి వెళ్లిపోయింది. విజయ్ మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి మద్యంలో విషం కలుపుని కలిపి తాగాడు. స్పృహతప్పి పడిపోయిన అతన్ని ఇరుగుపొరుగు వారు క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సేలయూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో చెన్నై కళాశాల విద్యార్థి మృతి

అన్నానగర్: కన్యాకుమారి జిల్లా పుదుకడై సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నై కాలేజీ విద్యార్థి మృతి చెందాడు. కన్యాకుమారి జిల్లా పుదుక్కడ సమీపంలోని ఇనాయపుత్తనతురై బీచ్ గ్రామానికి చెందిన కలిస్థాన్ కుమారుడు లింటో డేవిడ్ (20) చెన్నైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఊరికి వచ్చాడు. ఆదివారం రాత్రి లింటో డేవిడ్ తన బైకుపై తెంగపట్నం – కరుంగల్ రోడ్డుపై వెళుతుండగా రోడ్డుకు అడ్డంగా కుక్క వచ్చింది. బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లింటో డేవిడ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పుదుకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి హత్య

తిరువొత్తియూరు: కొరటూరులో మద్యం మత్తులో అర్ధరాత్రి సమయంలో బిరియాని దుకాణంలో జరిగిన గొడవలో యువకుడు హత్యకు గురయ్యాడు. అంబత్తూరు సమీపంలోని కొరటూరు రెడ్డి వీధికి చెందిన బాల అలియాస్ బాలచందర్ (22) ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతను ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో మన్నూర్‌పేట బస్టాండ్ వద్ద ఉన్న ఒక టాస్మాక్ దుకాణంలో స్నేహితులు ఇద్దరితో కలిసి మద్యం తాగాడు. తర్వాత బైక్‌లో ఇంటికి బయలుదేరాడు. మధ్యలో ఒక హోటల్లో బిర్యాని ఆర్డర్ చేసి కూర్చున్నాడు. ఆ సమయంలో బైక్‌లో మరో ముగ్గురు అక్కడికి వచ్చి బిర్యాని ఆర్డర్ చేశారు. హఠాత్తుగా ముగ్గురితో బాల అతని స్నేహితులకు గొడవలు ఏర్పడ్డాయి. ఆగ్రహించిన బాలచందర్ తన చేతిలో వున్న హెల్మెట్‌తో ఆ ముగ్గురిపై దాడి చేశాడు. వారు కూడా తమ వద్ద ఉన్న కత్తితో బాలపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన బాల రక్తపు మడుగులో పడిపోయాడు. ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం మేరకు అంబత్తూరు పోలీసులు, సహాయ కమిషనర్ గిరి నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకుని బాలచందర్‌ను 108 ద్వారా కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. మార్గమధ్యంలోనే బాల బాలచందర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి బాలచందర్‌ను హత్య చేసిన ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

కారు ఢీకొనడంతో దంపతులు మృతి

అన్నానగర్: కడలూరు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో భార్యాభర్తలు మృతి చెందారు. వివరాలు.. కడలూరు జిల్లా వడలూరు సమీపంలోని కరుంగులి గ్రామం అమ్మన్ కోవిల్ వీధికి చెందిన సెల్వరాజ్ (52), టీవీ మెకానిక్. ఇతని భార్య విజయ. వీరి కుమారుడు సుమన్ వివాహం సెప్టెంబర్‌న 3వ తేదీన జరగనుంది. సెల్వరాజ్ కొత్తగా నిర్మించిన ఇంటిని ఆదివారం ప్రారంభించారు. వేడుక ముగిసిన తర్వాత సెల్వరాజ్, విజయ కలిసి కడలూరు, పుదుచ్చేరిలోని తమ బంధువులకు ఆహ్వాన పత్రికలు ఇచ్చేందుకు బైకులో బయలుదేరారు. అదేవిధంగా పుదుచ్చేరిలో వివాహం చేసుకున్న వధూవరులు గురుప్రియన్, తమిళ్‌కొడి కారులో వరుడి స్వగ్రామమైన చోళతారం సమీపంలోని మామంగళం గ్రామానికి, మరికొందరు బంధువులు వెళ్తున్నారు. కారును గోపాల కృష్ణన్ నడిపారు. కడలూరు పక్కనే ఉన్న సుబ్రమణ్యపురం వద్ద సెల్వరాజ్ నడుపుతున్న బైకును వధూవరులు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. సెల్వరాజ్, విజయ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న కుల్లంజవాడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం పుదుచ్చేరి జిప్‌మార్ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కుల్లంజవాడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్ కాళ్లపై పడి పట్టాలు ఇవ్వాలని నిరసన తెలుపుతున్న మహిళ



ఆందోళన చేస్తున్న సంచార కులాలకు చెందిన మహిళలు

తిరువళ్లూరు: గత 17 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న స్థలానికి కాకుండా మరోచోట స్థలం చూపించి పట్టాలు ఇస్తామని కలెక్టర్ చెప్పడంతో సంచార కులాలకు చెందిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలో 23 సంవత్సరాల క్రితం సంచార కులాలకు చెందిన కుటుంబాలు నివాసం వుండేవారు. అక్కడ ఆక్రమణల తొలగింపు పేరుతో నివాసాలను తొలగించి తిరువళ్లూరు జిల్లా అధిగత్తూరు వద్ద 67 కుటుంబాలకు స్థలం కేటాయించారు. ఈ స్థలంలో ఇళ్లు నిర్మించుకుని నల్లపూసలు, ప్లాస్టిక్ పువ్వులు అమ్ముకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో అదిగత్తూరులో నివాసం వుంటున్న తమకు పట్టాలు మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సుమారు 50 కుటుంబాల వారు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ ఆల్బీజాన్ వర్గీష్ మాట్లాడుతూ ప్రస్తుతం నివాసం వుంటున్న స్థలానికి పట్టాలు ఇవ్వలేమని, ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతంలో స్థలం ఇవ్వడంతో పాటు పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని వివరించారు. దీంతో మహిళలు ఆందోళనకు దిగారు. రాస్తారోకో, కలెక్టర్ కార్యాలయం ముట్టడి, పోలీసుల వాగ్వాదంతో ఉద్రిక్తతంగా మారింది. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి తమ నివాసాలను తొలగిస్తే ఎక్కడికి వెళ్లాలంటూ వారు నినాదాలు చేశారు. దీంతో పోలీసులు మహిళలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. మహిళలు కలెక్టర్ కాళ్లపై పడి తమ సమస్యలను వివరించారు. ప్రస్తుతం వున్న ఇళ్లను అప్పు చేసి నిర్మించుకున్నామని, ఇప్పుడు అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెబితే ఎలాగని ప్రశ్నించారు. ప్రస్తుతం వున్న స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఉన్నత అధికారులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు శాంతించి ఆందోళనను విరమించారు.

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్

కొరుక్కుపేట: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. తమిళనాడులోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి మొదటి విడత కౌన్సెలింగ్ ఇటీవలే పూర్తయింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, క్రీడాకారులు, మాజీ సైనికుల పిల్లలకు 7.5 శాతం కోటా, విభిన్న ప్రతిభావంతులకు సీట్ల అంతర్గత రిజర్వేషన్ కోసం నేరుగా చెన్నై గిండీలోని ఆర్టిస్ట్ సెంటినరీ మెమోరియల్ హాస్పిటల్‌లో కౌన్సెలింగ్ చేపట్టారు. జనరల్ కేటగిరీ పరీక్ష ఆన్‌లైన్లో చేపట్టారు. తొలి రౌండ్ కన్సల్టేషన్ తర్వాత ప్రభుత్వ కోటాలో 119 ఎంబీబీఎస్, 85 బీడీఎస్ సీట్లు, అడ్మినిస్ట్రేటివ్ కోటాలో 648 ఎంబీబీఎస్, 818 బీడీఎస్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. మెడికల్ ఎడ్యుకేషన్ ప్రకారం ఈ ఖాళీల భర్తీకి 2వ రౌండ్ రిక్రూట్‌మెంట్ సోమవారం ఆన్‌లైన్‌లో కూడా ప్రారంభమైందని డైరెక్టరేట్ ఆఫ్ రీసెర్చ్ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. దీని ప్రకారం సోమవారం ఉదయం 10 గంటలకు 2వ విడత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ నెల 29, 30వ తేదీల్లో ర్యాంకు ఒప్పందం ఆధారంగా కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. వీటి వివరాలను 31న వెబ్‌సైట్లలో ప్రచురించనున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కాలేజీల్లో అడ్మిషన్లకు సంబంధించిన ఉత్తర్వులను వెబ్‌సైట్లలో ప్రచురించనున్నారు. దీన్ని సెప్టెంబర్ 4వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు అప్‌లోడ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెలక్షన్ కమిటీ తెలియజేసింది.

3373 టైపిస్టు పోస్టులకు ఇంటర్వ్యూలు ప్రారంభం

కొరుక్కుపేట: గ్రూప్ 4 పోస్టుల్లో 3,373 టైపిస్టు ఉద్యోగాల భర్తీలో భాగంగా సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇంటర్వ్యూలు చెన్నైలోని టీఎన్‌పీఎస్‌సీ ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. 2022 జూలై 24న టైపిస్ట్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించారు. రాత పరీక్షలో అభ్యర్థులు పొందిన మార్కులు, గ్రేడ్ రోల్ నంబర్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికైన వారి జాబితాను ఈ ఏడాది మార్చి 24న విడుదల చేశారు. ఈ క్రమంలో 3,373 టైపిస్ట్ పోస్టులకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఇంటర్వ్యూలను సోమవారం ప్రారంభించనున్నట్లు టీఎన్‌పీఎస్‌సీ ప్రకటించింది. దీని ప్రకారం టైపిస్ట్ పోస్టుకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చెన్నై బ్రాడ్‌వేలోని టీఎన్‌పీఎస్‌సీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అభ్యర్థులు తమకు కేటాయించిన సమయానికి కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. అభ్యర్థులు వారి తల్లిదండ్రులు, బంధువులతో పాటు టీఎన్‌పీఎస్సీ కార్యాలయం వెలుపల పెద్ద సంఖ్యలో జనంతో నిండిపోయింది. ఈ ప్రక్రియ వచ్చే నెల 11వ తేదీ వరకు కొనసాగుతుంది. 1079 షార్ట్‌హ్యాండ్ టైపిస్టుల పోస్టులకు ఒరిజినల్ సర్టిఫికెట్ కాపీల వెరిఫికేషన్, కన్సల్టేషన్ వచ్చే నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు టీఎన్‌పీఎస్‌సీ కార్యదర్శి ఉమామహేశ్వరి ప్రకటించారు.

ఘనంగా స్వయం శక్తి అవార్డుల ప్రదానోత్సవం



అవార్డులు అందుకున్న వారితో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నైలోని లేడీ ఆండాళ్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి స్వయం శక్తి అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రాండ్ అవతార్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు అతిథులుగా చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్, కృతికా రాధాకృష్ణన్, సీనియర్ నటి సుహాసిని మణిరత్నం, సామాజిక సేవకురాలు నీనా రెడ్డి, పూర్ణిమ భాగ్యరాజ్, నేచురల్స్ నిర్వాహకులు సి.కె.కుమారవేల్, వీణా కుమారవేల్, సంగీత విద్వాంసులు విఘ్నేష్‌కాంత్ పాల్గొని అవార్డులను ప్రదానం చేశారు. సాంఘిక సంక్షేమం, వ్యవసాయం, డిజిటల్ సహా 12 కేటగిరీల్లో 15 మంది గృహ ఆధారిత మహిళా వ్యాపారవేత్తలు 6వ ఎడిషన్ శక్తి మసాలా హోమ్ ప్రెన్యూర్ వార్డుల(స్వయం శక్తి)తో సత్కరించారు. ఇందులో సోషల్ వెల్ఫేర్ విభాగంలో రేణుకా రామకృష్ణన్, హోమ్ ప్రొఫెషనల్ విభాగంలో జి.జోసెఫిన్ రెజీనా పొన్మణి, బ్యూటీ అండ్ వెల్‌నెస్ విభాగంలో కోయంబత్తూరుకు చెందిన ఎస్.గాయత్రి, కళలు అండ్ సంస్కృతి విభాగంలో తంజావూరుకు చెందిన ఎస్ షహనాజ్, విద్య అండ్ సాహిత్యం విభాగంలో కోయంబత్తూరుకు చెందిన సింధు, వ్యవసాయ విభాగంలో తిరుచ్చికి చెందిన సత్య కవిత అవార్డు పొందారు. అలాగే సోషల్ వెల్ఫేర్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చెన్నైకి చెందిన ఐశ్వర్య శివకుమార్, ఎన్ఆర్ఐ విభాగంలో నిలిచిన దుబాయ్‌కి చెందిన భువనేశ్వరి కుమారవేల్, మీడియా అండ్ వినోదం విభాగంలో ఈరోడ్‌కు చెందిన గౌరీశంకరి సురేష్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ విభాగంలో సేలంకు చెందిన విద్య నాగనాథన్, హెల్త్‌కేర్ విభాగంలో చెన్నైకి చెందిన వర్ధిని.కె, ఆహారం అండ్ పానీయాల విభాగంలో చెన్నైకి చెందిన గీతా మల్లినేని అవార్డులు పొందారు. ఇంకా, శక్తి పెన్ అవార్డును, పద్మ శ్రీ మీనాక్షి చిత్రరంజన్, శృతి నకుల్ పాజిటివ్ ఇన్‌ఫ్లుయెన్సర్ అవార్డులను అందుకున్నారు.

అద్వైట్‌లో రూ. 250 కోట్ల వర్తక ఒప్పందాలు

సాక్షి, చెన్నై: దక్షిణ భారతదేశంలో మెగా వస్త్ర ఫెయిర్‌గా అద్వైట్ 2.ఓ చెన్నై నందబాక్కం ట్రేడ్ సెంటర్ వేదికగా నాలుగు రోజుల పాటు జరిగిన విషయం తెలిసిందే. అపెరల్ మ్యాన్యుఫ్యాక్చరర్స్ ఆఫ్ ఇండియా (ఏఎంఐ) నేతృత్వంలో తయారీ దారులు, వివిధ బ్రాండ్ల సంస్థలు పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేశాయి. రెడీమేడ్ వస్త్ర రంగంలోని తయారీదారులు, రిటైలర్లు, ఏజెంట్లు, సరఫరా దారులను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చే విధంగా జరిగిన ఈ ఫెయిర్‌లో రూ. 250 కోట్ల వర్తకంకు సంబంధించిన ఒప్పందాలు చేసుకున్నట్లు సోమవారం అపెరల్ ప్రతినిధి ధర్మేష్‌నందు ప్రకటించారు. ఇటీవల కాలంగా తగ్గుముఖంగా ఉన్న వస్త్ర ఉత్పత్తి ప్రపంచం, మరో 2 నుంచి 3 సంవత్సరాలలో మరింతగా పుంజుకునేందుకు ఈ ఒప్పందాలు ఎంతో దోహకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

విద్యార్థినిని బలిగొన్న వాటర్ ట్యాంక్

సాక్షి, చెన్నై: నగర శివారులో పాఠశాలకు తల్లితో పాటు వెళ్తున్న ఓ విద్యార్థినిని వాటర్ ట్యాంక్ రూపంలో మృత్యువు కబలించింది. వివరాలు.. కోవిలం బాక్కంలో మెట్రో రైలు పనులు జరుగుతున్నాయి. దీంతో రోడ్డు మరీ ఇరుకుగా మారాయి. ఈ పరిస్థితుల్లో మన్నంగళం రాజాజీ నగర్‌కు చెందిన సాయి వెంకటేష్ కుమార్తె లియో(10) మడిపాక్కంలోని ఓ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. సోమవారం తల్లి కీర్తితో పాటు ద్విచక్ర వాహనంలో పాఠశాలకు వెళ్లింది. మార్గం మధ్యలో గతుకులతో ఉన్న రోడ్డులో ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. కింద పడ్డ లియో మీదుగా వెనుక అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ వెళ్లింది. తల నుజ్జునుజ్జు కావడంతో ఘటనా స్థలంలో మరణించింది. ఈ పరిసరాలలో వాటర్ ట్యాంకర్లు అనుమతి లేకుండా తిరుగుతుండటంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని, రోడ్లు మరింతదారుణం అయ్యాయని ఆపరిసర వాసులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు చేసిన ముస్లింలు

అన్నానగర్: అదిరాంపట్నంలో ఆదివారం మృతి చెందిన వృద్ధురాలికి ముస్లింలు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. తంజావూరు జిల్లా అదిరాంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సురైకైకొల్‌లై ప్రాంతానికి చెందిన చెల్లమ్మాళ్ (92) ఒంటరిగా జీవిస్తోంది. అమ్మమ్మ చెల్లమ్మాల్‌కు మనమరాలు కార్తీకి భోజనం పెట్టేది. ఈ స్థితిలో చెల్లమ్మాళ్ వయోభారంతో ఆదివారం మృతి చెందింది. పేదరికంలో ఉన్న మనవరాలు కార్తీక అమ్మమ్మ మృతదేహాన్ని ఖననం చేసేందుకు ఇబ్బంది పడుతోంది. సహకరించాలని అదిరాంపట్నం ప్రాంతంలోని ముస్లిం యువకులను కోరింది. దీంతో ముస్లిం యువకులు వృద్ధురాలు చెలమ్మాళ్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకెళ్లి హిందూ ఆచారాల ప్రకారం ఖననం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ ప్రాంత ప్రజలు ముస్లిం యువకులను అభినందించారు.

నారాయణపురం తారురోడ్డు పనులకు శ్రీకారం



తారురోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్



గ్రామ పంచాయతీలకు బ్యాటరీ వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: నారాయణపురంలో రూ.45.71 లక్షలతో తారురోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే చంద్రన్ సోమవారం ప్రారంభించారు. ఆర్కేపేట యూనియన్ నారాయణపురం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి గ్రామీణ రోడ్ల అభివృద్ధి పథకం ద్వారా రూ.45.71 లక్షలు కేటాయించారు. పంచాయతీ సర్పంచ్ మోనిష శరవనన్ అధ్యక్షతన నిర్వహించిన రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొన్నారు. 475 మీటర్ల దూరానికి తారు రోడ్డు వేయనున్నట్టు అధికారులు తెలిపారు. యూనియన్ చైర్‌పర్సన్ రంజిత, బీడీవోలు వెంకటేశన్, కలైసెల్వి, యూనియన్ ఇంజినీర్ సుందరం, డీఎంకే మండల కార్యదర్శులు పళణి, షణ్ముగం సహా అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాటరీ వాహనాల పంపిణీ

తిరుత్తణి: గ్రామాల్లో చెత్త సేకరించేందుకు బ్యాటరీ వాహనాలు పంపిణీ చేశారు. ఆర్కేపేట యూనియన్‌లో రెండవ విడతగా ప్రధానమంత్రి స్వచ్ఛభారత్ పథకం ద్వారా గ్రామాల్లో చెత్త కుప్పలు తొలగించి పరిశుభ్రత పెంపొందించే విధంగా రూ.2.65 లక్షలతో బ్యాటరీ వాహనాలు అందజేస్తున్నారు. ఆర్కేపేట యూనియన్‌లోని 38 గ్రామ పంచాయతీల్లో తొలి విడతలో 15 గ్రామ పంచాయతీలకు బ్యాటరీ వాహనాలు సరఫరా చేయగా, రెండవ విడతలో 20 పంచాయతీలకు వాహనాల పంపిణీని బీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే చంద్రన్ జెండా ఊపి ప్రారంభించారు. బ్యాటరీ వాహనాల ద్వారా గ్రామాల్లో చెత్తకుప్పలు సేకరించి పరిశుభ్రతను పెంపొందించాలని ఎమ్మెల్యే పంచాయతీ నిర్వాహకులను కోరారు. బీడీవోలు వెంకటేశన్, కలైసెల్వి, యూనియన్ చైర్‌పర్సన్ రంజిత, వైస్ చైర్‌పర్సన్ తిలకవతి, పంచాయతీ సర్పంచ్‌లు, యూనియన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా వీఐటీ–చెన్నై స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న నాగాలాండ్ గవర్నర్ లా గణేషన్,

కొరుక్కుపేట: వీఐటీ– చెన్నై వార్షిక స్నాతకోత్సవం – 2023 సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో వీఐటీ వ్యవస్థాపక ఛాన్స్‌లర్ జి.విశ్వనాథన్, నాగాలాండ్ గవర్నర్ లా గణేషన్, వాల్‌మార్ట్ గ్లోబల్ టెక్ కంట్రీ హెడ్ బాలు చతుర్వేదుల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిగ్రీలు పూర్తి చేసిన 2,961 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. వీరిలో 33 బంగారు పతకాలను అందుకున్నారు. ఇందులో ఇనిస్టిట్యూట్ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యా పెంటారెడ్డి, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాతాంబరి ఎస్ విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. జి విశ్వనాథన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో, ఆవిష్కరణలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రతీ ఇంట్లో ఇద్దరు విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోనూ మార్పు వచ్చిందన్నారు. తల్లిదండ్రుల సంపాదనలో 40 శాతం మొత్తాన్ని విద్యకు వెచ్చిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి మరింతగా నిధులను కేటాయించి విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. నాగాలాండ్ గవర్నర్ లా గణేషన్ మాట్లాడుతూ వీఐటీ దేశంలోని గొప్ప విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలిచిందని కొనియాడారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా సొంతంగా సంస్థలను స్థాపించి ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులు విదేశాలలో చదువుకున్నప్పటికీ చివరగా జన్మభూమికి తిరిగి వచ్చి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో స్వామి వివేకానంద హాస్టల్ బ్లాక్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అకడమిక్ బ్లాక్‌ను నాగాలాండ్ గవర్నర్ ఎల్.గణేషన్‌తో కలిసి వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఛాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్ ప్రారంభించారు.

బైట్ బార్ నిర్మాణం కోసం మత్స్యకారుల నిరసన

కొరుక్కుపేట: బైట్‌బార్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ పుదుచ్చేరిలో పెరియ కలపట్టు, చిన్నకలపట్టు, కనకశెట్టి చెరువు, పిల్లిచావడి మత్స్యకార గ్రామాల వాసులు నిరసన తెలిపారు. ఈ గ్రామాల్లో 1000కి పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరి ప్రధాన వృత్తి చేపలు పట్టడం. పైచవాడి, చిన్నకలపట్టు ప్రాంతంలో సముద్ర కోత పెరుగుతోంది. దీంతో సముద్రం ఉగ్రరూపం దాల్చడంతో ఆ ప్రాంతంలోని ఇళ్లు కొట్టుకుపోయాయి. నర్సరీ, కొబ్బరి చెట్లు, సిమెంట్ రోడ్డు తదితరాలు సముద్రంలోకి మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో తక్షణమే బైట్ బార్ ఏర్పాటు చేయాలని మత్స్యకారులు చాలా కాలంగా పుదుచ్చేరి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నాలుగు మత్స్యకార గ్రామస్తులు సోమవారం కాలాపట్టు జయ థియేటర్ ఎదుట సమావేశమై నిరాహారదీక్ష చేపట్టారు. 400 మందికి పైగా గ్రామస్తులు పాల్గొన్నారు.

వెయ్యి అడుగుల లోయలో పడి బాలుడి మృతి

అన్నానగర్: కున్నూరు సమీపంలో ఆదివారం వెయ్యి అడుగుల లోయలో పడి బాలుడు మృతి చెందాడు. నీలగిరి జిల్లా కూనూరు వన్నారపేట ప్రాంతానికి చెందిన అబ్దుల్ హాదీకి కుమార్తె, అబ్దుల్ అజీక్(13) కుమారుడు ఉన్నారు. అబ్దుల్ అజీక్ కున్నూర్‌లోని ఆర్జిజర్ అన్నా స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఇద్దరు స్నేహితులతో కలిసి కూనూర్ సమీపంలోని ఎకో రాక్ ప్రదేశానికి వెళ్లాడు. ఆ సమయంలో అబ్దుల్ అజీక్ కాలుజారి 1,000 అడుగుల లోయలో పడిపోయాడు. సమాచారం అందుకున్న కూనూరు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఎకో రాక్ కొండ వద్దకు చేరుకుని బాలుడు అబ్దుల్ అజీక్ పడిన లోయలోకి వెళ్లి పరిశీలించారు. అక్కడ బాలుడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కూనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహానాడుకు వచ్చిన ముగ్గురు కార్యకర్తలు మృతి

అన్నానగర్: మదురై అన్నాడీఎంకే మహానాడుకు హాజరై తిరిగి వెళుతూ ముగ్గురు కార్యకర్తలు మృతి చెందారు. మదురైలో ఆదివారం అన్నాడీఎంకే మహానాడు జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ముగించుకుని అర్ధరాత్రి వేళ కార్యకర్తలు, నాయకులు తమ స్వస్థలాలకు తిరుగుప్రయాణమయ్యారు. ఇందులో భాగంగా శివగంగైకి చెందిన అక్కిమ్(35) వ్యాను నడుపుతున్నాడు. పళని– దిండుగల్ రహదారిపై రెడ్డియార్ చత్రం సమీపంలో వ్యాను ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కోయంబత్తూరు శివానంద కాలనీకి చెందిన ఏఐడీఎంకే ప్రముఖుడు కదిరేశన్ (41) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రెడ్డియార్ చత్రం పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ పళని స్వామి, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కదిరేశన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దిండుగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మహానాడుకు వచ్చిన విల్లుపురం జిల్లా సెంజికి చెందిన పొన్నుస్వామి (65), కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చికి చెందిన కార్యకర్త పళని స్వామి గుండెపోటుతో మరణించారు.

యువకుడి నుంచి రూ.11 లక్షల మోసం

అన్నానగర్: కోయంబత్తూరులో యువకుడి నుంచి కొబ్బరికాయలు కొని రూ.11 లక్షలు మోసం చేసిన వ్యాపారిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. నాగర్‌కోయిల్‌లోని పార్వతీపురానికి చెందిన విశాల్ కృష్ణన్ (24) కొబ్బరి వ్యాపారి. కోయంబత్తూరు గాంధీపురం 100 ఫీట్ రోడ్డులోని రాజు నాయుడు వీధిలో నివాసం ఉంటున్న అన్వర్ సాదత్ (52) గత ఆగస్టులో విశాల్‌కృష్ణన్ వద్ద 17 వేల కిలోల కొబ్బరికాయలను కొనుగోలు చేశాడు. మొదటి తఫాలో రూ.3 లక్షలు ఇచ్చాడు. అనంతరం రూ.10,26,846, రూ.1,40,75,000కు రెండు చెక్కులు ఇచ్చాడు. విశాల్ కృష్ణన్ వాటిని బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. వెంటనే విశాల్ కృష్ణన్ ఈ విషయాన్ని అన్వర్ సాదత్‌కు తెలిపి డబ్బులు చెల్లించాలని కోరాడు. అతను రూ.74 వేలు మాత్రమే ఇచ్చాడు. మిగిలిన రూ.11 లక్షలు చెల్లించలేదు. దీంతో విశాల్ కృష్ణన్ కోయంబత్తూరుకు వచ్చి అన్వర్ సాదత్‌ను వ్యక్తిగతంగా కలిసి తనకు రావాల్సిన డబ్బు చెల్లించాలని కోరాడు. ఆ తర్వాత కూడా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో మోసం పోయానని తెలుసుకుని సోమవారం రత్నపుర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అన్వర్ సాదత్‌పై మోసం, నమ్మక ద్రోహం తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

మోర్ధాన డ్యామ్‌లో మునిగి ఏనుగు మృతి



వేలూరు: వేలూరు జిల్లా ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలోని కొండిన్య ఏనుగుల శరణాలయం ఉంది. ఇక్కడ సుమారు 40కి పైగా ఏనుగులున్నాయి. ఇవి పలు గ్రూపులుగా విడి పోయి తరచూ తమిళనాడులోని వేలూరు, తిరుపత్తూరు వంటి జిల్లాలోని అటవీ ప్రాంతాల సమీపంలోని పంటలపై పడి నాశనం చేస్తుంటాయి. ఇదిలా ఉండగా గుడియాత్తం సమీపంలోని మోర్ధాన డ్యామ్ అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ ఏనుగులు తరచూ వచ్చిన డ్యామ్‌లోని నీటిని సేవించి వెలుతుంటాయి. ఈ నేపద్యంలో ఆదివారం ఉదయం డ్యామ్‌లోని అటవీ ప్రాంతంలో ఉన్న డ్యామ్ గట్టు వద్ద ఏనుగు నీటిలో తేలుతున్నట్లు స్థానికులు గుర్తించారు. వీటిపై మేకల కాపరులు రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అటవీ, రెవెన్యూ అధికారులు మృతి చెందిన ఏనుగు వద్దకు వెళ్లేందుకు యత్నించారు. అయితే ఆ ఏనుగు వద్ద ఏనుగుల గుంపు ఆగ్రహంతో ఉండడంతో ఫారెస్ట్ అధికారి సుజాత, జిల్లా ఫారెస్ట్ కళానిధి, గుడియాత్తం ఫారెస్ట్ రేంజర్ వినోబ ఆదేశాల మేరకు ఫారెస్ట్ సిబ్బంది చాకచక్యంగా సోమవారం ఏనుగు కళేబరాన్ని ఒడ్డుకు తరలించి పూడ్చిపెట్టారు.

డెంటల్ వైద్యకళాశాలకు అనుమతి



డిగ్రీ పట్టాలను అందజేస్తున్న మంత్రి సుబ్రమణియన్

వేలూరు: రాష్ట్రంలో డెంటల్ కళాశాల ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని త్వరలోనే శంకుస్థాపన పనులు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ అన్నారు. వేలూరు అడుక్కంబరైలోని ప్రభుత్వాసుపత్రి మెడికల్ కళాశాలలో డాక్టరేట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలను కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన సోమవారం ఉదయం ప్రారంభించారు. ముందుగా పాయిగైలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. వికలాంగులకు సంక్షేమ పథకాలతో పాటు పనిముట్లను అందజేశారు. అనంతరం డిగ్రీ పట్టాలను అందజేసి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టాలు పొందిన డాక్టర్‌లు ఆసుపత్రిలో సేవ చేసే సమయంలో రోగుల పట్ల ప్రేమగా నడుచుకోవడంతో పాటు వారితో సంతోషంగా మాట్లాడ కలిగితేనే సగం రోగం నయమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 మెడికల్ కళాశాలల్లో వైటల్ బే అనే కొత్త పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అములు, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పాపాత్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఉద్యోగ భద్రత కల్పించండి

సజ్జలను కలిసిన ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఉన్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కోడె అర్జున్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మల్లిభాస్కర్ తదితరులు సోమవారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో తక్కువ వేతనాలతో 15 ఏళ్లకు పైబడి పనిచేస్తున్న ఉద్యోగులు 1,860 మంది ఉన్నట్లు తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి.. వేతనాలు పెంచేలా సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్తానని సజ్జల హామీ ఇచ్చారు.

జాతీయ జలక్రీడా పోటీలకు జట్టు ఎంపిక

సాక్షి, అమరావతి: జాతీయస్థాయి జల క్రీడా పోటీలకు ఏపీ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు ఏపీ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలరామ్ నాయుడు సోమవారం తెలిపారు. ఆదివారం విజయవాడలోని కృష్ణా నదిలో రాష్ట్ర స్థాయి సీనియర్, అంతర్‌జిల్లా సబ్ జూనియర్, జూనియర్ కెనోయింగ్, కయాకింగ్ స్ప్రింట్ చాంపియన్ షిప్ పోటీలను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రత్యేక ఎంపిక కమిటీ ద్వారా ఎస్.మహేష్, పి.వీరబాబు, ఎం.తన్విత్, ఎం.ఈశ్వర్, కె.గిరీష్ బాబు, ఎం.కోమల్ (ఎన్టీఆర్ జిల్లా), జి.భాస్కర్ (తూర్పు గోదావరి), రమేష్ (ఏలూరు)లను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామన్నారు. వీరు ఉత్తరాఖండ్‌లో సెప్టెంబర్ 12 నుంచి 17 వరకు జరిగే జాతీయ పోటీలకు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

సెంచూరియన్ వర్సిటీకి ఏ ప్లస్ ర్యాంక్

దొండపర్తి (విశాఖ): ఒడిశాకు చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ప్రతిష్టాత్మక ఏ ప్లస్ (3.37 స్కోర్‌తో) ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) మౌలిక సదుపాయాలు, బోధనా, అభ్యాస ప్రక్రియ, పరిశోధన, పాలన, ఇతర అంశాల ఆధారంగా యూనివర్సిటీకి ఈ ర్యాంక్ ప్రకటించింది. వర్సిటీకి చెందిన 6 క్యాంపస్‌లలో 3 క్యాంపస్‌లు గిరిజన ప్రాంతాల్లో ఉండటం, ఇక్కడ విద్యా ప్రమాణాల అభివృద్ధి, పరిశోధన పద్ధతిలో విద్యాబోధనా విధానం వంటి అంశాలు ఈ ర్యాంక్ సాధనకు కీలకాంశాలుగా మారాయి. ర్యాంక్ సాధనకు కృషి చేసిన ప్రొఫెసర్లకు, సిబ్బందికి, భాగస్వాములకు వర్సిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ ఓటర్ల సంఖ్య 3,06,42,333

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,06,42,333కు చేరింది. అందులో 1,53,73,066 మంది పురుషులు, 1,52,51,797 మంది మహిళలు, 2,133 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక రెండో సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల ముసాయిదా ఓటర్ల జాబితాలను సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ప్రకటించారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు/కొత్తగా ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణకు సెప్టెంబర్ 19 వరకు గడువు ఉందని తెలిపారు. సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులను పరిష్కరించి అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఇక రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాలుండగా, ముసాయిదా జాబితాలో 3,06,26,996 మంది సాధారణ ఓటర్లతో పాటు మరో 2,742 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 15,337 మంది సర్వీసు ఓటర్లున్నారు. 18–19 వయస్సు కలిగిన యువ ఓటర్ల సంఖ్య 4,76,597.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇండిగో విమానంలో షార్జా నుంచి వచ్చిన ప్రయాణికుడి తనిఖీ చేయడంతో 397 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. వాటి విలువ సుమారు రూ.20.59 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

‘ఇంగ్లిష్’ ప్రావీణ్య ఉపాధ్యాయులకు అవార్డులు

▶ మొదటి పేజీ తరువాయి

అంచనా వేస్తోన్న సెంటా ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రావీణ్యాన్ని పరీక్షిస్తామన్నారు. ఈ నెల 27 వరకు ఉపాధ్యాయుల రిజిస్ట్రేషన్ చేపడతామని చెప్పారు. 29న ఆన్‌లైన్‌లో ప్రావీణ్య పరీక్ష నిర్వహించనున్నట్టు విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. ఉత్తమ ప్రావీణ్యం గల ఉపాధ్యాయులను టీచర్స్ డే సందర్భంగా రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో అవార్డులతో సత్కరిస్తామన్నారు.

చట్ట ప్రకారమే సోదాలు

చట్ట ఉల్లంఘనలకు పాల్పడింది మార్గదర్శే.. మేం కాదు

- పగలు సోదాలు చేస్తుంటే ఇబ్బంది అంటున్నారు
- రాత్రిళ్లు చేస్తే నేరం చేసినట్లు ఫిర్యాదు చేస్తున్నారు
- కోర్టు ఆదేశాలను ఉల్లంఘించలేదు
- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- నేడో రేపో మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామన్న హైకోర్టు
- అప్పటివరకు సోదాలు వద్దని సూచన



సాక్షి, అమరావతి : మార్గదర్శి చిట్‌ఫండ్స్ లిమిటెడ్ సంస్థే చట్ట ఉల్లంఘనలకు పాల్పడిందని ప్రభుత్వం హైకోర్టుకు సోమవారం నివేదించింది. తాము ఎలాంటి చట్ట ఉల్లంఘనలకు పాల్పడలేదని, మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తాజా సోదాలన్నీ నిబంధనలకు అనుగుణంగానే జరుగుతున్నాయని నివేదించింది. చిట్ రిజిస్ట్రార్లు చేస్తున్న సోదాలను సవాలు చేస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ యాజమాన్యం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ నైనాల జయసూర్య సోమవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. చట్టం ఇచ్చిన అధికారం మేరకే చిట్ రిజిస్ట్రార్లు సోదాలు చేస్తున్నారని తెలిపారు. పగలు సోదాలు చేస్తుంటే చందాదారులు ఇబ్బంది పడుతున్నారని, కార్యకలాపాలకు విఘాతం కలుగుతోందంటున్న మార్గదర్శి.. ఎవరికీ ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో రాత్రిళ్లు సోదాలు చేస్తుంటే తామేదో నేరం చేస్తున్నట్లు కోర్టులో ఫిర్యాదు చేస్తోందని అన్నారు. ఇది ఎంత మాత్రం సరికాదన్నారు. షట్టర్లు మూసి సోదాలు చేస్తున్నామన్న దాంట్లో వాస్తవం లేదన్నారు. ఆ సంస్థ చట్ట ఉల్లంఘనలకు సంబంధించి కొన్ని ఘటనలు రిజిస్ట్రార్ల దృష్టికి వచ్చినందునే చట్ట ప్రకారం చర్యలు చేపట్టారని, నిబంధనలను అనుసరించే స్వతంత్రంగా సోదాలు చేస్తున్నారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన ఏ ఆదేశాలనూ ఉల్లంఘించలేదన్నారు.

గత సోదాల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి

సీఐడీ తరపు న్యాయవాది వై.శివకల్పనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. మార్గదర్శిపై నమోదైన పలు కేసుల్లో దర్యాప్తు జరుగుతోందని, రెండింట్లో చార్జిషీట్లు దాఖలు చేశామని చెప్పారు. గతంలో నిర్వహించిన సోదాల్లో సీఐడీకి లభించిన పలు కీలక డాక్యుమెంట్లను అధ్యయనం చేసిన తరువాత మార్గదర్శి ఎలాంటి మోసాలకు పాల్పడిందో అర్థమైందన్నారు. ఓ చిట్ గ్రూపులో ఇవ్వాల్సిన మొత్తాలను మరో చోట సర్దుబాటు చేస్తున్నారని తెలిపారు. నర్సరావుపేట చిట్ గ్రూపునకు చెల్లించాల్సిన మొత్తాలను రాజమండ్రి గ్రూపులకు సర్దుబాటు చేస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. చందాదారులకు తెలియకుండానే ఇలాంటి వ్యవహారాలు మార్గదర్శిలో చాలా జరుగుతున్నాయన్నారు.

రాత్రివేళ సోదాలు చేస్తున్నారు

అంతకు ముందు మార్గదర్శి యాజమాన్యం తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు, మీనాక్షి అరోరా వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రాత్రి వేళ సోదాలు చేస్తున్నారని తెలిపారు. ప్రతిసారీ తాము హైకోర్టును ఆశ్రయించి ఉత్తర్వులు తెస్తుంటే.. కొత్త ఎత్తుగడలతో ప్రభుత్వం సోదాలు చేస్తోందన్నారు. గతంలో ఇలాంటి సోదాలు జరగలేదని, 2019లో ప్రభుత్వం మారిన తరువాతే జరుగుతున్నాయని అన్నారు. సోదాలపై రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ ఉత్తర్వులు చెల్లవన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మంగళ లేదా బుధవారం మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం వెలువరిస్తానని తెలిపారు. అప్పటివరకు సోదాలు చేయకుండా అధికారులకు తగిన సూచనలు చేయాలని ఎస్‌జీపీ చింతల సుమన్‌కు మౌఖికంగా తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించండి

80 శాతం సబ్సిడీపై అవసరమైన విత్తనాలు సిద్ధం

- ఆర్బీకేల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది

సాక్షి, అమరావతి: ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు 80 శాతం రాయితీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక అమలుపై సోమవారం వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లోటు వర్షపాతం వల్ల పంట వేయని 2.71 లక్షల హెక్టార్లలో సాగు కోసం 59 వేల క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సిద్ధం చేశామన్నారు. వీటిలో ప్రధానంగా 52,386 క్వింటాళ్ల ఉలవలు, 1,831 క్వింటాళ్ల అలసందలు, 3,035 క్వింటాళ్ల పెసలు, 355క్వింటాళ్ల మినుములు, 516 క్వింటాళ్ల కొర్రలు, 940 క్వింటాళ్ల కంది విత్తనాలు ఉన్నాయన్నారు. అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో 15,200 క్వింటాళ్ల ఉలవలు, 1,650 క్వింటాళ్ల అలసందలు, 1,570 క్వింటాళ్ల పెసలు, 250 క్వింటాళ్ల మినుములు, 200 క్వింటాళ్ల కొర్రలు ఇప్పటికే రైతుల కోసం ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచామన్నారు. మిగిలిన విత్తనాలు సరఫరా చేసేందుకు విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధంగా ఉందన్నారు. గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించి, సాగుకు ముందుకు వచ్చే రైతులకు విత్తనాలు అందజేయాలని ఆదేశించారు.

2,804 క్వింటాళ్ల స్వల్పకాలిక వరి విత్తనాలు సిద్ధం

అధిక వర్షాలకు పంటలు, నారుమళ్లు నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీ పై 2,804 క్వింటాళ్ల స్వల్ప కాలిక వరి విత్తనాలు అందుబాటులో ఉంచామని ద్వివేది తెలిపారు. ఇప్పటి వరకు 1,523 క్వింటాళ్ల విత్తనాలు కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పంట నష్టపోయిన రైతులు తిరిగి పంట వేసుకునేందుకు వీలుగా సరఫరా చేసామన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ గెడ్డం శేఖర్ బాబు, ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉద్యోగులకు ‘మాస్టర్ స్కేల్’

- గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి కొత్త పీఆర్సీ
- 24.99 శాతం డీఏ.. 8 శాతం ఫిట్‌మెంట్
- పన్నెండు వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు
- అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ట్రాన్స్‌కో

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ)పై ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) సీఎండీ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త పీఆర్సీ గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. పీఆర్సీపై అధ్యయనానికి ప్రభుత్వం నియమించిన మన్మోహన్‌సింగ్ కమిటీ నివేదిక ఆధారంగా యాజమాన్యాలు, ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, అందరికీ ఆమోదయోగ్యంగా పీఆర్సీని ఖరారు చేసింది. ఆ ఒప్పందంపై ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీఎస్‌పీఈజేఏసీ) ప్రతినిధులు, పలు యూనియన్ల నాయకులు ఈ నెల 16న సంతకాలు చేశారు. దీనికి సంబంధించిన అధికారిక జీవోను విజయానంద్ తాజాగా విడుదల చేశారు.

కొత్త పీఆర్సీలో ముఖ్యాంశాలు

- ▲ సింగల్ మాస్టర్ స్కేలును కొత్తగా అమల్లోకి తెచ్చారు. దానికి తగ్గట్టుగా కేడర్‌ను బట్టి కొత్త పే స్కేళ్లు రూపొందించారు.
- ▲ మాస్టర్ స్కేల్‌కు లోబడి నాలుగు స్టాగ్నేటెడ్ ఇంక్రిమెంట్లు లభిస్తాయి.
- ▲ ఉద్యోగులకు 24.99 శాతం డియర్‌నెస్ అలవెన్ (డీఏ)తో పాటు 8 శాతం ఫిట్‌మెంట్ లభిస్తుంది.
- ▲ అన్నీ కలిపి పేస్కేల్ కనిష్టంగా రూ.29,100, గరిష్టంగా రూ.2,59,895 గా నిర్ణయించారు.
- ▲ పన్నెండు వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు చెల్లిస్తారు.
- ▲ పింఛన్‌దారులకు కూడా 8 శాతం ఫిట్‌మెంట్ వర్తిస్తుంది.▲ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్, హౌస్ రెంట్ అలవెన్స్, సిటీ కాంపెన్సేటరీ అలవెన్స్‌లు రాష్ట్ర ప్రభుత్వ రేటు ప్రకారమే ఉంటాయి.
- ▲ 2022 ఏప్రిల్ 1వ తేదీకి ముందు సర్వీసులో ఉన్న ఉద్యోగులందరూ ఈ కొత్త పీఆర్సీ పరిధిలోకి వస్తారు.
- ▲ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఖచ్చితంగా హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలి.
- ▲ ఈ ఉత్తర్వులపై ఎలాంటి సందేహాలున్నా ఏపీ ట్రాన్స్‌కో హెచ్‌ఆర్ కమిటీని సంప్రదించవచ్చు.

రాష్ట్రంలో 5 వేల సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్లు

రాయలసీమలో 3,500, మిగిలిన జిల్లాల్లో 1,500 యూనిట్లు

- రూ. 84 కోట్లతో ప్రాజెక్టు
- ఉల్లి, టమాటా రైతులకు గిట్టుబాటు ధర
- పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి
- ఏపీఎస్ఎఫ్‌పీఎస్–బీవోబీ అవగాహన ఒప్పందం



సాక్షి, అమరావతి: ఉల్లి, టమాటా రైతులకు ఏడాది పొడవునా గిట్టుబాటు ధర, పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా సోలార్ డీ హైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్టు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎస్ఎఫ్‌పీఎస్) సీఈవో ఎల్.శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. కర్నూలు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన 100 యూనిట్లు విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. దీంతో రూ. 84 కోట్ల అంచనాతో 5 వేల యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం సోమవారం విజయవాడలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. సొసైటీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, బీవోబీ డీజీఎం చందన్ సాహూ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్కో యూనిట్ అంచనా వ్యయం రూ.1.68 లక్షలని చెప్పారు. ప్రాజెక్టు వ్యయంలో ప్రభుత్వం 35 శాతం (రూ.29.40కోట్లు) సబ్సిడీగా భరిస్తుందని, లబ్ధిదారులు 10 శాతం (రూ.8.40 కోట్లు) చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగిలిన 55 శాతం (రూ.46.20 కోట్లు) బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఆహార వ్యర్థాలను తగ్గించడం, వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచడం, గ్రామీణ మహిళా సాధికారత ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలన్నారు. కర్నూలులో పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసిన యూనిట్ల ద్వారా ఒక్కో మహిళ సగటున రూ.12 వేల అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని చెప్పారు. బి, సి గ్రేడ్ ఉల్లి, టమాటాలకు సైతం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాయలసీమ జిల్లాల్లో 3,500 యూనిట్లు, మిగిలిన జిల్లాల్లో మరో 1,500 యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్ డీజీఎం చందన్ సాహూ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. ఈ తరహా ప్రాజెక్టులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు బ్యాంక్ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్‌పీఎస్ స్టేట్ లీడ్ సుభాష్ కిరణ్ కే, మేనేజర్ సీహెచ్ సాయి శ్రీనివాస్, బ్యాంక్ రీజనల్ మేనేజర్లు కె.విజయరాజు, పి.అమర్నాథ్‌రెడ్డి, ఎంవీ శేషగిరి, ఎంపీ సుధాకర్, రీజనల్ ఇన్‌చార్జి డి. రాజాప్రదీప్, డీఆర్ఎం ఏవీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు విధ్వంసంలో చల్లా బాబే ప్రధాన సూత్రధారి

- ఆయనే టీడీపీ శ్రేణులను నడిపించారు
- టీడీపీ దాడిలో 47 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు
- ఓ పోలీసు కంటిని కూడా కోల్పోయారు
- పోలీసుల చేత రక్తపు స్నానం చేయించారు
- ఘటన జరిగినప్పుడు చల్లా బాబు అక్కడే ఉన్నారు
- ఇద్దరినైనా చంపాలని చల్లా బాబు, ఇతరులు మాట్లాడుకున్నారు
- ఈ విషయాన్ని ఆయన డ్రైవరే చెప్పారు
- హైకోర్టుకు నివేదించిన ఏఏజీ సుధాకర్‌రెడ్డి
- ఘటనా స్థలంలో చల్లా బాబు లేరన్న ఆయన న్యాయవాదులు
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి : మాజీ సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన విధ్వంసానికి పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబే ప్రధాన సూత్రధారి అని పోలీసుల తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. టీడీపీ నేతల ఆదేశాల మేరకు పక్కా వ్యూహంతో జరిగిన దాడుల్లో 47 మంది పోలీసులు గాయపడ్డారని, వారిలో ఓ పోలీసు కంటిని కోల్పోయారని తెలిపారు. పోలీసులతో రక్తపు స్నానం చేయించారని, పోలీసులను తరిమారని, వాహనాలను తగులబెట్టారని తెలిపారు. టీడీపీ విధ్వంసం ఫోటోలను, వీడియోలను ఆయన కోర్టు ముందుంచారు. వాటిని పరిశీలించిన హైకోర్టు.. మీ రాజకీయ ప్రయోజనాల కోసం 47 మంది పోలీసులు గాయపడ్డారని, ఈ వ్యవహారంలో పోలీసులే బాధితులని వ్యాఖ్యానించింది. పుంగనూరు విధ్వంసంపై నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ చల్లా బాబు వేర్వేరు న్యాయవాదులతో ఏడు పిటిషన్లు దాఖలు చేయించారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఘటన స్థలంలో లేనని చల్లా బాబు చెబుతున్నది అబద్ధమన్నారు. ఆయన అక్కడే ఉన్నారని చెప్పారు. అందుకు ఆధారాలను కోర్టు ముందుంచారు. సెల్‌ఫోన్ లోకేషన్ వివరాలను పరిశీలించాలని కోరారు. విధ్వంసం సమయంలో చల్లా బాబు పుంగనూరులోని భీమగానిపల్లె వద్ద ఉన్నారని, అక్కడే దాడులు మొదలయ్యాయని చెప్పారు. ఆయనే టీడీపీ శ్రేణులను ముందుండి నడిపించారని చెప్పారు. ముందస్తు వ్యూహంలో భాగంగా సిద్ధం చేసుకున్న బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లతో సామాన్య ప్రజలు, అధికార పార్టీ కార్యకర్తలు, పోలీసులపై విరుచుకుపడ్డారని, భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. దాడి వెనుక చల్లా బాబు, ఇతర నేతల పాత్రకు సాక్ష్యాలున్నాయని వివరించారు. కారులో ప్రయాణిస్తున్న సమయంలో కనీసం ఇద్దరు ముగ్గురినైనా చంపేయాలని చల్లా బాబు, తదితరులు మాట్లాడుకున్నారని, ఈ విషయాన్ని ఆయన డ్రైవర్ వాంగ్మూలంలో స్పష్టంగా చెప్పారన్నారు. వాటన్నింటినీ చదివితే కుట్ర ఏ స్థాయిలో చేశారో అర్థమవుతుందన్నారు. అందుకే హత్యాయత్నం కేసు నమోదు చేశామని సుధాకర్‌రెడ్డి వివరించారు. హత్యాయత్నం కేసు నమోదుకు చంపాలన్న ఉద్దేశం ఉంటే చాలునన్నారు. అంతకు ముందు చల్లా బాబు తరపు న్యాయవాదులు హెచ్.ప్రహ్లాద్ రెడ్డి, డి.కోదండరామిరెడ్డి, ఆకుల శ్రీకృష్ణ సాయి భార్గవ్, ఎస్.నాగేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఘటన స్థలంలో చల్లా బాబు లేరని తెలిపారు. హత్యాయత్నం కేసు వర్తించదన్నారు. ఒకే నేరానికి బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని వివరించారు. పోలీసులపై దాడికి తమ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. కొన్ని అసాంఘిక శక్తులు చేరి చిన్న గొడవను దాడిగా మార్చాయని చెప్పారు. పిటిషనర్ ఒకరే అయినప్పుడు వేర్వేరు న్యాయవాదులను నియమించుకోవడం ఏమిటని న్యాయమూర్తి ప్రశ్నించారు. దీని వెనుక పెద్ద వ్యూహం ఉందని అదనపు ఏజీ చెప్పగా, అలాంటిదేమీ లేదని ప్రహ్లాద్‌రెడ్డి తదితరులు చెప్పారు. తదుపరి విచారణను న్యాయమూర్తి మంగళవారానికి వాయిదా వేశారు.

బాబు రాఖీతో బైపీసీ చదివి ఇంజినీర్ కావొచ్చు

- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి
- బాబు విజన్ డొల్లతనం సామాన్యులకూ అర్థమైంది
- రాష్ట్ర అభివృద్ధికి అజెండా రూపకల్పనలో బాబు విఫలం



సాక్షి, అమరావతి: ‘చంద్రబాబు ఇచ్చే రాఖీ కట్టుకుంటే ఇంటర్ బైపీసీ చదివి ఇంజినీర్ కావొచ్చు. పోలీస్ అయ్యి వర్క్ ఫ్రమ్ హోం చేయొచ్చు. ఆస్కార్ నామినేషన్స్‌కి వెళ్తే నోబెల్ ప్రైజ్ రావొచ్చు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొనవచ్చు. అది నేనే కట్టా.. ఇది నేనే పెట్టా అని మాట్లాడొచ్చు’ అని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ×బాబు వస్తే మద్యం ధరలు తగ్గిస్తారని మందు బాబులంతా ఒక్కొక్కరు పది మందికి, వాళ్లు వంద మందికి చెప్పి ఓట్లు వేయించాలంట. గతంలో మద్య నిషేధం ఎత్తివేసిన వ్యక్తి, ఇటువంటి దిక్కుమాలిన హామీ ఇచ్చే వ్యక్తి ‘విజనరీ’ ఎలా అవుతారు? ఇది పచ్చని కుటుంబాల్లో నిప్పులు పోసే ఆలోచన’ అని చెప్పారు. ఇటీవల చంద్రబాబు ప్రకటించిన విజన్ –2047 చూస్తే నాలుగేళ్ల క్రితం ఓడిపోయినా నేల విడచి సాము చేయడం మానలేదన్న విషయం స్పష్టంగా తెలుస్తుందన్నారు. సామాన్యులకు సైతం ఆయన విజన్‌లోని డొల్లతనం తెలిసిపోతుందని అన్నారు. 2014లో చంద్రబాబు సీఎం అయిన తర్వాత అమరావతిలోకి ఇతర దేశాల్లోని తెలుగువారి పెట్టుబడులు కుప్పలుగా వచ్చిపడతాయని ఆయన కన్న కలలు కల్లలయ్యాయని తెలిపారు. కష్టపడి సంపాదించిన సొమ్మును అనాలోచితంగా అమరావతిలో పెట్టడానికి ప్రవాస భారతీయులు ఎవరూ డబ్బు మూటలతో రారన్న వాస్తవం ఎంఏ అర్థశాస్త్రం చదివిన బాబుకి బోధపడలేదన్నారు. ఇప్పటికీ ప్రవాసుల పెట్టుబడులపై భ్రమలు వీడకపోవడం టీడీపీ దురదృష్టమని అన్నారు. భౌగోళిక స్వరూపం మారినా, ప్రజల ఆకాంక్షలు కొత్త పంథాలో పయనిస్తున్నా ఆంధ్రప్రదేశ్‌పై ఆయనకు ఇంకా సరైన అవగాహన కలగడంలేదని, రాష్ట్ర ప్రజల అభివృద్ధికి ప్రత్యామ్నాయ అజెండా రూపొందించడంలో నారా బాబు విఫలమయ్యారని అన్నారు.

బీసీల సభలో టీడీపీ నేతలే ఎక్కువ..

- పార్టీ శ్రేణుల అత్యుత్సాహంతో ప్రజలకు తీవ్ర ట్రాఫిక్ ఇక్కట్లు
- మద్యం మత్తులో తమ్ముళ్ల హంగామా



పోలీసులతో గొడవ పడుతున్న టీడీపీ నేతలు

రామవరప్పాడు/గన్నవరం : లోకేశ్ యువగళం పాదయాత్ర కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గంలో ప్రజలు, ప్రయాణికుల సహనానికి పరీక్ష పెట్టింది. విజయవాడ రూరల్ మండలం నిడమానూరుకు చేరుకున్న పాదయాత్ర విజయవాడ మీదుగా సోమవారం గన్నవరం నియోజకవర్గానికి చేరుకోగా.. సాయంత్రం నిడమానూరు క్యాంప్ సైట్‌లో బీసీ సామజికవర్గాల ప్రతినిధులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. సమావేశంలో బీసీ ప్రతినిధుల కంటే టీడీపీ నేతలే ఎక్కువగా ఉన్నారు. సమావేశంలో.. ‘ చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ముస్లిం మైనార్టీలకు ఏం చేశాడ’ని లోకేశ్‌ను ప్రశ్నించేందుకు ప్రయత్నించిన ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. లోకేశ్ మాట్లాడుతుండగానే జనం మెల్లగా జారుకున్నారు.

గన్నవరం చేరుకున్న పాదయాత్ర

అనంతరం.. లోకేశ్ పాదయాత్ర సోమవారం రాత్రి కృష్ణాజిల్లా గన్నవరం చేరుకుంది. అంతకుముందు, కేసరపల్లి వద్ద మండలంలోకి ప్రవేశించిన యాత్ర ఎయిర్‌పోర్ట్, దుర్గాపురం, గన్నవరం మీదుగా చిన్నఆవుటపల్లిలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్ ఆవరణలో క్యాంప్ సైట్‌కు చేరుకుంది. పాదయాత్ర జాతీయ రహదారిపై కొనసాగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నప్పటికీ టీడీపీ శ్రేణుల అత్యుత్సాహం ఫలితంగా ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. కొంతమంది మద్యం మత్తులో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగించారు. ఇక లోకేశ్ సమక్షంలో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావు టీడీపీలో చేరారు. మరోవైపు.. మండల పార్టీ ఇచ్చిన రూటుకు భిన్నంగా ఎమ్మెల్యే కార్యాలయం మీదుగా పాదయాత్ర వెళ్లాలని టీడీపీ నేతలు పట్టుబట్టారు. అయితే, పోలీసులు అంగీకరించలేదు. దీంతో రూట్‌మ్యాప్ ప్రకారం పాదయాత్ర కొనసాగింది.

తెలంగాణ

సిట్టింగ్‌లకే బీఆర్ఎస్ పెద్దపీట

119 అసెంబ్లీ స్థానాలకు 115 మందితో తొలి జాబితా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఈ ఏడాది చివరలో జరిగే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసే భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థులను ఆ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు సోమవారం విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. 119 అసెంబ్లీ స్థానాల్లో 115 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. కేసీఆర్ ఈసారి రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి కూడా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. జాబితాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పెద్దపీట వేశారు. ఏడుగురు ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించారు. నాలుగు చోట్ల కొత్త వారికి అవకాశమిచ్చారు. అనిల్ జాదవ్ (బోథ్), భూక్యా జాన్సన్ రాథోడ్ నాయక్ (ఖానాపూర్), లాస్య నందిత (సికింద్రాబాద్ కంటోన్మెంట్), డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల (కోరుట్ల) తొలిసారి బరిలోకి దిగుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు (ఆసిఫాబాద్ ఎస్టీ), రాథోడ్ బాపూరావు (బోథ్ ఎస్టీ), రేఖా నాయక్ (ఖానాపూర్ ఎస్టీ), బేతి సుభాష్‌రెడ్డి (ఉప్పల్), తాటికొండ రాజయ్య (స్టేషన్ ఘనపూర్ ఎస్సీ), రాములు నాయక్ (వైరా ఎస్టీ), చెన్నమనేని రమేశ్ (వేములవాడ)కు టికెట్ దక్కలేదు. వీరి స్థానంలో కోవా లక్ష్మి (ఆసిఫాబాద్), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), కడియం శ్రీహరి (స్టేషన్ ఘనపూర్), బానోత్ మదన్‌లాల్ (వైరా), చల్మెడ లక్ష్మీకాంతరావు (వేములవాడ) టికెట్లు దక్కించుకున్నారు. జనగామ, నర్సాపూర్, గోషామహల్, నాంపల్లిలో త్వరలో అభ్యర్థులను ప్రకటిస్తామని కేసీఆర్ చెప్పారు.

95 నుంచి 105 సీట్లలో గెలుస్తాం: కేసీఆర్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకెవరూ అసలు పోటీయే కాదని కేసీఆర్ స్పష్టంచేశారు. 95 నుంచి 105 సీట్లలో విజయం సాధిస్తామన్నారు. పార్టీ నిర్ణయం మేరకు తాను రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబర్ 16న వరంగల్ సింహగర్జన సభలో మేనిఫెస్టో విడుదల చేస్తామని చెప్పారు. పార్టీ ధిక్కార చర్యలకు పాల్పవే వారు ఏస్థాయిలో ఉన్నా పార్టీ నుంచి బయటకు పంపిస్తామని హెచ్చరించారు. వామపక్షాలతో పొత్తు ముగిసిన అధ్యాయమని చెప్పారు. ఏఐఎంఐఎం పార్టీతో మాత్రం ఎన్నికల అవగాహన కొనసాగుతుందని తెలిపారు.

తెలంగాణలో ఒంటరిగానే పోటీ: చంద్రబాబు

సాక్షి , హైదరాబాద్: తెలంగాణలో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని, తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం ఆయన తన నివాసంలో తెలంగాణ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో నిర్వహించే బస్సు యాత్ర, వచ్చే ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, తెలంగాణలో రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీతోనూ తెలంగాణలో కలసి పోటీ చేసే పరిస్థితి లేదని, ఒంటరిగా పోటీ చేయడానికే సిద్ధపడాలని నాయకులకు సూచించారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో హైదరాబాద్ వృద్ధి చెందిందన్నారు. తెలంగాణలో తెలుగు దేశం పార్టీ ఉండడం చరిత్రాత్మక అవసరమని అన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను నేటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. త్వరలోనే అందరితో మాట్లాడి అభ్యర్థుల జాబితా ప్రకటనకు చర్యలు తీసుకుంటామన్నారు. అభ్యర్థులను ప్రకటించిన తర్వాత బస్సు యాత్ర చేపట్టాలని నాయకులకు సూచించారు.

సక్సెస్ స్టోరీ

సలహాల అక్క

శ్రద్ధా కాప్రాను అందరూ 'మైక్రోసాఫ్ట్ వాలీ దీదీ' అని పిలుస్తారు. శ్రద్ధ బంగారంలాంటి మైక్రోసాఫ్ట్ ఉద్యోగాన్ని వదిలేసింది. 'యువత కెరీర్ కోసం గైడెన్స్ అవసరం' అని 'అప్నా కాలేజ్' పేరుతో ఓ యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది. రెండేళ్లలో 40 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ అయ్యారు. మైక్రోసాఫ్ట్ జీతం కన్నా ఎన్నో రెట్ల ఆదాయం శ్రద్ధకు వస్తోంది. ఏ కోర్సు చదవాలి, ఏ ఉద్యోగం చేయాలి లాంటి సలహాలు ఎప్పటికప్పుడు ట్రెండ్‌కు తగినట్టు ఇవ్వడమే శ్రద్ధ సక్సెస్‌కు కారణం.


శ్రద్ధా కాప్రా

'హరియాణలోని చిన్న పల్లెటూరు మాది. మా నాన్న గవర్నమెంట్ ఉద్యోగైనా నేను ఏం చదవాలో గైడ్ చేయడం ఆయనకు తెలియదు. టీచర్లు కూడా గైడ్ చేస్తారనుకోవడం అంత కరెక్ట్ కాదు. ఇప్పటికీ కాలేజీ స్థాయి నుంచి యువతకు తమ కెరీర్ పట్ల ఎన్నో డౌట్లు ఉంటాయి. వారికి గైడెన్స్ అవసరం. ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకుని గైడ్ చేయాలి. నేను కొద్దోగొప్పో చేయగలుగుతున్నాను కాబట్టే ఈ ఆదరణ' అంటుంది శ్రద్ధా కాప్రా.

ఈమెకు లక్షలాది మంది అభిమానులు ఉన్నారు ఈనాటి కాలేజీ విద్యార్థుల్లో. ముఖ్యంగా ఇంజనీరింగ్ స్టూడెంట్స్‌లో. వీరంతా శ్రద్ధను 'శ్రద్ధా దీదీ' అని,'మైక్రోసాఫ్ట్ వాలీ దీదీ' అని పిలుస్తారు. ఆమె చేసే వీడియోలను వారు విపరీతంగా ఫాలో అవుతారు. ఆ వీడియోల్లో ఆమె చెప్పే సలహాలను వింటారు.

డాక్టర్ కాబోయి...

శ్రద్ధ తన బాల్యంలో టీవీలో ఒక షో చూసేది. అందులో డాక్టర్లు తాము ఎలా క్లిష్టమైన కేసులు పరిష్కరించారో చెప్పేవారు. ఆ షో చూసి తాను డాక్టర్ కావాలనుకుని ఇంటర్‌లో 'పిసిఎంబి' (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, బయాలజీ) తీసుకుంది. కాని జూనియర్ ఇంటర్ పూర్తయ్యే సరికి డాక్టర్ కావడం చాలా కష్టమని అర్థమైంది. అందుకే మేథ్స్‌వైపు దృష్టి సారించింది. 'చిన్నప్పటి నుంచి రకరకాల పోటీ పరీక్షలు ఎక్కడ జరిగినా రాసేదాన్ని. ఇంటర్ అయ్యాక ఎంట్రన్స్‌లు రాస్తే ర్యాంక్ వచ్చింది. కాని ఏ బ్రాంచ్ ఎన్నుకోవాలో తెలియలేదు. వరంగల్ ఎన్.ఐ.ఐ.టి.లో సివిల్‌కు అప్లై చేస్తే సీట్ వచ్చింది. సివిల్ ఎందుకు అప్లై చేశానో నాకే తెలియదు. అయితే దాంతో పాటు ఎన్.ఎస్.ఐ.టి. (నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, ద్వారకా)లో కంప్యూటర్ సైన్స్ అప్లై చేస్తే ఆ సీటు కూడా వచ్చింది. దీనికంటే అదే మెరుగనిపించి కంప్యూటర్ సైన్స్ చదివాను' అని తెలిపింది శ్రద్ధ.

ఉద్యోగం, టీచింగ్

చదువు చివరలో ఉండగానే హైదరాబాద్ మైక్రోసాఫ్ట్‌లో ఇన్‌టెర్న్ వచ్చింది శ్రద్ధకు. అది పూర్తయ్యాక ఉద్యోగమూ వచ్చింది. అయితే శ్రద్ధ ఇన్‌టెర్న్ చేస్తున్నప్పటి నుంచే గచ్చిబౌలిలో కంప్యూటర్ కోర్సులను బోధించసాగింది. ఉద్యోగం వచ్చాక కూడా కంప్యూటర్ కోర్సులకు ఫ్యాకల్టీగా పని చేసింది. 'ఉద్యోగంలో కంటే ఎవరి జీవితాన్నయినా తీర్చిదిద్దే బోధనే నాకు సరైందనిపించింది. అదే సమయంలో యూట్యూబ్ ద్వారా ఎక్కడెక్కడో ఉన్న విద్యార్థులకు పాఠాలు చెప్పడం, కోర్సులు తెలియచేయడం, వారి స్కిల్స్ పెరిగేలా గైడ్ చేయడం అవసరం అనుకున్నాను. మైక్రోసాఫ్ట్‌లో నాది మంచి ఉద్యోగం. కాని ఏదైనా కొత్తగా చేయాలనుకోవడం కూడా మంచిదే అని జాబ్‌కు రిజైన్ చేశాను' అంది శ్రద్ధ.

అప్నా కాలేజ్

శ్రద్ధ 'అప్నా కాలేజ్' పేరుతో యూట్యూబ్ చానల్ తెరిచింది. ఇంటర్ స్థాయి నుంచి విద్యార్థులకు ఏయే కోర్సులు చదివితే ఏం ఉపయోగమో, ఏ ఉద్యోగాలకు ఇప్పుడు మార్కెట్ ఉందో, ఆ ఉద్యోగాలు రావాలంటే ఏ కోర్సులు చదవాలో తెలిపే వీడియోలు చేసి విడుదల చేయసాగింది. 2020లో ఈ చానల్ మొదలుపెడితే ఇప్పుడు 40 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు తయారయ్యారు. కోట్లాది వ్యూస్ ఉంటాయి. అందుకు తగ్గట్టుగా లక్షల్లో శ్రద్ధ ఆదాయం ఉంది. 'ముప్పై ఏళ్ల క్రితం డిగ్రీల ఆధారంగా ఉద్యోగాలు ఇచ్చేవారు. ఎందుకంటే డిగ్రీలు తక్కువ ఉండేవి. ఇవాళ డిగ్రీలు అందరి దగ్గరా ఉన్నాయి. కావాల్సింది స్కిల్స్. ఏ ఉద్యోగం చేయాలనుకుంటున్నారో ఆ ఉద్యోగానికి సంబంధించిన స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడు ముందుకు దూసుకెళ్లవచ్చు. నా వీడియోలు ఆ మార్గంలో ఉంటాయి' అని తెలిపింది శ్రద్ధ అలియాస్ సలహాల అక్క.

స్ఫూర్తి


అనన్య పరేఖ్

ఏమీ తెలియకపోవడం వల్ల కలిగే నష్టం సంక్షోభ సమయంలో, కష్టసమయంలో భయపెడుతుంది. బాధ పెడుతుంది. సమస్యల సుడిగుండంలోకి నెట్టి ముందుకు వెళ్లకుండా సంకెళ్లు వేస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అనన్య పరేఖ్ 'ఇన్నర్ గాడెస్' అనే సంస్థను ప్రారంభించింది. 'ఇన్నర్ గాడెస్' ద్వారా ఫైనాన్షియల్ లిటరసీ నుంచి మెంటల్ హెల్త్ వరకు అట్టడుగు వర్గాల మహిళల కోసం దేశవ్యాప్తంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది.

మేలుకొలుపు దారుల్లో...

చెన్నైలోని మైలాపూర్‌లో ఉమ్మడి కుటుంబంలో పెరిగిన అనన్య పెద్దల నుంచి ఎన్నో మంచి విషయాలు తెలుసుకుంది. ఆరు సంవత్సరాల వయసు నుంచే పుస్తకాలు చదవడం అలవాటైంది. 'పుస్తకపఠనం అలవాటు చేయడం అనేది నా కుటుంబం నాకు ఇచ్చిన విలువైన బహుమతి' అంటున్న అనన్య పెద్దల నుంచి విన్న విషయాలు, పుస్తకాల నుంచి తెలుసుకున్న విషయాల ప్రభావంతో సమాజం కోసం ఏదైనా చేయాలనే ఆలోచన చేయడం ప్రారంభించింది.

సోషల్ ఎంట్రప్రెన్యూర్‌గా వడివడిగా అడుగులు వేయడానికి ఈ ఆలోచనలు అనన్యకు ఉపకరించాయి.

అనేక సందర్భాలలో లింగ వివక్షను ఎదుర్కొన్న అనన్య 'ఇది ఇంతేలే' అని సర్దుకుపోకుండా 'ఎందుకు ఇలా?' అని ప్రశ్నించేది. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి చర్చించేది.

తమ ఇంటికి దగ్గరగా ఉండే ఒక బీద కుటుంబానికి చెందిన పిల్లల కోసం క్లాసు పుస్తకాలు కొనివ్వడం ద్వారా సామాజిక సేవకు సంబంధించి తొలి అడుగు వేసింది అనన్య. ఏరో స్పేస్ ఇంజనీరింగ్ చేసిన అనన్య ఉన్నత ఉద్యోగాలపై కాకుండా మహిళల హక్కులు, మహిళా సాధికారత, చదువు... మొదలైన అంశాలపై దృష్టి పెట్టింది.

చెన్నై కేంద్రంగా 'ఇన్నర్ గాడెస్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. ఈ సంస్థ తరపున అట్టడుగు వర్గాల మహిళల కోసం ఫైనాన్షియల్ లిటరసీ, ఫైనాన్షియల్ యాంగ్జైటీ, మెంటల్ హెల్త్, పర్సనల్ ఇన్వెస్టింగ్... మొదలైన అంశాలపై దేశవ్యాప్తంగా డెబ్బైకి పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది.





సరైన సమయంలో ఆర్థిక విషయాలపై అవగాహన కలిగిస్తే అది భవిష్యత్ కార్యాచరణకు ఉపయోగపడుతుందనే నమ్మకంతో పదహారు నుంచి ఇరవైనాలుగు సంవత్సరాల మధ్య ఉన్న యువతులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది ఇన్నర్ గాడెస్.

ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం కలిగే ఇబ్బందులు, ఉండడం వల్ల కలిగి మేలు, జీరో స్థాయి నుంచి వచ్చి విజయవంతమైన మహిళా వ్యాపారవేత్తల గురించి ఈ వర్క్‌షాప్‌లలో చెప్పారు.

షాపింగ్ నుంచి బ్యాంక్ వ్యవహారాల వరకు ఒక మహిళ తన భర్త మీద ఆధారపడేది. దురదృష్టవశాత్తు అతడు ఒక ప్రమాదంలో చనిపోయాడు. ఆమె ఇప్పుడు ఎవరి మీద ఆధారపడాలి? ఇలాంటి మహిళలను దృష్టిలో పెట్టుకొని వ్యవహార దక్షత నుంచి వ్యాపార నిర్వహణ వరకు ఎన్నో విషయాలపై ఈ వర్క్‌షాప్‌లలో అవగాహన కలిగించారు.

'ఇన్నర్ గాడెస్' నిర్వహించే వర్క్‌షాప్‌ల వల్ల పర్సనల్ ఫైనాన్స్‌కు సంబంధించిన ఎన్నో విషయాలపై మహిళలకు అవగాహన కలిగింది. సరియైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇది వారికి ఉపకరించింది.

ఇరవై సంవత్సరాల వయసులో 'ఇన్నర్ గాడెస్'ను ప్రారంభించిన అనన్య తన ప్రయాణంలో ఎన్నో అవరోధాలు ఎదుర్కొంది.

'అవరోధాలు అప్పుడే కాదు ఏదో ఒక రూపంలో ఇప్పుడు కూడా ఉన్నాయి. అయితే వాటికి ఎప్పుడూ భయపడలేదు. ప్రారంభంలో ఫైనాన్షియల్ లిటరసీ అనే కాన్సెప్ట్‌పై నాకు కూడా పరిమితమైన అవగాహనే ఉండేది. కాలక్రమంలో ఎన్నో నేర్చుకున్నాను. కెరీర్‌కు ఉపకరించే సబ్జెక్ట్‌లకు తప్ప పర్సనల్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై మన విద్యాప్రణాళికలో చోటు లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో వర్క్‌షాప్‌లు నిర్వహించాం. వీటిలో ఎంతోమంది వాలంటీర్‌లు, స్కూల్ స్టూడెంట్స్ పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఒక అమ్మాయి మ్యూచువల్ ఫండ్స్ గురించి అవగాహన చేసుకోవడమే కాదు, తన అమ్మమ్మకు మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్ విషయంలో సహాయపడింది. ఇలాంటివి విన్న తరువాత మరింత ఉత్సాహం వస్తుంది' అంటుంది అనన్య పరేఖ్.

పురుగులకూ కుటుంబ నియంత్రణ!

సాగుబడి

మఖ కార్తె: ఆగస్టు 18 నుంచి

- ప్రత్యేకమైన ఫెరమోన్ పేస్ట్‌తో ఎంపిక చేసిన జాతి ఆడ, మగ పురుగుల కలయిక జరగకుండా అడ్డుకోవటం ద్వారా పురుగుల సంతతి నియంత్రణ
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల కంపెనీ ఆవిష్కరించిన వినూత్న సాంకేతికతతో ఇది సాధ్యమైంది
- కృత్రిమ లింగాకర్షక పేస్ట్‌ను పంట చేలో మొక్కలకు అక్కడక్కడా అంటించడం ద్వారా.. మగ పురుగులను తికమక పెట్టి.. ఆడ-మగ పురుగుల కలయిక జరగకుండా చూడొచ్చు. తద్వారా పొలాల్లో ఆ ప్రత్యేక పురుగుల సంతతి వృద్ధిని 90% వరకు నిరోధించవచ్చు.
- పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు ఉపయోగపడే ఫెరమోన్ పేస్ట్ ప్రస్తుతం రైతులకు అందుబాటులోకి వచ్చింది
- ఎకరానికి 400 (8%) పత్తి మొక్కలకు నెలకో సారి ఈ పేస్ట్‌ను అంటించాలి. సీజన్‌లో 3 సార్లు పేస్ట్‌ను మొక్కలకు పెడితే చాలు..
- పండ్లు/కూరగాయ పంటల్లో పండు ఈగల సమర్థవంతమైన నివారణకు కూడా జెల్ ల్యూర్ అందుబాటులో ఉంది
- వంగ పంటలో కాయ, కాండం తొలిచే పురుగుల సమర్థ నియంత్రణకు ప్రత్యేక ఫెరమోన్ పేస్ట్‌లు త్వరలో అందుబాటులోకి..
- 'సాక్షి'తో ఎటిజిసి బయోటెక్ సహ-వ్యవస్థాపకుడు డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి



పత్తి మొక్కలకు పేస్ట్ పెడుతున్న దృశ్యం

పంట పొలాల్లో, పండ్ల తోటల్లో పురుగుల నియంత్రణకు పురుగుమందులు/కషాయాలు చల్లటం కన్నా.. అసలు ఆయా ప్రత్యేక జాతి పురుగుల సంతతినే పెరగకుండా అరికట్టగలిగితే రైతులకు శ్రమ, ఖర్చు తగ్గటంతో పాటు, పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కూడా మేలు జరుగుతుందంటున్నారు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు. వివిధ శాస్త్రవిభాగాల్లో పరిశోధనలు పూర్తిచేసిన శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే వినూత్నమైన ఫెరమోన్ ఆధారిత అప్లికేషన్లు, ఆవిష్కరణలను వెలువరించారు. కేంద్ర వ్యవసాయ శాఖ నుంచి అగ్రికల్చర్ గ్రాండ్ ఛాలెంజ్ పురస్కారాన్ని అందుకున్న ఈ సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తేవడానికి శాస్త్రవేత్తలు హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో ఎటిజిసి బయోటెక్ అనే కంపెనీని నెలకొల్పారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఇటీవల నిర్వహించిన 'ఎట్‌హోమ్ రిసెప్షన్'లో ఈ సంస్థ సహ-వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి, హెచ్‌సియూ పూర్వ విద్యార్థి డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన అందించిన వివరాల ప్రకారం ఈ వినూత్న సాంకేతికత వివరాలను పరిశీలిద్దాం..

పురుగుల సంతతిని అరికట్టే వ్యూహం

ఆడ రెక్కల పురుగు సంతానోత్పత్తి దశలో మగ రెక్కల పురుగును ఆకర్షించడానికి ప్రత్యేకమైన వాసనతో కూడిన హార్మోన్ వంటి రసాయనాన్ని గాలిలోకి విడుదల చేస్తుంది. మగ పురుగు ఆ ఫెరమోన్ వాసనను బట్టి ఆడ పురుగు ఉన్న చోటుకు వెళ్లి కలుస్తుంది. ఈ కలయిక సజావుగా జరిగితే ఆడ పురుగు గుడ్లు పెడుతుంది. ఆ విధంగా పురుగుల సంతతి పంట పొలంలో స్వల్ప కాలంలోనే పదులు వందలుగా, వందలు వేలుగా పెరిగిపోయి పంటను ఆశించి దిగుబడిని నష్ట పరచటం సాధారణంగా జరుగుతూ ఉంటుంది. అయితే, ఆడ-మగ రెక్కల పురుగుల కలయికే జరగకుండా చూడటం ద్వారా సంతతి పెరుగుదలను అరికట్టడం ఇక్కడ వ్యూహం.

ఈ వ్యూహాన్ని అమలుపరచడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధన శాస్త్రవేత్తలు రూపొందించిన వినూత్న పద్ధతి ఏమిటంటే.. కృత్రిమ ఫెరమోన్‌తో కూడిన ప్రత్యేక పేస్ట్‌ను రూపొందించటం. ఈ పేస్ట్‌ను పంట పొలంలో మొక్కలకు అక్కడక్కడా అంటిస్తే.. ఆ వాసనకు మగ రెక్కల పురుగు ఆడ పురుగు ఉందనుకొని మొక్కపై ఉన్న పేస్ట్ దగ్గరకు వస్తుంది. తీరా లేకపోయే సరికి తికమకకు గురవుతుంది. ఆడ రెక్కల పురుగులను కలిసే ప్రయత్నంలో నూటికి 90 సార్లు విఫలమవుతుంది. దాంతో ఆ పురుగు సంతానోత్పత్తి ఆ మేరకు పరిమితమవుతుంది. ఈ టెక్నిక్‌ను ఉపయోగించి పురుగు తొలి దశలోనే పేస్ట్‌ను పొలంలో అక్కడక్కడా మొక్కలకు పూస్తే చాలు. పురుగుల్ని నిర్మూలించకుండానే వాటి సంఖ్యను చాలా వరకు అదుపులోకి తేవటం ద్వారా పంట దిగుబడికి పెద్దగా నష్టం జరగకుండా చూసుకోవచ్చు. ఇది సరిగ్గా చేస్తే ఆ పురుగు నిర్మూలనకు రైతులు పురుగుమందు కొట్టే శ్రమ, ఖర్చు, కాలుష్యం ఉండదు.



అయితే, పురుగుల తీవ్రతను తెలుసుకునేందుకు లింగాకర్షక బుట్టలు చాలా కాలంగా రైతులు వాడుతున్నారు. ఫెరమోన్ ఎర వాసనతో వచ్చి లింగాకర్షక బుట్టల్లో పడే మగ రెక్కల పురుగుల సంఖ్యను, పొలంలో అప్పుడు ఆ పురుగు తీవ్రతను గుర్తించి, పురుగు మందులు/కషాయాలు చల్లటం వంటి నియంత్రణ చర్యలను రైతులు చేపడుతున్నారు. ఈ లోగా పురుగుల సంతతి పెరిగిపోతోంది. అయితే, ఈ కొత్త పద్ధతి ద్వారా ఈ పురుగుల సంతతి పెరగకుండా ముందు నుంచే వాటి కలయికను నివారించవచ్చు. పురుగు ఉధృతిని ఎర ఉపయోగించి గమనించవచ్చు.

త్వరలో వంగకు, కత్తెర పురుగుకు కూడా..

ప్రస్తుతానికి పత్తిలో గులాబీ పురుగును నియంత్రించేందుకు పేస్ట్‌ను రైతులకు అందుబాటులోకి తెచ్చాం. వంగ తోటల్లో కాయ/కాండం తొలిచే పురుగుల నియంత్రణకు ప్రత్యేక పేస్ట్‌ను కేంద్ర ప్రభుత్వ అనుమతుల తర్వాత 2-3 నెలల్లో విడుదల చేయబోతున్నాం. ఇది అందుబాటులోకి వస్తే వంగ రైతులకు పురుగు మందుల ఖర్చు, శ్రమ గణనీయంగా తగ్గుతుంది. అంతేకాక వినియోగదారులు పురుగుమందు అవశేషాలు లేని వంకాయలను తినటం సాధ్యమవుతుంది. ఇప్పటికే పండ్లు/కూరగాయ తోటల్లో నష్టం చేస్తున్న పండు ఈగను ఆకర్షించి చంపే జెల్ ల్యూర్ అందుబాటులో ఉంది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన శాఖ దీనిపై అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మొక్కజొన్న సహా అనేక పంటలకు నష్టం చేస్తున్న కత్తెర పురుగు నియంత్రణకు వినూత్న పద్ధతి త్వరలోనే అందుబాటులోకి రానుంది. వీటి తయారీలో ఎలాంటి జన్యుమార్పిడి సాంకేతికతను వాడటం లేదు. రైతులు ఈ సాంకేతిక పద్ధతిని పురుగు ఉధృతి పెరిగినాక కాకుండా ముందు జాగ్రత్తగా వినియోగించాల్సి ఉంటుంది. ఒక ప్రాంతంలో రైతులు కలసి వాడితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి.

– డా. విజయ భాస్కర్ రెడ్డి, ఎటిజిసి బయోటెక్ సహ-వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి, జీనోమ్ వ్యాలీ, హైదరాబాద్.



పత్తిలో గులాబీ పురుగుకు చెక్

గులాబీ రంగు పురుగు వలన పత్తి రైతులు సగటున ఎకరానికి 6-7 క్వింటాళ్ల పత్తిని నష్టపోతున్నారు. పురుగులను సమర్థవంతంగా అరికట్టడానికి ఫెరొమోన్ పర్యవేక్షణ మాత్రమే సరిపోదు. ఇప్పుడు పర్యవేక్షణే కాకుండా ఫెరొమోన్ ఆధారిత నియంత్రణ విధానం అందుబాటులోకి వచ్చింది. ఇది ఎరను ఉపయోగించకుండా ఫెరొమోన్ పేస్ట్ ద్వారా పురుగులను అరికట్టే సరికొత్త పద్ధతని డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ప్రస్తుతం బీటీ పత్తి పొలాల్లో విజృంభిస్తున్న గులాబీ లద్దె పురుగును అరికట్టేందుకు ప్రత్యేకమైన పేస్ట్‌ను తమ కంపెనీ రూపొందించిందన్నారు. పేటెంట్ కలిగిన ఈ టెక్నాలజీకి కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాత రైతులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు.

పత్తి పంటలో 3 సార్లు..

ఎకరం పత్తి చేనులో అన్ని మొక్కలకూ పేస్ట్‌ను పెట్టక్కర లేదు. 400 మొక్కల (పొలంలో 7-8% మొక్కల)కు ఈ పేస్ట్‌ను బఠాణీ గింజంత అంటించాలి. మొక్క పై నుంచి 10-15 సెం.మీ. కిందికి, కాండం నుంచి కొమ్మ చీలే దగ్గర పెట్టాలి. ఒక సాలులో 4 మీటర్లకు ఒక మొక్కకు పెడితే చాలు. ఒక సాలులో మొక్కలకు పెట్టి, రెండు సాళ్లు వదిలేసి మూడో సాలుకు పెడితే సరిపోతుంది. ఎకరం మొత్తానికి 125 గ్రాముల పేస్ట్ సరిపోతుందని డా. రెడ్డి వివరించారు. ఒక్కో మొక్క కాండంపై 250 నుంచి 300 మిల్లీ గ్రాముల మేరకు పెట్టాలి. పత్తి పంట కాలంలో మొత్తం 3 సార్లు పేస్ట్ పెట్టాలి. విత్తనాలు వేసిన తర్వాత (పువ్వు/గూడ ఏర్పడటానికి ముందు) ఇంచుమించుగా 30-35 రోజులకు మొదటిసారి, విత్తిన 60-65 రోజుల తర్వాత రెండోసారి, విత్తిన 90-95 రోజుల తర్వాత మూడవ సారి పెట్టాలి. తుది పంట కోసే వరకు ప్రతి 30-35 రోజుల వ్యవధిలో ఉపయోగించాలి. ఇలా చేస్తే పంట ఖర్చు తగ్గి, దిగుబడి, నాణ్యత పెరుగుతుంది. ఎకరానికి పేస్ట్ ఖర్చు మూడు సార్లకు రూ. 4 వేలు అయినప్పటికీ, రైతు రూ. 30 వేల వరకు అధికాదాయం పొందగలుగుతారని ఆయన అన్నారు.

మిత్రపురుగులు సురక్షితం

ఈ సాంకేతికతలో పురుగుమందులు /హానికరమైన రసాయనాలు లేనందున పర్యావరణానికి హాని కలిగించదని డా. విజయభాస్కర్‌రెడ్డి వివరించారు. నేల, గాలి, నీరు పురుగు మందుల అవశేషాలతో కలుషితం కావు. మిత్ర పురుగులకు, పరాన్న జీవులు వంటి సహజ శత్రువులకు సురక్షితంగా ఉంటాయి. తేనెటీగలు నశించవు. సహజ పరాగ సంపర్కం బాగుంటుంది. రైతుకు, కూలీలకు సురక్షితమైనది. మొక్కకు హాని కలిగించదు. పత్తి నాణ్యత, రంగు మెరుగ్గా ఉంటుంది. మంచి ధరను పొందే అవకాశం కలుగుతుంది అన్నారాయన. దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రయోగాల్లో 90% పైగా పత్తిలో గులాబీ పురుగును ఈ పేస్ట్ నియంత్రిస్తున్నట్లు నిరూపితమైందని ఆయన తెలిపారు. (ఇతర వివరాలకు.. టోల్‌ఫ్రీ నంబర్ 1800 121 2842)

28న అనంతపురంలో డా. ఖాదర్‌వలి సభలు

ఈ నెల 28 (సోమవారం)న ఉ. 8.30 గం.కు అనంతపురం జిల్లా కురుగుంట గ్రామంలోని మహిళా రైతుల సామూహిక వ్యవసాయ క్షేత్రంలో మధుమేహ రహిత గ్రామసభ్యులతో జరిగే చర్చాగోష్ఠిలో జిల్లా కలెక్టర్ గౌతమి, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.ఖాదర్‌వలి పాల్గొంటారు. వివరాలకు.. 94400 17188. అదేరోజు సా. 6.30 గం.కు అనంతపురం ద్వారకా విల్లాస్ క్లబ్ హౌస్‌లో మధుమేహ రహిత జీవనంపై డా. ఖాదర్‌వలి, ఎస్పీ అమ్మిరెడ్డి ప్రసంగిస్తారు. వివరాలకు.. 93989 64962.

వచ్చే నెల 15 వరకు గోపాలరత్న దరఖాస్తులు

జాతీయ గోపాల రత్న-2023 అవార్డుల ప్రదానం కోసం జాతీయ పశుసంవర్థక, పాడి, మత్స్య పరిశ్రమ శాఖ ఆన్‌లైన్ నామినేషన్లను ఆహ్వానిస్తోంది. వెబ్‌సైట్ ద్వారా ఈ నెల15 నుంచి వచ్చే నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జాతీయ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే దేశీ పశు జాతుల పెంపకందారులకు, పాడి రైతులకు స్థిరమైన జీవనోపాధిని అందించేందుకు ప్రభుత్వం 3 విభాగాల్లో ఈ పురస్కారాలను అందిస్తోంది. గుర్తింపు పొందిన దేశీ గోజాతులు (ఏపీ- ఒంగోలు, పుంగనూరు, మోటు, తెలంగాణ- పొడతూర్పు), గేదెలను శ్రద్ధగా పెంచి పోషించే రైతులు.. ఉత్తమ సేవలందిస్తున్న డెయిరీ సహకార సంఘం లేదా పాల ఉత్పత్తిదారుల కంపెనీ లేదా పాడి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు.. ఉత్తమ సేవలందిస్తున్న కృత్రిమ గర్భధారణ సాంకేతిక నిపుణులు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి విభాగంలో మూడు అవార్డులతో పాటు రూ.5, రూ.3, రూ.2 లక్షల నగదు బహుమతులు ఇస్తారు. నవంబర్ 26న జాతీయ పాల దినోత్సవం రోజు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. అర్హత ప్రమాణాలు, నామినేషన్ ఆన్‌లైన్ ప్రక్రియ గురించి మరిన్ని వివరాల కోసం https://awards.gov.in లేదా https://dahd.nic.in వెబ్‌సైట్లను చూడొచ్చు.

డిసెంబర్‌లో సేంద్రియ రైతుల జాతీయ సమ్మేళనం

డిసెంబర్ 28 నుంచి 30 వరకు కేరళ ఎర్నాకుళం జిల్లా అలువలో సేంద్రియ రైతుల 8వ ద్వైవార్షిక జాతీయ సమ్మేళనం జరగనుంది. కేరళ జైవ కర్షక సమితి తోడ్పాటుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి 2 వేల మందికిపైగా రైతులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొంటారని ఆర్గానిక్ ఫార్మింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఒ.ఎఫ్.ఎ.ఐ.) కె పి ఇలియాస్ తెలిపారు. 6వేల దేశీ వంగడాలను సంరక్షిస్తున్న 200 మంది విత్తన సంరక్షకులు, యువ సేంద్రియ రైతుల స్టార్టప్‌లు, ఆక్వా రైతులు, పాడి రైతులు.. పాల్గొంటారన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 2,500. ఇతర వివరాలకు.. 73067 93706, 95399 08509. www.ofai.org



55 ఏళ్ల తర్వాత మరో టీనేజ్ చాంపియన్


సిన్సినాటి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 మహిళల టెన్నిస్ టోర్నీ ఫైనల్లో అమెరికా టీనేజర్, 19 ఏళ్ల కోకో గాఫ్ 6-3, 6-4తో కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి తన కెరీర్‌లో తొలి మాస్టర్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. కోకో గాఫ్‌కు 4,54,500 డాలర్ల (రూ. 3 కోట్ల 77 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది ఈ గెలుపుతో 55 ఏళ్ల తర్వాత ఈ టోర్నీలో టైటిల్ నెగ్గిన టీనేజ్ ప్లేయర్‌గా కోకో గుర్తింపు పొందింది. 1968లో అమెరికాకే చెందిన 17 ఏళ్ల లిండా టుయెరో విజేతగా నిలిచింది.

నిష్కా అగర్వాల్‌కు స్వర్ణం



ఫారోస్ కప్ అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ జిమ్నాస్ట్ నిష్కా అగర్వాల్ స్వర్ణ పతకం నెగ్గింది. కైరోలో జరిగిన ఈ టోర్నీలో నగరంలోని గాడియం స్కూల్ విద్యార్థి అయిన నిష్కా టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో విజేతగా నిలిచింది. కోచ్ మనోజ్ రాణా వద్ద శిక్షణ తీసుకుంటున్న నిష్కా గత ఏడాది కేరళ ఆతిథ్యమిచ్చిన జాతీయ జూనియర్ పోటీల్లోనూ పసిడి పతకం గెలిచింది.

శ్రీకాంత్ పరాజయం



కోపెన్‌హాగెన్: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్లోనే నిష్క్రమించగా... ప్రణయ్, లక్ష్యసేన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. ఆంధ్రప్రదేశ్ స్టార్ షట్లర్ శ్రీకాంత్ 14–21, 14–21తో 14వ సీడ్ కెంటా నిషిమొటో (జపాన్) చేతిలో ఓడిపోయాడు. తొమ్మిదో సీడ్ ప్రణయ్ 24–22, 21–10తో కలే కొలొనెన్ (ఫిన్లాండ్)పై, లక్ష్యసేన్ 21–12, 21–7తో జార్జెస్ జులిన్ పాల్ (మారిషస్)పై అలవోక విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ (భారత్) జోడీ 14–21, 22–20, 18–21తో జూలి మ్యాక్‌ఫెర్సన్–ఆడమ్ హాల్ (స్కాట్లాండ్) జంట చేతిలో ఓడిపోయింది.

సిఫ్ట్ కౌర్‌కు ఐదో స్థానం



బకూ: ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా ఐదో స్థానంలో నిలిచి ంది. దాంతో భారత్‌కు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ లభించింది. ఫైనల్లో సిఫ్ట్ కౌర్ 429.1 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానాన్ని దక్కించుకుంది.

టైగర్స్, వారియర్స్ విజయాలు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో బెజవాడ టైగర్స్ తొలి విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో టైగర్స్ 7 వికెట్లతో ఉత్తరాంధ్ర లయన్స్‌ను ఓడించింది. లయన్స్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మహీప్ కుమార్ (77 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), రికీ భుయ్ (41; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) కలిసి జట్టును గెలిపించారు. వైజాగ్ వారియర్స్, రాయలసీమ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ 'టై'గా ముగిసింది. అయితే సూపర్ ఓవర్ ద్వారా వారియర్స్ విజేతగా నిలిచింది. వారియర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 171 పరుగులు సాధించింది. ప్రశాంత్ (73; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 171 పరుగులు చేసింది. విహారి (71; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ రెడ్డి (58 రిటైర్డ్‌హర్ట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. సూపర్ ఓవర్‌లో కింగ్స్ 2 వికెట్లు కోల్పోయి ఒకే ఒక పరుగు చేయగా, వారియర్స్ 2 పరుగులు చేసి గెలిచింది.

రాహుల్, శ్రేయస్ పునరాగమనం

వన్డేల్లో తొలిసారి తిలక్ వర్మకు చోటు
- స్పిన్నర్ చహల్‌పై వేటు
- ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

సొంతగడ్డపై జరిగే వన్డే వరల్డ్ కప్‌కు ముందు రిహార్సల్‌లాంటి ఆసియా కప్ టోర్నీ కోసం భారత బృందం సిద్ధమైంది. సుదీర్ఘ కాలంగా గాయాలతో సహవాసం చేసిన ఆటగాళ్లంతా కోలుకొని జట్టులోకి రాగా... ఇంకా వన్డేలే ఆడని కొత్త ప్లేయర్‌కు కూడా తొలిసారి చోటు లభించింది. అజిత్ అగార్కర్ నాయకత్వంలోని సెలక్షన్ కమిటీ 17 మందితో ఈ టీమ్‌ను ప్రకటించింది. ఇందులో నుంచి ఇద్దరిని తప్పించి 15 మందితో సెప్టెంబర్ 5లోగా వరల్డ్ కప్ టీమ్‌ను ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో అసలు సమరానికి సిద్ధం కావడానికి ఆసియా కప్ కీలకం కానుంది.



రోహిత్ శర్మ, అగార్కర్



రాహుల్, శ్రేయస్

న్యూఢిల్లీ: ఆసియా కప్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టును బీసీసీఐ సెలక్టర్లు సోమవారం ప్రకటించారు. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 17 వరకు పాకిస్తాన్, శ్రీలంకలో ఈ టోర్నీ జరుగుతుంది. గాయాల నుంచి కోలుకొని సుదీర్ఘ విరామం తర్వాత కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఇప్పటికే ఐర్లాండ్‌తో టి20లు ఆడుతున్న బుమ్రా, ప్రసిధ్ కృష్ణలు కూడా వన్డేల్లో పునరాగమనం చేశారు. హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ అరుదైన అవకాశాన్ని దక్కించుకోవడం ఈ సెలక్షన్స్‌లో కీలక పరిణామం. ఇప్పటి వరకు ఇంకా వన్డేల్లో అరంగేట్రం చేయని తిలక్‌కు కీలకమైన ఆసియా కప్ జట్టులో చోటు దక్కింది. మరోవైపు లెగ్ స్పిన్నర్ యుజువేంద్ర చహల్‌ను టీమ్‌లోకి ఎంపిక చేయలేదు. రెగ్యులర్ పేసర్లు షమీ, సిరాజ్, బుమ్రా, ప్రసిధ్ ఉండగా... ఆల్‌రౌండర్లుగా జడేజా, అక్షర్ పటేల్, పాండ్యా, శార్దుల్ కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. బ్యాటింగ్ బృందం విషయంలో ఎలాంటి అనూహ్య ఎంపికలు లేవు. జట్టులో ఒక్క ఆఫ్‌స్పిన్నర్ కూడా లేడు.

వారిద్దరూ సిద్ధం...

రాహుల్ చివరిసారిగా మే 1న ఐపీఎల్ మ్యాచ్ బరిలోకి దిగి తొడ కండరాల గాయంతో ఆటకు దూరం కాగా, మార్చిలో ఆస్ట్రేలియాతో మూడో టెస్టు ఆడుతూ వెన్ను గాయంతో శ్రేయస్ మ్యాచ్ మధ్యలో నుంచి తప్పుకున్నాడు. వీరిద్దరు శస్త్రచికిత్సల అనంతరం ఇప్పటి వరకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్నారు. మిడిలార్డర్‌లో కీలకం కానున్న వీరిద్దరు కోలుకొని మ్యాచ్ ఫిట్‌నెస్‌ను సాధించడంతో మళ్లీ జట్టులోకి ఎంపిక చేశారు. శ్రేయస్ పూర్తి ఫిట్ కాగా, రాహుల్ పాత గాయం నుంచి కోలుకున్నా... స్వల్ప అసౌకర్యంతో ఉన్నాడు. దాంతో ఆసియా కప్ కోసం ముందు జాగ్రత్తగా రిజర్వ్ ఆటగాడిగా సంజు సామ్సన్‌ను కూడా ఎంపిక చేశారు. వన్డేల్లో వరుసగా విఫలమైన పేలవ రికార్డు ఉన్నా... సూర్యకుమార్ యాదవ్‌పై సెలక్టర్లు నమ్మకం ఉంచారు. రాహుల్ తర్వాత రెండో వికెట్ కీపర్‌గా సామ్సన్ కంటే ఇషాన్ కిషన్‌కు ప్రాధాన్యత దక్కింది.

జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, జడేజా, బుమ్రా, కుల్దీప్, సిరాజ్, షమీ, ఇషాన్ కిషన్, శార్దుల్, అక్షర్, సూర్యకుమార్, తిలక్ వర్మ, ప్రసిధ్ కృష్ణ, సంజు సామ్సన్ (రిజర్వ్ ఆటగాడు).

తిలక్‌కు లక్కీ చాన్స్...



హైదరాబాద్‌కు చెందిన నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ ఇటీవల వెస్టిండీస్‌తో 5 మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో 173 పరుగులతో భారత్ తరఫున టాపర్‌గా నిలిచాడు. అయితే అతని స్కోర్లకంటే క్రీజ్‌లో అతని ఆత్మవిశ్వాసం, పోరాటతత్వం అందరినీ ఆకట్టుకున్నాయి. అందుకే ఇప్పటి వరకు వన్డేలే ఆడకపోయినా అతనికి అవకాశం దక్కింది. దేశవాళీ వన్డేల్లో తిలక్ రికార్డు చాలా బాగుంది. 25 మ్యాచ్‌లలో 56.18 సగటుతో అతను 1,236 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 5 హాఫ్ సెంచరీలు ఉండగా స్ట్రయిక్‌రేట్ కూడా 101.64 కావడం అతని దూకుడును చూపిస్తోంది.

> "ఆఫ్‌స్పిన్నర్‌గా అశ్విన్, సుందర్‌లపై కూడా చర్చ జరిగింది. ఒక పేసర్‌ను తగ్గిస్తేనే చహల్‌ను తీసుకోగలిగేవాళ్లం. కానీ జట్టులో మన పేసర్ల పాత్ర కీలకం కానుంది. అయితే ఎవరికీ దారులు మూసుకుపోలేదు. మున్ముందు ఏదైనా జరగొచ్చు. ఒక ఆటగాడికి ప్రత్యేకంగా ఒకే స్థానం అంటూ ఏమీ ఉండదు. పరిస్థితిని బట్టి ఆర్డర్ మారుతుంది. అందరూ దీనికి సిద్ధంగా ఉండాలని చెప్పాం. అయితే దీనర్థం ఏడో నంబర్ ఆటగాడు ఓపెనర్‌గా, ఓపెనర్ వెళ్లి ఎనిమిదో స్థానంలో ఆడటం కాదు. అలాంటి పిచ్చి పనులు మేం చేయం. టాప్-3 చాలా కాలంగా మారలేదు కాబట్టి మిడిలార్డర్‌లో స్వల్పంగా మార్పులు ఉంటాయని నా ఉద్దేశం. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

> మేం ఇప్పుడు 18 మందిని ఎంపిక చేశాం. ఈ జాబితా నుంచే వరల్డ్ కప్ టీమ్‌ను ఎంచుకోవడం ఖాయం. ఎంపికకు ముందు మన జట్టు ఆసియా కప్‌లో రెండు మ్యాచ్‌లు ఆడుతుంది. అన్నీ చూశాకే నిర్ణయం తీసుకుంటాం. రాహుల్ రెండో మ్యాచ్ వరకు పూర్తిగా కోలుకోగలడని ఆశిస్తున్నాం. రెండో మణికట్టు స్పిన్నర్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం లేకపోవడంతో యుజువేంద్ర చహల్‌ను పక్కన పెట్టాం. వెస్టిండీస్‌లో తిలక్ ఆట మమ్మల్ని ఆకట్టుకుంది. అతనికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలనే వన్డేల్లో తీసుకున్నాం. ఎడంచేతివాటం కూడా అదనపు అర్హత. -అజిత్ అగార్కర్, చీఫ్ సెలక్టర్"

ఫైనల్లో ప్రజ్ఞానంద

సెమీస్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ కరువానాపై సంచలన విజయం
నేటి నుంచి కార్ల్‌సన్‌తో టైటిల్ పోరు • ప్రపంచకప్ చెస్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద పెను సంచలనం సృష్టించాడు. ప్రపంచ కప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ మూడో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన సెమీఫైనల్లో 18 ఏళ్ల ప్రజ్ఞానంద 3.5–2.5తో గెలుపొందాడు. ఫైనల్ చేరడంద్వారా ప్రజ్ఞానంద వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్ టోర్నీకి అధికారికంగా అర్హత సాధించాడు. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ కప్ టోర్నీలో ఫైనల్ చేరిన రెండో భారతీయ ప్లేయర్‌గా ప్రజ్ఞానంద గుర్తింపు పొందాడు. నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌లు ముగిశాక ప్రజ్ఞానంద, కరువానా 1–1తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. 25 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు కూడా 'డ్రా'గా ముగియడంతో స్కోరు 2–2తో సమమైంది. అనంతరం 10 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లను ఆడించారు. తొలి గేమ్‌లో తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద 63 ఎత్తుల్లో గెలిచాడు. ఫైనల్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన రెండో గేమ్‌లో కరువానా 'డ్రా' చేసుకోవడంతో ప్రజ్ఞానంద విజయం ఖరారైంది. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో ప్రజ్ఞానంద ఫైనల్లో తలపడతాడు. రెండు క్లాసికల్ గేమ్‌లలో భాగంగా వీరిద్దరి మధ్య తొలి గేమ్ నేడు జరుగుతుంది.

కప్ కోసం ఆమె... ఆమె కోసం కుటుంబం

- పెను విషాదాన్ని దాచిపెట్టారు
- స్పెయిన్ కెప్టెన్ ఓల్గా కర్మోనా పట్ల విధి వైచిత్రం



మాడ్రిడ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) మహిళల ప్రపంచకప్‌లో స్పెయిన్ జట్టు తొలి టైటిల్‌తో చరిత్రకెక్కింది. దేశవ్యాప్తంగా మిన్నంటే సంబరాలతో పండగ చేసుకుంది. కానీ కప్‌ను గెలిపించిన ప్లేయర్, గోల్ చేసిన ప్లేయర్, నడిపించిన కెప్టెన్ మాత్రం విలపించింది. ఇందులో ఆశ్చర్యపోవడానికేం లేదు. ఎందుకంటే ఆమె ఇంట పెనువిషాదం అలుముకుంది. గోల్ చేసింది... గెలిపించింది... నడిపించింది ఓల్గా కర్మోనా అయితే... ఫైనల్‌కు రెండు రోజుల ముందే ఆమెకు జన్మనిచ్చిన తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని కుటుంబం ఆమెకు తెలియనివ్వలేదు. ఆమె ప్రపంచకప్ కలకు ఈ విషాదం అడ్డంకి కాకూడదనుకొని చెప్పలేదు. కర్మోనా ట్రోఫీ అందుకున్న తర్వాతే మరణవార్త చెప్పారు. అందరు సంబరాలు చేసుకుంటే... తనుమాత్రం తండ్రి ఇక లేడన్న వార్త తట్టుకోలేక కన్నీటి పర్యంతమైంది.

లెక్క సరిచేసిన జొకోవిచ్



ఒహాయో: సెర్బియా టెన్నిస్ యోధుడు జొకోవిచ్ తన కెరీర్‌లో 39వ మాస్టర్స్ సిరీస్ టైటిల్ సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో 3 గంటల 49 నిమిషాలపాటు జరిగిన సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ ఫైనల్లో జొకోవిచ్ 5–7, 7–6 (9/7), 7–6 (7/4)తో గెలుపొందాడు. రెండో సెట్ టైబ్రేక్‌లో జొకోవిచ్ ఒక మ్యాచ్ పాయింట్ కాపాడుకోవడం విశేషం. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 10,19,335 డాలర్ల (రూ. 8 కోట్ల 47 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ గెలుపుతో ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో అల్‌కరాజ్ చేతిలో ఎదురైన ఓటమికి జొకోవిచ్ బదులు తీర్చుకున్నాడు. ఓవరాల్‌గా జొకోవిచ్ కెరీర్‌లో ఇది 95వ సింగిల్స్ టైటిల్‌కాగా, కెరీర్‌లో 1,069వ విజయం.

సినిమా

జాతి రత్నాలు తర్వాత ఒత్తిడికి గురయ్యాను
- నవీన్ పోలిశెట్టి



• నవీన్ పోలిశెట్టి, ప్రమోద్, మహేశ్‌బాబు

"ఒక యాక్సిడెంట్‌లో గాయాలైన ఒక మహిళా అభిమాని డిప్రెషన్ నుంచి కోలుకునేందుకు నా 'జాతి రత్నాలు' సినిమాని రోజూ చూస్తానని చెప్పింది. ఇంతకంటే సంతృప్తి నటుడిగా నాకు దొరకదు. అందుకే 'జాతి రత్నాలు' హిట్ తర్వాత ఎలాంటి సినిమా చేయాలా అని ఒత్తిడికి గురయ్యాను. ఆ క్రమంలో మహేశ్ చెప్పిన కథ చాలా ఎగ్జయిట్ చేసింది. మానవ సంబంధాల మీద మంచి ఎంటర్‌టైనింగ్ స్టోరీ రాసుకున్నాడు మహేశ్. స్టాండప్ కామెడీ క్యారెక్టర్‌తో ఫుల్ లెంగ్త్ సినిమా తెలుగులో రాలేదు. అది నచ్చింది. అలాగే అనుష్క హీరోయిన్ అనగానే హ్యాపీ ఫీలయ్యా'' అన్నారు నవీన్ పోలిశెట్టి. మిస్ శెట్టిగా అనుష్కా శెట్టి, మిస్టర్ పోలిశెట్టిగా నవీన్ పోలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. మహేష్ బాబు పి. దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. సోమవారం ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. ''పెళ్లి ఒక్కటే కాదు.. ప్రతి రిలేషన్‌లో యువత ఆలోచించే తీరు ఎలా ఉంటుంది? అనేది ఈ సినిమాలో చూపిస్తున్నాం'' అన్నారు పి. మహేశ్ బాబు.

లండన్‌లో ఈగల్



• 'ఈగల్' పోస్టర్

రవితేజ మోస్ట్ వాంటెడ్.. హీరోగా ఇండస్ట్రీకి మోస్ట్ వాంటెడ్. 'ఈగల్' సినిమాలో కూడా రవితేజ మోస్ట్ వాంటెడ్. సినిమాలో ఆయన్ను పట్టుకోవడానికి 'రా' ఏజెన్సీ వెతుకుతుంటుంది. కొందరు ఆయన్ను పెయింటర్ అనుకుంటారు.. మరికొందరు రైతు అనుకుంటారు.. ఇంకొందరు ఇంకోటి అనుకుంటారు. సో.. ఈ చిత్రంలో రవితేజ పలు గెటప్స్‌లో కనిపిస్తారని ఊహించవచ్చు. రవితేజ, అనుపమా పరమేశ్వరన్ జంటగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'ఈగల్'. ఈ చిత్రం తాజా షెడ్యూల్ లండన్‌లో ప్రారంభమైంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: దవ్‌జాంద్, కెమెరా-ఎడిటింగ్: కార్తీక్ ఘట్టమనేని, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



• సమంత

పద్నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ..!

''కలలు కనడానికి న్యూయార్క్ మంచి ప్రదేశం అంటుంటారు. నా కెరీర్‌ని నేనిక్కడే ఆరంభించా. నా తొలి సినిమా ('ఏ మాయ చేశావే') షూటింగ్ ఇక్కడే జరిగింది. అప్పుడు నేనో చిన్న పిల్లని. ఎలా ముందుకెళుతుంది (తనను ఉద్దేశించి) అనే క్లూ అప్పుడు తనకు లేదు. కానీ, పెద్ద కల కనేంత ధైర్యం మాత్రం ఉంది. 14 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ..'' అంటూ సోషల్ మీడియా వేదికగా సమంత పేర్కొన్నారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరిగిన 41వ వార్షిక భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు సమంత. ఈ సందర్భంగా ఈ బ్యూటీ ఆ నగరంలో 'ఏ మాయ చేశావే' చిత్రీకరించిన రోజులను గుర్తు చేసుకుని పై విధంగా స్పందించారు.

హారర్ నేపథ్యంలో...



• త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆశిష్

'రౌడీ బాయ్స్' ఫేమ్ ఆశిష్ హీరోగా మూడో చిత్రం సోమవారం ఆరంభమైంది. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, నాగార్జున మల్లిడి నిర్మిస్తున్నారు. ''రొమాంటిక్ హారర్ నేపథ్యంలో తెరకెక్కనున్న చిత్రమిది. 'రౌడీ బాయ్స్'తో తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఆశిష్ ప్రస్తుతం నటిస్తున్న 'సెల్ఫిష్' 50 శాతానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. మూడో సినిమాగా రూపొందుతున్న ఈ రొమాంటిక్ హారర్ లవ్ స్టోరీ కోసం ఇండస్ట్రీలోని టాప్ టెక్నీషియన్స్ వర్క్ చేస్తున్నారు'' అన్నారు మేకర్స్. ఈ సినిమా ప్రారంభోత్సవానికి డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాతలు చినబాబు, నాగవంశీ తదితరులు హాజరయ్యారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కెమెరా: పీసీ శ్రీరామ్.

కథలో కొత్తదనం ఉండాలి
- నిర్మాత బెన్నీ ముప్పానేని



''ప్రేక్షకుడిగా నేనో సినిమా చూసినప్పుడు కథలో కొత్తదనం ఉండాలని కోరుకుంటాను. 'బెదురులంక 2012' కథలో అలాంటి కొత్తదనాన్ని చూపించారు క్లాక్స్'' అని నిర్మాత బెన్నీ ముప్పానేని అన్నారు. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా క్లాక్స్ దర్శకత్వం వహించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బెన్నీ ముప్పానేని మాట్లాడుతూ– ''సినిమాలపై ఉన్న ఆసక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి, నిర్మాతగా మారాను. ఓ ఊహాజనిత గ్రామంలో 2012లో 21 రోజులు ఏం జరిగింది? అనేది 'బెదురులంక 2012' చిత్రకథ. మనం చనిపోతాం అని తెలిస్తే చివరి క్షణాల్లో ఎలా ఉంటాం? అనేది సినిమా కోర్ పాయింట్. కార్తికేయ చాలా ప్రొఫెషనల్. అతనితో మరో సినిమా చేద్దామనుకుంటున్నాం. నేహా శెట్టి పల్లెటూరి అమ్మాయి పాత్రలో ఒదిగిపోయారు. మణిశర్మగారు అద్భుతమైన సంగీతం ఇచ్చారు. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారు రాసిన చివరి పాట మా సినిమాలో ఉండటం మా అదృష్టం. మా సినిమా ట్రైలర్ రిలీజ్ చేసిన రామ్‌చరణ్‌గారు కథని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మా బ్యానర్‌లో మూడు ప్రాజెక్ట్స్ ఓకే చేశాం'' అన్నారు.

వారి ప్రేమను తిరిగి ఇస్తాను
- సాక్షి వైద్య



''తెలుగు ప్రేక్షకులు నన్ను ప్రేమిస్తున్నారు. ఇప్పుడు నాకు తెలుగు కొంచెం కొంచెం అర్థమవుతోంది. తెలుగు భాష నేర్చుకుని అభిమానుల ప్రేమను తిరిగి ఇస్తాను'' అని హీరోయిన్ సాక్షి వైద్య అన్నారు. వరుణ్ తేజ్ హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాక్షి వైద్య మాట్లాడుతూ– ''ఏజెంట్' సినిమా రిలీజ్ కాకముందే కొన్ని షాట్స్‌ను ప్రవీణ్ సార్ చూశారు. 'గాండీవధారి అర్జున'లో ఐరా పాత్రకు నేను సెట్ అవుతానని తీసుకున్నారు. నాకు డ్రైవింగ్ అంతగా రాదు. ఈ మూవీలో ఆ సీన్లు చేసేటప్పుడు భయపడ్డాను. ఈ సినిమాలో నా పాత్రకి నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. తెలుగులో సాయిధరమ్ మూవీతో పాటు 'లక్కీ భాస్కర్', 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలు కమిట్ అయ్యాను. రవితేజగారితోనూ నటించే చాన్స్ ఉంది'' అన్నారు.

ఎడ్యుకేట్ చేయాలి
- జయప్రకాశ్ నారాయణ్



• జయప్రకాశ్ నారాయణ్, అభయ్ నవీన్

''సినిమా అనేది ఎంటర్‌టైన్ చేయడంతో పాటు ఎడ్యుకేట్ చేయాలి. అలా ఎడ్యుకేట్ చేసే సినిమాలను ప్రోత్సహించాలి. యువత రాజకీయాల్లో తిరుగుతూ సరైన నాయకుడిని ఎంచుకోకుండా, జీవితాలు పాడు చేసుకుంటున్నారు. అలాటి అంశానికి వినోదం జోడించి తీసిన 'రామన్న యూత్'ని ఆదరించాలి'' అని లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకులు డా. జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. అభయ్ నవీన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రామన్న యూత్'. సెప్టెంబర్ 15న ఈ చిత్రం విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌ని జయప్రకాశ్ నారాయణ్ ఆవిష్కరించారు. ''గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ నాయకుల కోసం యువత ఎలాంటి త్యాగాలు చేస్తున్నారు? రాజు అనే ఒక యువకుడు పొలిటికల్ లీడర్‌గా ఎదగాలని చేసే ప్రయత్నాలు ఎలాంటి మలుపులు తిరిగాయి? అనేది ఈ చిత్రకథ'' అన్నారు అభయ్ నవీన్.

మాస్ గోట్

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న నాలుగో చిత్రం 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). దివ్య భారతి హీరోయిన్. 'పాగల్' ఫేమ్ నరేష్ కుప్పిలి దర్శకత్వంలో చంద్రశేఖర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం గ్లింప్స్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ వీడియోలో ఒక చేత్తో క్రికెట్ బ్యాట్ పట్టుకుని, మరో చేత్తో సిగరెట్ కాల్చుతూ మాస్ లుక్‌లో కనిపించారు సుధీర్. ''మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి'' అన్నారు చంద్రశేఖర్ రెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: బాలాజీ సుబ్రహ్మణ్యం.



• సుడిగాలి సుధీర్, దివ్యభారతి

అందుకే అందరూ కనెక్ట్ అవుతారు
- నితిన్ కృష్ణమూర్తి



''బాయ్స్ హాస్టల్' కథకు యూనివర్సల్ అప్పీల్ ఉంది. ప్రపంచంలో హాస్టల్స్ అన్ని చోట్ల ఉన్నాయి. అందుకే ఇందులోని పాత్రల్ని అందరూ రిలేట్ చేసుకుంటారు. కన్నడలో సూపర్ హిట్టయిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరిస్తుంది'' అని డైరెక్టర్ నితిన్ కృష్ణమూర్తి అన్నారు. ప్రజ్వల్ బీపీ, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'. ఈ నెల 12న కన్నడలో విడుదలైన ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ 'బాయ్స్ హాస్టల్' పేరుతో తెలుగులో ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా నితిన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ– ''దర్శకుడిగా 'బాయ్స్ హాస్టల్' నా తొలి చిత్రం. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి చక్కని మ్యూజిక్ చేశారు. తెలుగు నేటివిటీ కోసం రష్మి, తరుణ్ భాస్కర్‌గారి పాత్రల్ని రీ షూట్ చేశాం. అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ లాంటి సంస్థల ద్వారా తెలుగులోకి రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు.

యువతకి సందేశం



• సావిత్రి, ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వంలో 'ఉపేంద్ర గాడి అడ్డా' సినిమా సోమవారం ఆరంభమైంది. కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న ఈ సినిమా తొలి సీన్‌కి నిర్మాత సాయి వెంకట్ కెమెరా స్విచ్చాన్ చేయగా, చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు క్లాప్ ఇచ్చారు. ఆర్యన్ సుభాన్ ఎస్‌కే మాట్లాడుతూ– ''ప్రస్తుతం వరుణ్ సందేశ్‌తో 'కానిస్టేబుల్' చిత్రం చేస్తున్నాను. 'ఉపేంద్ర గాడి అడ్డా' నేటి ట్రెండ్‌కు తగ్గట్టు ఉంటూనే యువతకు సందేశం ఇచ్చేలా ఉంటుంది'' అన్నారు. ''మా అబ్బాయి ఉపేంద్రతో తొమ్మిది చిత్రాలు తీయాలనుకున్నాం. ఇప్పటికే నాలుగు నిర్మాణంలో ఉన్నాయి. 'ఉపేంద్ర గాడి అడ్డా' ఐదో సినిమా'' అన్నారు కంచర్ల అచ్యుతరావు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	267	65,216
నిఫ్టీ ▲	83	19,394

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,461	▲	171
డోజోన్స్	34,420	▽	80
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,258	▽	5
డాక్స్	15,603	▲	29
షాంఘై	3,093	▽	39
నికాయ్	31,566	▲	115

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,396
బంగారం (22 క్యారెట్)	58,163
వెండి (కేజీ)	70,835



జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిస్టింగ్ కార్యక్రమం అనంతరం బీఎస్‌ఈలో ఫొటోలకు పోజులిచ్చిన సంస్థ ఇండిపెండెంట్ డైరెక్టర్, నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేవీ కామత్

మార్కెట్లకు దిగ్గజాల దన్ను

- రెండు రోజుల నష్టాలకు చెక్
- సెన్సెక్స్ 267 పాయింట్లు అప్
- 65,216 వద్ద ముగింపు
- నిఫ్టీ 83 పాయింట్లు ప్లస్

ముంబై: బ్లూచిప్ కంపెనీలు ఇన్ఫోసిస్, ఐటీసీ తదితర దిగ్గజాలకు డిమాండ్ పుట్టడంతో మార్కెట్లు బలపడ్డాయి. వెరసి రెండు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సెన్సెక్స్ 267 పాయింట్లు ఎగసి 65,216 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 83 పాయింట్లు జంప్‌చేసి 19,394 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్ల ప్రభావంతో తొలుత మార్కెట్లు హుషారుగా ప్రారంభమయ్యాయి. అయితే వెనువెంటనే అమ్మకాలు పెరిగి నీరసించినప్పటికీ యూరోపియన్ మార్కెట్లు సైతం సానుకూలంగా ప్రారంభం కావడంతో తిరిగి జోరందుకున్నాయి. దీంతో ఒక దశలో సెన్సెక్స్ 387 పాయింట్లవరకూ ఎగసి, 65,336కు చేరింది. ఈ బాటలో నిఫ్టీ 19,426 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే తొలుత 19,296 వద్ద కనిష్టాన్నీ చవిచూసింది.

మెటల్స్ ముందడుగు

ఎన్ఎస్ఈలో మెటల్స్, ఐటీ, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్ రంగాలు 1.3–0.6 శాతం మధ్య పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 0.6 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో బజాజ్ ఫైనాన్స్ ద్వయం, అదానీ పోర్ట్స్, ఎంటర్‌ప్రైజెస్, హిందాల్కో, ఇండస్‌ఇండ్, ఎన్‌టీపీసీ, ఎయిర్‌టెల్, అపోలో హాస్పిటల్స్, ఐటీసీ, కోల్ ఇండియా, ఎల్‌టీఐఎం, ఇన్ఫోసిస్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ, టైటన్, యాక్సిస్ 2.7–1 శాతం మధ్య లాభపడ్డాయి. దిగ్గజాలలో ఆర్ఐఎల్, ఎంఅండ్ఎం, బ్రిటానియా మాత్రమే ప్రస్తావించదగ్గ స్థాయిలో 1 శాతం చొప్పున బలహీనపడ్డాయి.

చిన్న షేర్లు గుడ్

మార్కెట్ల ప్రోత్సాహంతో చిన్న షేర్లకు డిమాండ్ కనిపించింది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.7 శాతం చొప్పున వృద్ధి చూపాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 2,062 లాభపడగా.. 1,675 నష్టపోయాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 267 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) తాజాగా మరో రూ. 1,901 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అయితే దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 626 కోట్లను ఇన్వెస్ట్ చేయడం గమనార్హం! కాగా.. విదేశీ మార్కెట్లలో బ్రెంట్ చమురు బ్యారల్ 0.6 శాతం బలపడి 85.31 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి మరోసారి చరిత్రాత్మక కనిష్టం 83.12 వద్ద ముగిసింది.

జియో ఫైనాన్షియల్ లిస్టింగ్.. ఫ్లాట్

5 శాతం నష్టంతో ముగింపు

డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ప్రత్యేక కంపెనీగా విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. బీఎస్ఈలో 1.2 శాతం లాభంతో రూ. 265 వద్ద ప్రారంభమైంది. తదుపరి 5 శాతం పతనమై రూ. 252 దిగువన ముగిసింది. ఇది లోయర్ సర్క్యూట్ కాగా.. షేరు ధర నిర్ధారణకు గత నెలలో స్టాక్ ఎక్స్ఛేంజీలు నిర్వహించిన డమ్మీ ట్రేడింగ్‌లో రూ. 265 వద్ద స్థిరపడిన సంగతి తెలిసిందే. ఇక ఎన్ఎస్ఈలోనూ రూ. 262 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 5 శాతం పడిపోయి లోయర్ సర్క్యూట్‌ను తాకింది. రూ. 249 దిగువన నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రూ. 1,59,944 కోట్లుగా నమోదైంది. వెరసి టాప్–100 విలువైన కంపెనీలలో 34వ ర్యాంకులో నిలిచింది.



ట్రేడ్ ఫర్ ట్రేడ్ విభాగంలో

ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని గత నెలలో ఆర్ఐఎల్ రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ప్రత్యేక కంపెనీగా విడదీసింది. ఆపై జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌గా ఈ సంస్థ ఆవిర్భవించింది. ఈ కౌంటర్లో లావాదేవీలను స్టాక్ ఎక్స్ఛేంజీలు 10 రోజులపాటు ట్రేడ్ ఫర్ ట్రేడ్ విభాగంలో అనుమతించాయి. ఈ నేపథ్యంలో 5 శాతం వరకూ షేరు ధర క్షీణించింది. కంపెనీల విడదీతపై సవరించిన నిబంధనల అమలులో భాగంగా సెన్సెక్స్, నిఫ్టీలలో జియో ఫైనాన్షియల్‌కు తాత్కాలికంగా చోటు లభించింది. ఫలితంగా సెన్సెక్స్‌లో 31వ, నిఫ్టీలో 51వ కంపెనీగా ప్రాతినిధ్యం వహించింది. మరోవైపు మాతృ సంస్థ ఆర్ఐఎల్ షేరు 1.5 శాతం నష్టపోయి రూ. 2,518 వద్ద ముగిసింది.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ల కొనుగోలు



69.87 శాతానికి అదానీ గ్రూప్ వాటా

డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రమోటర్ అదానీ గ్రూప్ వాటాను పెంచుకుంది. ఈ నెల 7–18 మధ్యలో ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 2.22 శాతం వాటాను కొనుగోలు చేసింది. దీంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రమోటర్ గ్రూప్ వాటా 67.65 శాతం నుంచి 69.87 శాతానికి బలపడింది. ప్రమోటర్ గ్రూప్ సంస్థ.. కెమ్‌పాస్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ తాజా వాటాను కొనుగోలు చేసింది.

ఐపీవోకు ఏపీజే సురేంద్ర పార్క్ హోటల్స్



పార్క్ బ్రాండ్ కింద హోటల్స్ నిర్వహించే ఏపీజే సురేంద్ర పార్క్ హోటల్స్ తాజాగా ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా రూ. 1,050 కోట్లు సమీకరించనుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఆఫర్‌లో భాగంగా రూ. 650 కోట్ల విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేయనుండగా, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రూ. 400 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు.

విష్ణు ప్రకాష్ ఆఫర్ ధర @ రూ. 94-99



ఈ నెల 24–28 మధ్య ఐపీవో

ఈపీసీ సేవల కంపెనీ విష్ణు ప్రకాష్ ఆర్ పంగ్లియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 24న ప్రారంభంకానుంది. ఇందుకు షేరుకి రూ. 94–99 ధరల శ్రేణిని ప్రకటించింది. 28న ముగియనున్న ఇష్యూలో భాగంగా కంపెనీ 3.12 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. తద్వారా రూ. 309 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూలో కొంతమేర అర్హతగల ఉద్యోగులకు కేటాయించనుంది.

మార్కెట్లోకి మళ్లీ హానర్ స్మార్ట్‌ఫోన్లు: సీఈవో మాధవ్ సేథ్



న్యూఢిల్లీ: హానర్ బ్రాండ్ స్మార్ట్‌ఫోన్లు మళ్లీ భారత్ మార్కెట్లోకి రానున్నాయి. చైనా స్మార్ట్ డివైజెస్ సంస్థ హానర్ నుంచి లైసెన్సు పొందిన హానర్‌టెక్ కంపెనీ వీటిని సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టే ప్రయత్నాల్లో ఉంది. ఈ వ్యాపారానికి సంబంధించి రూ. 1,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. హానర్‌టెక్ సీఈవో మాధవ్ సేథ్ ఈ విషయాలు వెల్లడించారు. వచ్చే ఏడాది ఆఖరు నాటికి 4–5 శాతం మార్కెట్ వాటాను దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నట్లు, తద్వారా రూ. 10,000 కోట్లు ఆదాయం సాధించే అవకాశాలు ఉన్నట్లు ఆయన వివరించారు. హానర్‌టెక్ పూర్తిగా భారత సంస్థ అని, హానర్ నుంచి తీసుకున్న లైసెన్సుతో ఇక్కడే తయారీ నుంచి అమ్మకాల కార్యకలాపాలు నిర్వహించనున్నామని సేథ్ చెప్పారు. చైనా టెలికం దిగ్గజం హువావే అప్పట్లో హానర్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టింది. ఆ తర్వాత 2020లో మరో చైనా సంస్థకు దాన్ని విక్రయించింది. మరోవైపు, రియల్‌మి అంతర్జాతీయ వ్యాపారానికి సారథ్యం వహిస్తున్న సేథ్ ఇటీవలే దాన్నుంచి తప్పుకున్నారు. వ్యాపారవేత్త సీపీ ఖండేల్వాల్‌కి చెందిన పీఎస్ఏవీ గ్లోబల్‌తో కలిసి హానర్‌టెక్‌ను జాయింట్ వెంచర్‌గా ఏర్పాటు చేశారు.

సన్నీ విల్లా వేలం ప్రక్రియ వెనక్కి



ముంబై: బాలీవుడ్ నటుడు, సిట్టింగ్ ఎంపీ సన్నీ డియోల్‌కు చెందిన విల్లా వేలం ప్రక్రియ నోటీసును బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ఉపసంహరించుకుంది. బకాయిలన్నీ కట్టేసేందుకు సన్నీ అంగీకరించడమే ఇందుకు కారణమని తెలిపింది. ముంబైలోని సన్నీ విల్లాకు సంబంధించి సన్నీ డియోల్ దాదాపు రూ. 56 కోట్లు బాకీ పడ్డారని, దాన్ని రాబట్టుకునేందుకు ప్రాపర్టీని సెప్టెంబర్ 25న వేలం వేయనున్నామని బీవోబీ ఆదివారం నాడు పబ్లిక్ నోటీసు ఇచ్చింది. వేలానికి రూ. 51.43 కోట్ల రిజర్వ్ ధరను, రూ. 5.14 కోట్ల మొత్తాన్ని బయానాగా నిర్ణయించింది.

ఎల్‌అండ్‌టీకి ఆస్ట్రేలియా యూరియా ప్లాంటు కాంట్రాక్టు



ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీ తాజాగా ఆస్ట్రేలియాలో అతి పెద్ద యూరియా ప్లాంటు నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకుంది. 2.3 మిలియన్ టన్నుల యూరియా ప్లాంటును ఏర్పాటు చేసేందుకు పెర్డమాన్ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ నుంచి ఒక 'భారీ' ఆర్డరు లభించినట్లు సంస్థ తెలిపింది. డీల్ విలువ ఎంతనేది మాత్రం వెల్లడించకపోయినా 'గణనీయ స్థాయి ఆర్డరు' అని పేర్కొంది. సాధారణంగా ఈ తరహా ఆర్డరు విలువ సుమారు రూ. 1,000 కోట్ల నుంచి రూ. 2,500 కోట్లుగా ఉంటుంది. ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి విలువ మారే అవకాశం ఉండే డీల్స్ గణాంకాల గురించి ముందుగా వెల్లడించరాదనే విధానాన్ని పాటిస్తున్నట్లు సంస్థ సీఎండీగా నియమితులైన ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు. వ్యయాల భారం, కార్మికుల కొరత కారణంగా ప్లాంటుకు సంబంధించిన ప్రీ-ఫ్యాబ్రికేటెడ్ యూనిట్లను భారత్‌లో తయారు చేసి ఆస్ట్రేలియాలో అసెంబుల్ చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఇది ప్రపంచంలోనే అతి పెద్ద యూరియా ప్లాంట్లలో ఒకటి కాగలదని పెర్డమాన్ చైర్మన్ వికాస్ రాంబల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-8-2023	
విశాఖ	470-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	445-00
రిటైల్ ధర (డజను)	72.00
21-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌టీఏ-పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ 2023

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్ష 2023 ప్రకటనను విడుదలచేసింది. ఈ పరీక్ష ద్వారా యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, బాబా భీమ్‌రావ్ అంబేద్కర్ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ కోర్సుల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందవచ్చు.

» **విభాగాలు:** కామర్స్, ఫైనాన్స్, ఆర్ట్ అండ్ కల్చర్, హ్యుమానిటీస్, లాంగ్వేజెస్, సైన్సెస్, ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ తదితరాలు.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేట్/తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** వయోపరిమితి నిబంధనలు లేవు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహిస్తారు. రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి విభాగంలో రీసెర్చ్ మెథడాలజీ, రెండో విభాగంలో సంబంధిత సబ్జెక్టు నుంచి ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 100 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 09.09.2023 నుంచి 11.09.2023 వరకు
» **వెబ్‌సైట్:** https://www.nta.ac.in

ఎస్ఎస్‌సీ-జేహెచ్‌టీ, జేటీ, ఎస్‌హెచ్‌టీ పరీక్ష-2023

స్టాఫ్ సెలక్షన్ సెలక్షన్(ఎస్ఎస్‌సీ).. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి నిర్వహించే రాత పరీక్షకు సంబంధించి సంక్షిప్త ప్రకటనను విడుదల చేసింది. దీని ద్వారా సెంట్రల్ సెక్రటేరియట్, రైల్వే బోర్డులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, సెంట్రల్ హిందీ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో పోస్టులు భర్తీ చేయనున్నారు.

» **అర్హత:** పోస్టును అనుసరించి మాస్టర్ డిగ్రీ(హిందీ/ఇంగ్లిష్) డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి. దీనితోపాటు ట్రాన్స్‌లేషన్ (హిందీ/ఇంగ్లిష్) డిప్లొమా/సర్టిఫికేట్ కోర్సు చేసి ఉండాలి లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థలో రెండేళ్ల ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. సీనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులకు సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతోపాటు మూడేళ్ల ట్రాన్స్‌లేషన్ అనుభవం ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ/పీజీ(హిందీ/ఇంగ్లిష్) అర్హతతోపాటు తగు అనుభవం ఉండాలి. డిగ్రీ స్థాయిలో హిందీ/ఇంగ్లిష్ సబ్జెక్టు పాఠ్యాంశంగా ఉండాలి. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో సీనియర్ సెకండరీ స్థాయిలో రెండేళ్ల హిందీ బోధన అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్–1, పేపర్–2), డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.09.2023
» **పరీక్ష తేదీలు:** అక్టోబర్/నవంబర్ 2023.
» **వెబ్‌సైట్:** ssc.nic.in

తిరుపతి స్విమ్స్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ).. నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్ యూనివర్శిటీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, గైనకాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, పీడియాట్రిక్స్, డెంటల్ సర్జరీ, పాథాలజీ, డెర్మటాలజీ, ఫార్మకాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, సైకియాట్రీ, జనరల్ సర్జరీ, రేడియో డయాగ్నోసిస్, హెమటాలజీ, రేడియోథెరపీ, న్యూక్లియర్ మెడిసిన్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/డీఎం/ఎంసీహెచ్/ఎంఎస్సీ /ఎంపీటీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా సీటు కేటాయిస్తారు. యూజీసీ–నెట్ లేదా యూజీసీ–సీఎస్ఐఆర్ నెట్/జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందిన అభ్యర్థులకు ప్రవేశపరీక్ష నుంచి మినహాయింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్‌సైన్సెస్, స్విమ్స్ యూనివర్శిటీ, అలిపిరి రోడ్, తిరుపతి చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.09.2023.
» **వెబ్‌సైట్:** svimstpt.ap.nic.in

» గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టులకు ప్రకటన
» జీపీఎం, ఏజీపీఎం, డాక్ సేవక్ పోస్టులు
» పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక
» ఏపీలో 1,058 ; తెలంగాణలో 961 పోస్టులు

పదితోనే.. కేంద్ర కొలువు

ఎలాంటి రాత పరీక్షలు లేకుండానే.. పదో తరగతిలో మార్కుల ఆధారంగా.. కేంద్ర ప్రభుత్వ కొలువు దక్కించుకునే అవకాశం ముంగిటకొచ్చింది. భారత తపాలా శాఖ.. గ్రామీణ్ డాక్ సేవక్ పేరిట.. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్/డాక్ సేవక్‌ల పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా మొత్తం 30,041 పోస్టులకు నియామకాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో.. ఇండియా పోస్ట్స్.. గ్రామీణ్ డాక్ సేవక్ ఉద్యోగాల వివరాలు, ఎంపిక విధానం, విధులు, వేతనాలు తదితర వివరాలు..



భారత తపాలా శాఖ.. మెట్రో నగరాల నుంచి మారుమూల పల్లెల వరకు సేవలందిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వినియోగదారులకు సేవలందించేందుకు వినూత్న విధానలను అవలంబిస్తూ శాఖలను విస్తరిస్తోంది. దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్న గ్రామాల పరిధిలోని ప్రజలకు సేవలు అందించే ఉద్దేశంతో.. గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టులకు గతంలోనే రూపకల్పన చేసింది. ఈ పోస్టుల్లో నియామకాలకు ప్రతి ఏటా ప్రకటన ఇస్తోంది. తాజాగా 2023కు సంబంధించి గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టుల వివరాలు

గ్రామీణ్ డాక్ సేవక్ పేరిట.. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్ పోస్టులను భర్తీ చేయనుంది. వీరు తమకు కేటాయించిన పోస్ట్ ఆఫీస్ పరిధిలో నిర్దేశిత విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఏపీలో 1,058, తెలంగాణలో 961

తాజా నోటిఫికేషన్ ద్వారా తపాలా శాఖ దేశ వ్యాప్తంగా మొత్తం 30,041 గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టులను భర్తీ చేయనుంది. వీటిలో ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో 1,058, తెలంగాణ సర్కిల్‌లో 961 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లను తప్పనిసరిగా చదివుండాలి. అభ్యర్థులు తమ స్థానిక భాషను చదివుండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, సైక్లింగ్ కూడా అవసరం.
- **వయసు:** ఆగస్ట్ 23,023 నాటికి 18–40 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

పదో తరగతి మెరిట్

బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్..ఈ మూడు పోస్టులకు కూడా పదో తరగతిలో ప్రతిభ ఆధారంగానే నియామకాలు ఖరారు చేస్తారు. పదో తరగతిలో అభ్యర్థులు పొందిన మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఎలాంటి రాత పరీక్షలు ఉండవు.

ఆకర్షణీయ వేతనం

- బీపీఎం, ఏబీపీఎం, డాక్ సేవక్‌లకు వేతనాలు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.
- బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లకు రూ.12,000 -రూ.29,380 శ్రేణిలో వేతనం ఉంటుంది. అంటే.. రూ.12 వేల మూల వేతనంతో కెరీర్ ప్రారంభమవుతుంది.
- అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్‌లకు రూ.10,000 -రూ.24,470 శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.
- వీటికి అదనంగా ఈ మూడు పోస్టులకు డీఏ, అదే విధంగా టైమ్ రిలేటెడ్ కంటిన్యూటీ అలవెన్స్ పేరిట ఇతర భత్యాలు కూడా లభిస్తాయి. మొత్తంగా నెలకు రూ.14 వేలకు పైగా వేతనం పొందొచ్చు.
- వీటితోపాటు ఆఫీస్ నిర్వహణ భత్యం, సైకిల్ నిర్వహణ భత్యం, కంబైన్డ్ డ్యూటీ అలవెన్స్ వంటివి కూడా అందుకునే వీలుంది.

ఆఫీస్ సదుపాయం బాధ్యత

గ్రామీణ్ డాక్ సేవక్‌ల విషయంలో మరో కీలక నిబంధన.. ఈ పోస్టులకు ఎంపికైన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్.. తమ గ్రామ స్థాయిలో కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి వసతి సదుపాయం చూపించాల్సి ఉంటుంది. ఎంపికైన వారు సంబంధిత గ్రామంలోనే నివాసం ఉండాలనే నిబంధన కూడా విధించారు.

విధులు ఇలా

బ్రాంచ్ పోస్ట్ మాస్టర్

ఈ హోదాలో రోజు వారీ తపాలా వ్యవహారాలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌కు సంబంధించిన విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. తపాలా శాఖ అందిస్తున్న ఉత్పత్తులు, సేవలకు సంబంధించి మార్కెటింగ్, కొత్త కస్టమర్లను చేర్పించడం వంటి బాధ్యతలు సైతం చేపట్టాల్సి ఉంటుంది.

అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్

ఈ హోదాలో స్టాంపులు,స్టేషనరీ విక్రయం, ఉత్తరాల బట్వాడాతోటు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకుకు సంబంధించి కస్టమర్ల నుంచి డిపాజిట్లు, చెల్లింపులు వంటి విధులు నిర్వర్తించాలి. బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు సహాయం అందించాలి. అదే విధంగా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లేని సమయాల్లో బీపీఎం విధులను కూడా ఏబీపీఎం నిర్వర్తించాల్సి ఉంటుంది.

డాక్ సేవక్

వీరిని సబ్ పోస్ట్ ఆఫీస్‌లు, హెడ్ పోస్ట్ ఆఫీస్‌లలో నియమిస్తారు. వీరు విధుల్లో భాగంగా స్టాంపులు, స్టేషనరీ విక్రయాలు, అదే విధంగా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకుకు సంబంధించిన డిపాజిట్లు, చెల్లింపులు, ఇతర కార్యకలాపాలను నిర్వర్తించాలి. వినియోగదారులకు వారి నివాసం వద్దే సేవలు అందించాల్సి ఉంటుంది. అంతేకాకుండా వీరు రైల్వే మెయిల్ సర్వీస్‌లోని సార్టింగ్ ఆఫీస్‌లు,మెయిల్ బ్యాగ్స్ పంపడం వంటి విధులు కూడా నిర్వర్తించాలి.

15 రోజుల్లోపు సమ్మతి

ఎంపికైన అభ్యర్థులు.. ఎంపిక జాబితా వెల్లడైన పదిహేను రోజుల్లోపు ఆయా పోస్టులలో చేరేందుకు తమ సమ్మతిని తెలపాల్సి ఉంటుంది. లేదంటే వారి పేరుని తొలగించి.. ఆ స్థానంలో మెరిట్ జాబితాలోని ఇతర అభ్యర్థులతో మార్కుల ఆధారంగా రెండో జాబితా విడుదల చేస్తారు.

స్వస్థలంలో పని చేసే అవకాశం

గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టులకు ఎంపికైతే తమ స్వస్థలాల్లోనే పని చేసే అవకాశం లభిస్తుంది. అభ్యర్థులు డివిజన్ వారీగా మాత్రమే పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని.. పోస్టుల వారీగా ప్రాథమ్యతను దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలని స్పష్టం చేశారు. ఆయా సర్కిల్స్ పరిధిలో భాష ప్రాతిపదికగా పోస్టుల సంఖ్యను పేర్కొన్నారు.

దీంతో.. తెలుగు రాష్ట్రాలకు(ఏపీ, తెలంగాణ) చెందిన అభ్యర్థులు ఈ రాష్ట్రాల్లోని డివిజన్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 23.08.2023
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు సవరణ అవకాశం: ఆగస్ట్ 24 నుంచి 26 వరకు
- ఎంపిక జాబితా వెల్లడి: 31.12.2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://indiapo-stgdsonline.gov.in
- ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: https://indiapostgdsonline.gov.in/Reg_validation.aspx

క్లుప్తంగా...

తాగునీటికే తొలి ప్రాధాన్యం

• ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి

సాక్షి, అమరావతి: కృష్ణా బేసిన్‌లో ప్రధానంగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో లభ్యత ఆధారంగా సెప్టెంబర్‌ వరకు తాగు, సాగునీటి అవసరాలపై చర్చించి.. నీటి కేటాయింపులు చేయడమే అజెండాగా సోమవారం కృష్ణా బోర్డు కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌ గైర్హాజరయ్యారు. దీంతో త్రిసభ్య కమిటీ చైర్మన్‌ అయిన కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురేతో ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి సమావేశమయ్యారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఇతర అవసరాలకు నీటిని తరలించకుండా తెలంగాణను నియంత్రించాలని కోరారు. సెప్టెంబర్‌ వరకు ఏపీ అవసరాల కోసం సాగర్‌ కుడి, ఎడమ కాలువలు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌(తెలుగుగంగ, గాలేరు–నగరి, ఎస్సార్బీసీ), హంద్రీ–నీవా, ముచ్చుమర్రి ద్వారా కేసీ కెనాల్‌లకు 30 టీఎంసీలు వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని ప్రతిపాదించారు. బోర్డు సభ్య కార్యదర్శి రాయ్‌పురే స్పందిస్తూ.. త్రిసభ్య కమిటీ సమావేశాన్ని మరోసారి నిర్వహిస్తామని.. అప్పుడు రెండు రాష్ట్రాల నీటి అవసరాలపై చర్చించి, కేటాయింపులపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కాశీ విశ్వనాథ్‌ ఆలయానికి గోల్ఫ్‌కార్ట్‌లు అందించిన ఎంపీ జీవీఎల్‌

సాక్షి, న్యూఢిల్లీ: వారణాసిలోని శ్రీ కాశీ విశ్వనాథ్‌ మందిర్‌లో వృద్ధులైన యాత్రికులు,మహిళలు,దివ్యాంగులు, కాలి నడకన ఆలయానికి చేరుకోలేని వారి సౌకర్యార్థం తన ఎంపీ లాడ్స్‌ నిధుల నుంచి బీజేపీ ఎంపీ జీవీఎల్‌ నరసింహారావు బ్యాటరీతో నడిచే మూడు గోల్ఫ్‌ కార్ట్‌లను అందించారు. సోమవారం ఉదయం వారణాసి మేయర్‌ అశోక్‌ తివారీ, మున్సిపల్‌ కార్పొరేషన్‌ చైర్మన్, తెలుగు ఆశ్రమాల ప్రతినిధులు పాల్గొన్న ప్రత్యేక కార్యక్రమంలో వీటిని ఎంపీ జీవీఎల్‌ దేవస్థాన అధికారులకు అందించారు. అనంతరం ఎంపీ జీవీఎల్‌ మాట్లాడుతూ, భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్‌ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ స్ఫూర్తితో ఈ సదుపాయం కల్పించామని తెలిపారు.

తెలంగాణ

ఇక్కడ తేళ్లు కుట్టవు!


నారాయణపేట: 'తేలు.. తేలు ఎందుకు కుట్టావ్‌ అంటే.. నా బంగారు బుట్టలోన వేలు పెడితే కుట్టనా అందట'. కానీ, నారాయణపేట జిల్లా సరిహద్దు కర్ణాటక రాష్ట్రంలోని కందుకూరులో మాత్రం తేళ్లు కుట్టమన్నా కుట్టవట. చిన్నారులు మొదలుకొని పెద్దవాళ్ల వరకు ఎవరైనా తేళ్లను చేతుల్లో పట్టుకొని ముఖం, నాలుక, నెత్తి మీద ఇలా ఎక్కడ పెట్టుకున్నా ఎలాంటి హాని తలపెట్టవు. సోమవారం నాగుల పంచమిని పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా గుర్మిట్కల్‌ తాలూకా కందుకూరు గ్రామ సమీపంలోని కొండమవ్వ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాళ్లు, మట్టి కింద ఉన్న తేళ్లను పట్టుకుని సరదాగా గడిపారు. అమ్మవారి మహిమ వల్లే తేళ్లు భక్తులకు హాని చేయవని భక్తుల విశ్వాసం.

రాష్ట్రంలో భారీగా పెరిగిన

ఐటీ చెల్లింపుదారులు

• దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాల ఆదాయాలు గణనీయంగా పెరగడమే కారణం
• 2020– 2023 మధ్య ఏకంగా 18 లక్షలు పెరిగిన ట్యాక్స్‌ పేయర్ల సంఖ్య
• దేశవ్యాప్తంగా చూస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా పెరుగుదల
• 2015– 2020 మధ్య 5 లక్షలు మాత్రమే పెరిగిన ఐటీ చెల్లింపుదార్లు
• ఆ సమయంలో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మాత్రం భారీగా పెరుగుదల
• దేశంలో 2014లో మధ్య తరగతి సగటు ఆదాయం రూ.4.4 లక్షలు... ఇపుడది రూ.13 లక్షలు
• 2047 నాటికి ఇది రూ.49.7 లక్షలకు పెరుగుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్‌ అంచనా
• ఐటీ పరిధిలోకి 2023లో 31.3 కోట్ల ఉద్యోగులు... 2047 నాటికి 56.5 కోట్లుగా అంచనా
• 2015తో పోలిస్తే 2023లో 4.81 కోట్ల మంది అదనంగా ఐటీ రిటర్నులు దాఖలు





సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజల ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. ఫలితంగా ఆదాయాన్ని వెల్లడించి ప్రభుత్వానికి పన్ను చెల్లించే ట్యాక్స్‌ పేయర్ల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలో ట్యాక్స్‌ పేయర్ల సంఖ్య ఏకంగా 18 లక్షలు పెరిగిందని, దేశవ్యాప్తంగా ఏ ఇతర రాష్ట్రంలోనూ ఇంతటి పెరుగుదల లేదని ఎస్‌బీఐ రీసెర్చ్‌ సంస్థ తెలియజేసింది. నిజానికి దేశవ్యాప్తంగా పెరిగిన ట్యాక్స్‌ పేయర్ల సంఖ్య 2015–2020 మధ్య 3.81 కోట్లుండగా... 2020–23 మధ్య మాత్రం 1 కోటి మాత్రమే. ఇతర రాష్ట్రాల్లోనూ పరిస్థితి ఇలానే ఉన్నా... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఆ ఐదేళ్లలో కేవలం 5 లక్షల మందే ట్యాక్స్‌ పేయర్లు పెరిగినట్లు ఎస్‌బీఐ తెలియజేసింది. మొత్తంగా చూస్తే 2015– 2023 మధ్య రాష్ట్రంలో 23 లక్షల మంది ట్యాక్స్‌ పేయర్లు పెరిగారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలో ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరిగాయని, తక్కువ ఆదాయం ఉన్న వారు మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ఆదాయాల కేటగిరీల్లోకి వెళుతున్నారని... ఆదాయాన్ని వెల్లడించి పన్ను చెల్లిస్తుండటంతో ట్యాక్స్‌ పేయర్ల సంఖ్య పెరుగుతోందని సంస్థ తెలియజేసింది. ఫలితంగా 2023లో ఐటీ రిటర్నుల దాఖల్లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, తమిళనాడు, హరియాణా, కర్ణాటక రాష్ట్రాలు అగ్ర స్థానాల్లో నిలిచాయి.

దేశంలో 2014 నుంచి 2023 వరకు మధ్యతరగతి ప్రజల సగటు ఆదాయం పెరుగుదల ఇలా.. (రూ.లక్షల్లో)

సంవత్సరం	సగటు ఆదాయం
2014	4.4
2015	5.2
2016	-
2017	7.5
2018	9.5
2019	10.4
2020	10.8
2021	10.6
2022	11.0
2023	13.0

దేశంలో 2025 నుంచి 2047 వరకు మధ్యతరగతి ప్రజల సగటు ఆదాయం పెరుగుదల అంచనా ఇలా.. (రూ.లక్షల్లో)

2025	17.2
2030	24.2
2035	28.3
2040	34.5
2045	44.2
2047	49.7



పెరుగుతున్న మధ్యతరగతి ప్రజల ఆదాయం..

ఎస్‌బీఐ రీసెర్చ్‌ నివేదిక మేరకు... 2014లో దేశంలో మధ్యతరగతి ప్రజల సగటు ఆదాయం రూ.4.4 లక్షలు. 2023 నాటికి అది రూ.13 లక్షలకు పెరిగింది. 2047 నాటికి ఇది రూ.49.7 లక్షలకు పెరుగుతుందని అంచనా. గడిచిన పదేళ్లలో రూ.5 లక్షల ఆదాయ కేటగిరీ నుంచి రూ.10 లక్షల ఆదాయ కేటగిరీలో పన్ను చెల్లించే వారు ఏకంగా 8.1 శాతం పెరిగారు. అలాగే రూ.10 లక్షల ఆదాయ కేటగిరీ నుంచి రూ.20 లక్షల ఆదాయ కేటగిరీకి వెళ్లిన వారు 3.8 శాతం మంది. ఇక రూ.20 లక్షల ఆదాయ కేటగిరీ నుంచి రూ.50 లక్షల కేటగిరీకి చేరింది 1.5 శాతం. రూ.50 లక్షల కేటగిరీ నుంచి రూ.1 కోటి కేటగిరీకి 0.2 శాతం మంది, రూ.1 కోటికి పైగా ఆదాయ కేటగిరీలో 0.02 శాతం మంది పెరిగారని నివేదిక విశ్లేషించింది.

ఐటీ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల సంఖ్య కూడా పెరుగుదల

ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చే ఉద్యోగుల సంఖ్య కూడా పెరుగుతున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్‌ వెల్లడించింది. దేశ జనాభా 2023లో 140 కోట్లుండగా 2047 నాటికి ఇది 161 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది. ఇందులో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య 53 కోట్లు. 2047 నాటికి 72.5 కోట్లకు పెరగవచ్చని అంచనా. అంటే.. మొత్తం జనాభాలో ప్రస్తుతం ఉద్యోగులు 37.9 శాతం ఉండగా 2047 నాటికి 45 శాతానికి పెరుగుతారని నివేదిక వెల్లడించింది. 2023లో ఐటీ పరిధిలోకి 31.3 కోట్ల మంది ఉద్యోగులు రాగా 2047 నాటికి 56.5 కోట్లకు ఈ సంఖ్య పెరగవచ్చని అంచనా. ట్యాక్స్‌ పేయర్లలో ఉద్యోగుల వాటా ప్రస్తుతం 59.1 శాతం ఉండగా 2047 నాటికి ఇది 78 శాతానికి పెరుగుతుందని వెల్లడించింది.



మెప్మాలో ఇంటి దొంగల అరెస్ట్‌

• ఫోర్జరీ సంతకాలతో రూ.1.45 కోట్ల స్వాహా ఘటనలో..
• ఫేక్‌డాక్యుమెంట్లు, ఆధార్‌ కార్డులతో బ్యాంకుకు టోకరా

మదనపల్లె: ఫేక్‌ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో బ్యాంకును మోసగించి కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిన మెప్మా ఇంటిదొంగలను అరెస్ట్‌ చేసినట్లు అన్నమయ్య జిల్లా మదనపల్లె టూటౌన్‌ సీఐ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా (కదిరి రోడ్డు బ్రాంచ్‌)లో 8 స్వయం సహాయక సంఘాల తరఫున మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్‌ (సీవో) అండే రవికుమార్, గ్రూపుల రిసోర్స్‌ పర్సన్స్‌ (ఆర్పీలు) పూలజ్యోతి, చెక్కల పద్మ ఫేక్‌ డాక్యుమెంట్స్‌ ఉపయోగించి తమ బ్యాంకులో రూ.1.45కోట్ల రూపాయల లోన్లు తీసుకుని, సొంతానికి వాడుకున్నట్లు బ్యాంక్‌ మేనేజర్‌ అనిల్‌కుమార్‌ ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా గ్రూపు సభ్యులను, మెప్మా, బ్యాంకు అధికారులను విచారించామని చెప్పారు. ఇండియన్‌ బ్యాంకు మేనేజర్‌ ఇచ్చినట్లుగా నకిలీ టేకోవర్‌ పత్రం.. గ్రూపు సభ్యుల నకిలీ ఆధార్‌కార్డులు, ఫేక్‌ డాక్యుమెంట్లు సమర్పించి బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా అధికారులను మోసగించి గ్రూపు సభ్యుల తరఫున సీవో అండే రవికుమార్, ఆర్పీలు పూలజ్యోతి, చెక్కల పద్మ లోన్లు పొందారన్నారు. బ్యాంకు ద్వారా పొందిన మొత్తాన్ని సీవో, ఆర్పీలు కాజేసినట్లు తేలిందని తెలిపారు. లోనుకు సంబంధించి సభ్యుల నుంచి చెల్లింపులు లేకపోవడంతో అనుమానం వచ్చిన బరోడా బ్యాంక్‌ మేనేజర్‌ అనిల్‌కుమార్‌ లోతుగా విచారిస్తే అసలు మోసం బయటపడిందన్నారు. దీంతో ఆయన టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆదివారం సాయంత్రం నిందితులను అరెస్ట్‌చేసి వారి నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్‌ కస్టడీకి పంపామన్నారు.

సీఎం జగన్‌ పాలనలో 16% పెరిగిన రాబడి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, చిత్రంలో ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, బాల నాగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్‌(కర్నూలు): సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో 16 శాతం రాబడి పెరిగిందని, అదే గత టీడీపీ ప్రభుత్వ పాలనలో కేవలం 6శాతం మాత్రమే ఉండేదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మిగనూరులోని పురపాలక సంఘ కార్యాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో 1995వ సంవత్సరం నుంచి 2003 వరకు రాష్ట్రానికి వచ్చిన ఆదాయం 12శాతం కాగా.. దివంగత నేత వైఎస్సార్‌ పరిపాలనలో 2004 నుంచి 2009 వరకు 21శాతం రాబడి వచ్చిందన్నారు. ప్రస్తుతం ఏపీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అయినా పచ్చ పత్రికలు అసత్య ప్రచారం చేస్తున్నాయని చెప్పారు. జిల్లా కేంద్రం కర్నూలులోని జగన్నాథ గట్టుపై జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు త్వరలో సీఎం వైఎస్‌ జగన్‌ భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు. రూ.140కోట్లతో అత్యాధునికంగా సిల్వర్‌ జూబ్లీ కళాశాల భవన నిర్మాణం, ఓర్వకల్‌ మెగా ఇండస్ట్రియల్‌ హబ్‌కు రూ.400 కోట్లతో నీరిచ్చేందుకు పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆర్‌డీఎస్‌ కుడి కాలువ నిర్మాణానికి సైతం శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. కర్నూలు జిల్లాలో అభివృద్ధిని గాలికి వదిలి కేవలం జింకలు, పులుల పార్కులు ఏర్పాటు చేస్తామని ప్రజలను మభ్యపెట్టిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. జెడ్పీ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్‌ సృజన, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, బాల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మలబార్‌ షిప్‌ విన్యాసాలు

27వ మలబార్‌ షిప్‌ విన్యాసాలు ఆస్ట్రేలియాలోని సిడ్నీ తీరం వద్ద సోమవారం ముగిశాయి. ఈ విన్యాసాలలో భారత నౌకాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, హెలికాఫ్టర్‌లు పాల్గొన్నాయి. అలాగే ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాలకు చెందిన నౌకాదళాలు, రక్షణదళం, యుద్ధ నౌకలు పాల్గొన్నాయి. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు సముద్రంలో.. అలాగే ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు తీరం వద్ద విన్యాసాలు ప్రదర్శన జరిగింది. భారత దేశం నుంచి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఐఎన్‌ఎస్‌ సహ్యాద్రి, ఐఎన్‌ఎస్‌ డిస్ట్రాయల్‌ పాల్గొన్నాయి. మలబార్‌ విన్యాసాల వల్ల ఇండో పసిఫిక్‌ శాంతి, భద్రత పెంపొందించినట్లయ్యింది.



ఆస్ట్రేలియా సిడ్నీ తీరం వద్ద నౌకల విన్యాసం

– మల్కాపురం (విశాఖ పశ్చిమ)

కంగుతిన్న కామ్రేడ్లు...!

• పొత్తుపై బీఆర్‌ఎస్‌ స్పందించకపోవడం, సీట్లు కేటాయించకపోవడంపై తీవ్ర ఆగ్రహం
• నేడు భవిష్యత్‌ కార్యాచరణపై చర్చ
• విడివిడిగా, కలివిడిగా వామపక్షాల సమీక్షలు
• కాంగ్రెస్‌తో దోస్తీకి ప్రయత్నం



సాక్షి, హైదరాబాద్‌: మునుగోడు ఉప ఎన్నికల వేళ బీఆర్‌ఎస్‌తో చిగురించిన వామపక్షాల పొత్తు అంతలోనే వాడిపోయింది. రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనే దమ్మున్న పార్టీ కేవలం బీఆర్‌ఎస్‌ మాత్రమే అని విశ్వసించిన కమ్యూనిస్టు పార్టీలు బీఆర్‌ఎస్‌ అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల ప్రకటనతో కంగుతిన్నాయి. మునుగోడు ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్‌ పలు సందర్భాల్లో మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌తో కమ్యూనిస్టుల పొత్తు కొనసాగుతుందని చెప్పారు. తీరా ఇప్పుడు వామపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ప్రకటించడంపై వామపక్షాల నాయకులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో బీఆర్‌ఎస్‌తో పొత్తులేదని స్పష్టం కావడంతో ఎలక్షన్లకు ఎలా సన్నద్ధం కావాలో తేల్చుకునేందుకు వామపక్షాలు తర్జనభర్జన పడుతున్నాయి.

కార్యాచరణపై సమావేశాలు

బీఆర్‌ఎస్‌ వైఖరితో కంగుతిన్న సీపీఎం, సీపీఐ పార్టీ లు భవిష్యత్‌ కార్యాచరణ కోసం మంగళవారం సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించాయి. ఇందులోభాగంగా సీపీఎం, సీపీఐ రాష్ట్ర పార్టీ కార్యాలయాల్లో ముఖ్యనేతలతో చర్చలు జరిపి ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ముందుగా రెండు పార్టీలు విడివిడిగా సమావేశమైన తర్వాత ఉమ్మడి గా సమావేశాలు నిర్వహించాలని యోచిస్తున్నాయి. ఇందులో భాగంగా మేథోమథనానికి సిద్ధమయ్యా యి. ఏదేమైనా ఈసారి కలిసి ఉండాలని నిర్ణయించుకున్న వామపక్ష పార్టీలు అతి త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

టార్గెట్‌ బీజేపీ: వామపక్షాల ప్రధాన ప్రత్యర్థి బీజేపీ. దేశంలో బీజేపీని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకత్వం కాంగ్రెస్‌తో జతకట్టింది. కానీ రాష్ట్రంలో బీజేపీని గట్టిగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర నాయకత్వం బీఆర్‌ఎస్‌తో కలిసి నడిచింది. మునుగోడు ఎన్నికల్లో బీజేపీని ఎదిరించడంలో వామపక్షాల పాత్ర కీలకంగా ఉందని, అందుకే పొత్తు పొడిచిందని కామ్రేడ్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఆ పార్టీతో పొత్తు ముగియడంతో ప్రత్యామ్నాయ ప్రయత్నాలు సాగిస్తున్నాయి. దేశంలో జత కట్టిన కాంగ్రెస్‌తో ఇప్పుడు పొత్తులు కొనసాగించే అంశంపై నేటి సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ప్రత్యర్థి పార్టీతో పొత్తులు సాగించిన కామ్రేడ్లతో రాష్ట్ర కాంగ్రెస్‌ కలిసిపోతుందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో జాతీయ నాయకత్వంపై ఒత్తిడి చేసే కోణంలోనూ వామపక్ష నేతలు యోచిస్తున్నారు. బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందన్న సమయంలో తమకు మూడోవంతు సీట్లు కేటాయించాలని కామ్రేడ్లు డిమాండ్‌ చేశారు. అయితే కాంగ్రెస్‌తో పొత్తు సమయంలో సీట్ల సంఖ్యను ఏమేరకు పరిమితం చేయాలనే అంశంపైనా చర్చించనున్నట్లు తెలిసింది. మరోవైపు పొత్తులు లేకుండా ఉమ్మడిగా పోటీ చేసే అంశంపైనా చర్చించనున్నారు. ఇప్పటివరకు చెరో పాతిక స్థానాల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సీపీఐ, సీపీఎంలు ఇప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటాయో వేచిచూడాలి.

రుణమాఫీలో రికార్డు

• ఎస్‌ఎల్‌బీసీ భేటీలో మంత్రి హరీశ్‌రావు
• పదేళ్ల కాలంలో రెండుసార్లు రైతులకు పంట రుణాలు మాఫీ
• ఇప్పటివరకు రూ.16.66 లక్షల మంది ఖాతాల్లో రూ.8,098 కోట్లు జమ



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో హరీశ్‌ రావు

సాక్షి, హైదరాబాద్‌: రైతుల పక్షాన నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం కేవలం తెలంగాణలో మాత్రమే ఉందని, పదేళ్ల కాలంలో రెండుసార్లు రైతులకు పంట రుణాలు మాఫీ చేసి రికార్డు సృష్టించిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. కరోనా వల్ల రాష్ట్రానికి ఆదాయం తగ్గినప్పటికీ రైతుల ప్రయోజనం కోసం రుణమాఫీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. తాజాగా రాష్ట్రంలోని 37 లక్షల మందికి రూ.20,141 కోట్ల మేర రుణమాఫీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు రూ.99,999 వరకు రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ అమలు చేశామని, రూ.16.66 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.8,098 కోట్లు జమ అయ్యాయని వివరించారు. రుణమాఫీ, రెన్యువల్‌ తీరును పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్‌ కమిటీని ఏర్పాటు చేస్తామని, ఇందులో ఆర్థిక, వ్యవసాయ శాఖ కార్యదర్శులు, బ్యాంకింగ్‌ రంగ ప్రతినిధులు ఉంటారని తెలిపారు. సోమవారం బేగంపేటలోని వివాంటా హోటల్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం(ఎస్‌ఎల్‌బీసీ) జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు.

ఆ ఘనత ముఖ్యమంత్రిదే..!

దేశంలో పలు రాష్ట్రాలు రుణమాఫీ అంశంపై అనేక పరిమితులు విధించాయని, కానీ ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మాత్రమే అని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ మినహా మరే రాష్ట్రం కూడా పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయలేదని పేర్కొన్నారు. రుణమాఫీతో రైతుకు భారీ ఊరట లభిస్తుందని అన్నారు. ఒకవేళ రైతు రుణ మొత్తాన్ని చెల్లించి ఉంటే ఆ మేరకు నగదును రైతుకు ఇవ్వాలని సూచించారు. కొందరు రైతులకు బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు వంటి పాత రుణాలు ఉండొచ్చని, ఇప్పుడు వచ్చిన డబ్బులను పాత అప్పు కింద జమ చేయకూడదని స్పష్టం చేశారు. రుణమాఫీ ప్రక్రియను నెలరోజుల్లోగా పూర్తి చేసేలా బ్యాంకులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌లోకి రేఖా నాయక్‌!

• నేడు మాణిక్‌రావు ఠాక్రేతో భేటీ కానున్న బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే
• ఖానాపూర్‌లో మరోసారి టికెట్‌ ఇవ్వకపోవడంతో నిర్ణయం
• ఇప్పటికే రేవంత్‌ సమక్షంలో పార్టీలో చేరిన ఆమె భర్త శ్యాం నాయక్‌

సాక్షి, హైదరాబాద్‌: బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల జాబితా రాజకీయ సమీకరణాలను మారుస్తోంది. ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు ఆ పార్టీ టికెట్‌ నిరాకరించింది. దీంతో వారిలో ఒకరైన ఖానాపూర్‌ ఎమ్మెల్యే రేఖా నాయక్‌ తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. కాంగ్రెస్‌లో చేరాలని ఆమె నిర్ణయించుకొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో భేటీ కానున్నారు. ఈ పరిణామాల్లో భాగంగానే.. ఎమ్మెల్యే రేఖా నాయక్‌ భర్త, మాజీ రవాణా శాఖ అధికారి శ్యాం నాయక్‌ సోమవారం రాత్రే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరిపోయారు. ఆయనకు ఆసిఫాబాద్‌ టికెట్టు ఖరారైనట్లు సమాచారం. రేఖా నాయక్‌ను కూడా కాంగ్రెస్‌లో చేర్చుకొని ఖానాపూర్‌ సీటు ఇవ్వాలని కాంగ్రెస్‌ పార్టీ భావిస్తోంది. కాగా ఆదిలాబాద్‌ ఉమ్మడి జిల్లాలో బోథ్, ఆసిఫాబాద్‌ స్థానాలకు కూడా బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను మార్చింది. ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఆదిలాబాద్‌ పార్లమెంటు సీటు ఇస్తామని చెప్పినా.. ఆయన కూడా అసంతృప్తితోనే ఉన్నట్లు సమాచారం. సక్కు గత ఎన్నికల్లో ఆసిఫాబాద్‌ నుంచి గెలిచి వెంటనే బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇలావుండగా బోథ్‌ ఎమ్మెల్యే బాపూరావు రాథోడ్‌కు కూడా ఈసారి బీఆర్‌ఎస్‌ టికెట్‌ దక్కలేదు.

ఓటమి భయంతోనే 'కామారెడ్డికి' కేసీఆర్‌



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల ప్రకటన.. సీజన్‌ రాకముందే కోయిల కూసింది అన్నట్లుగా ఉందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. ప్రత్యేక అభివృద్ధి పేరుతో గజ్వేల్‌ నియోజకవర్గంలో లెక్కలేనంత ఖర్చు పెట్టినా.. అక్కడ గెలిచే పరిస్థితిలేదనే కేసీఆర్‌ మరో చోటుకు వెళ్తున్నారని విమర్శించారు. ఈసారి గజ్వేల్‌లో ఓడిపోతున్నారనే సర్వే ఫలితాల భయంతోనే కేసీఆర్‌ కామారెడ్డికి పారిపోతున్నారని భట్టి అన్నారు. కేసీఆర్‌ రెండు చోట్ల పోటీ చేయాలన్న నిర్ణయంతోనే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఓడిపోతుందనేది అర్థం అవుతోందని.. బీఆర్‌ఎస్‌ నేతలు పార్టీలు మారుతారనే ఆందోళనలోనే కేసీఆర్‌ అభ్యర్థుల ప్రకటన ముందే చేశారని అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల ప్రకటన అనంతరం ఢిల్లీలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. కేసీఆర్‌కే గెలిచే పరిస్థితి లేకపోతే, ఆయన బొమ్మ పెట్టుకుని గెలిచే పరిస్థితి ఉంటుందా అని ప్రశ్నించారు. తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని.. గెలిచేది కాంగ్రెస్‌ పార్టీయేనని ధీమా వ్యక్తంచేశారు. ఏ లక్ష్యాలకోసం తెలంగాణ సాధించుకున్నామో.. ఆ లక్ష్యాలన్నీ కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్‌ పార్టీ తెలంగాణలో ఫిబ్రవరి, మార్చి నుంచే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టిందని.. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కాగా, సెల్ఫీ విత్‌కాంగ్రెస్‌ అభివృద్ధి అనే కార్యక్రమంతో మరోసారి ప్రజల్లోకి వెళ్తామని.. కాంగ్రెస్‌ హయంలో చేసిన అభివృద్ధి పనులను సెల్ఫీ తీసుకొని ప్రజలతో పంచుకుంటామని తెలిపారు. బీఆర్‌ఎస్‌ పాలనతో నష్టపోయిన వారందరూ కాంగ్రెస్‌తో కలసిరావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943